

# కథామంజరి

## పది కథల సమాహారం

ఆగస్టు 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**ఆగస్టు 2024**

సంపుటి : 5 ♦ సంచిక 7



# కథామంజరి
# పాఠకులకు
# మా
# కృతజ్ఞతలు





# బాలకథ

జులైనెలసంచికనుంచిప్రతీనెలాకథామంజరిలో, పిల్లలకథలురెండుప్రచురింపబడతాయి! ఈ కథల విషయమై చిన్న సూచనలు:


- 10-16 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న పిల్లలు స్వయంగా ఆలోచించి, వారికున్న ఆలోచనలకి అక్షర రూపం ఇవ్వాలి. కథాంశం ఏదైనా వ్రాయవచ్చు. పిల్లలు ఇష్టపడే కథలు, పిల్లలు అర్థం చేసుకునే స్థాయిలో కథారచన ఉండాలి.
- 400 పదాలకు మించకుండా ఇలా వర్డ్ లో టైపు చేసి పంపాలి!
- కథ ఎలా వ్రాసినా సరే, ప్రచురణకు స్వీకరించే కథలను తగు రీతిలో మార్పులు, చేర్పులు చేసి ప్రచురణ చేయబడతాయి!
- పెద్దవారు కూడా పిల్లల కథలు వ్రాసి పంపవచ్చును. అవి కూడా ప్రచురణకు తీసుకోబడతాయి!
- పెద్దవారు వారి కథలను పిల్లల పేరుతో వ్రాసి పంపడం అనైతికమే కాకుండా, మా ఈ ప్రయత్నాలకు ఆశించిన ఫలితాలు దక్కకుండా చేస్తాయి!
- ప్రచురింపబడే కథలకు తగిన పారితోషికం కూడా ఉంటుంది!
- కథలు పంపవలసిన మా ఇమెయిల్: submit@kathamanjari.in

కథలు వ్రాయగలిగే పిల్లల్ని ప్రోత్సహిస్తూ, వాళ్ళల్లో సృజనాత్మకతకు పదును పెట్టే మా ఈ ప్రయత్నాలలో అందరి సహాయ సహకారాలను అందించ కోరుతున్నాం!



★★★

**కథామంజరి బృందం**





# మా జట్టు


సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నందూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


కథాకీయం ........ i

విశిష్ట అతిథి ........ ii

కథామార్గదర్శి ........ iv

వినదగునెవ్వరు చెప్పిన ........ vi

కథాపరిచయం ........ viii

కథాపుస్తక పరిచయం ........ x


## కథలు, వ్యాసాలు


పల్లె పిలుపు ........ వసుంధర ........ 1

తల్లి చిరునామా.. ........ గాయిత్రి ........ 6

పయనించే ఓ చిలుకా! ........ తాతా కామేశ్వరి ........ 12

సహచరుడు ........ శింగరాజు శ్రీనివాసరావు ........ 16

మాగంటి అమ్మిరాజు గారి కవతం ........ పెనుమాక రత్నాకర్ ........ 20

ఎవరు అనాథలు? ........ నిష్టల సుబ్రహ్మణ్యం ........ 24

అమ్మ మాట వినాలి (బాల కథ) ........ కొత్తపల్లి రవికుమార్ ........ 29

పరివర్తన (బాల కథ) ........ నన్ద త్రినాథరావు ........ 32

ఈ రోజు పనిమనిషి రాలేదు ........ పోలాప్రగడ రాజ్యలక్ష్మి ........ 34

మోటు మనిషి ........ కీ. శే. కె. ఎన్. వి. పతంజలి ........ 38



Cover Page Credit : rawpixel.com

# కథాకీయం

మొన్నో రోజు ఉదయాన్నే "మీ కథలు బావున్నాయి. కానీ ఒకట్రెండు కథల్లో కథాకాలం ఒక దగ్గర గాడి తప్పింది. అది తప్పితే కథలు అన్నీ మంచివే!" అంటూ ఓ పెద్దాయన ఫోన్ చేసి అన్నారు. "అవునా..." అంటూ, ఆ కథల వివరాలు అడిగాను. పలానా కథాకాలం పందొమ్మిది వందల అరవై, డెబ్బై దశకంలో నడిచింది. మధ్యలో ఓ దగ్గర "వీడు విశ్వనాథ్ గారంత వాడవుతాడు" అని ఓ క్యారెక్టర్ అంటుంది. నిజానికి ఆ రోజుల్లో విశ్వనాథ్ గారికి అంత పేరు లేదు. ఒకటో రెండో ఆయన సినిమాలు వచ్చాయి గాని, సామాన్య ప్రేక్షకులకు ఆయనెవరో తెలియదు. ఎనభై దశకంలో ఆయనకి మంచి గుర్తింపొచ్చి, ప్రముఖుల్లో చేరారు!" అంటూ మరో రెండు, మూడు విషయాలు చెప్పారు. గతంలో పెద్ద పెద్ద రచయితల కథల్లో కూడా ఇలాంటి పొరపాట్లు దొర్లాయని, ఇతిహాస గ్రంథాలు వ్రాసిన వారు కూడా కథాకాల విషయంలో అక్కడక్కడ పొరపాట్లు దొర్లించేరని అన్నారు. ఆ పెద్దాయన మరెవరో కాదు... ప్రముఖ సాహితీవేత్త, సంస్కృతాంధ్ర పండితులు, పద్యకవి, అవధాని, కేంద్ర విశ్వవిద్యాలయ విశ్రాంత అధ్యాపకులు, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు! కేవలం వారు, పద్య, గద్య రచనలకే పరిమితం కాకుండా... కథలు, కవితలను కూడా చదువుతూ, ఆయా రచయితలకు ఇలాంటి సూచనలు చేస్తూ, ప్రోత్సహిస్తున్నందులకు, ఆయనకి కథారచయితల తరపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఆ సందర్భంలోనే, ఇలాంటి తప్పిదమే మరొకటి జ్ఞాపకం వచ్చి, ఆయనతో ముచ్చటించాను. ఓ పాతిక సంవత్సరాల క్రిందట, ఇండియా టుడే పత్రిక వారు, తెలుగు సినిమా మీద వ్యాసరచన పోటీ నిర్వహించారు. అందులో మొదటి బహుమతి వచ్చిన వ్యాసంలో మాయాబజార్ సినిమాకి సంబంధించి నాలుగైదు మంచి విషయాలతో పాటు, ఈ కథాకాల విషయం కూడా ప్రస్తావించారు. ఆ సినిమాలో, ఉత్తర కుమారుడి ప్రవేశ ఘట్టంలో "సమయానికి తగు మాటలాడెనే..." అనే త్యాగరాజవారి కీర్తనను రాగయుక్తంగా ఆలాపిస్తూ, కనబడతాడు. మహాభారత కాలం ముగిసిన కొన్ని వేల సంవత్సరాల తర్వాత, ఈ త్యాగరాజ కీర్తన వచ్చింది కదా, అలాంటిది ఆ కీర్తనని ఉత్తర కుమారుడు ఆలాపించడం తప్పిదం.. అంటూ వ్యాసకర్త విమర్శ చేస్తే, "ఉత్తరకుమారుడు సాహిత్యంతో పాట పాడలేదు, ఆ పాటని రాగయుక్తంగా ఆలాపన చేసాడు. సంగీతానికి కాలం ఉండదని" వివరణ ఇచ్చారు.

ఈ విషయాలు ప్రస్తావించడానికి ప్రధాన కారణం.. కథాకాలం విషయంలో నేటి కథకులు మరింత జాగరూకత వహించాలని తెలియచేయడానికి మాత్రమే! సులువుగా అర్థం కావాలంటే...ఓ ఏభై సంవత్సరాల క్రిందటి వాతావారణం, సమాజ పరిస్థితులను కథావస్తువుగా ఇప్పుడు కథ రాస్తూ, అందులో 'సెల్లో ఫోన్ లో మాట్లాడాడు' అని ఏదో ఒక సందర్భానుసారంగా వ్రాస్తే, కథ సహజత్వం దెబ్బతింటుంది. ఇది కనీకనబడని, పెద్ద తప్పు! కథకులు ఎంత పెద్దవారయినా, పుంఖానుపుంఖాలుగా రచనలు చేసినా సరే, ఇలాంటి చిన్న తప్పుల వలన చెడ్డ పేరొస్తుంది.

మరో గొప్ప విషయం ఏమిటంటే.. శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారు, అస్సలు తీరికలేని సాహితీసేవలో మునిగిపోయి కూడా చదవడానికి సమయం కేటాయించి, ఇప్పుడు వచ్చే కథలను కూడా చదువుతూ, సూచనలు చేస్తూ అభినంధనలు చెప్తూ, ఆయా రచయితలను ప్రోత్సహించడం చాలా గొప్ప విషయం, మార్గదర్శనీయం.

ఇక... వ్యావహారిక భాషలో తెలుగు కథ పుట్టిన తర్వాత, అటు కథకులను ఇటు తెలుగు కథలను ముందు తరాల వారికి పరిచయం చేయడానికి కథలను ప్రచురించే పత్రికల గురించి ఓ నాలుగు విషయాలను ముచ్చటించాలనే ఆలోచనతో, ఈ సంచిక నుంచే కథాపుస్తక పరిచయంలో ఆరంభిస్తున్నాం! విషయ సేకరణ... కష్టమే.. గాని అసాధ్యం కాదు కదా!

**సంపాదకుడు**

విశిష్ట అతిథి



**శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి**

అందరి జీవితాల్లో ఏదో విధమైన కష్టాలు వస్తాయి. తప్పదు. అమ్మో అని బెంబేలు పడిపోకుండా, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. నేను కూడా అలాంటి కష్టాలకి అతీతురాలిని కాను. ఓ రకంగా నా సాహితీ అభిలాష, కథలు వ్రాయగలిగే ఓ వరం... నా కష్టాల్లో నుంచి బయటపడేసాయి. ఈ అనుభవాలను కథలుగా వ్రాస్తే, అది అందరి హృదయాల్లో నాటుకుపోతాయి. నేను రాసిన ప్రతీ కథలో, పాఠకులందరికి నిత్యం కనిపించే పాత్రలే కనబడతాయి. కష్టాల్లో ఉన్నవారికి సేద తీరుస్తాయి. నావే కాదు, అలాంటి కథలు ఎవరు వ్రాసినా, అవి మన జీవితాల్లో ఎక్కడో ఓ దగ్గర మనకు ఉపయోగపడతాయి. వాటిని ఆదర్శంగా తీసుకోవాలి, చదివి మరచిపోకూడదు!" అంటూ కథలు వ్రాసేవారికి, చదివే వారికి ఆదర్శంగా నిలిచి, తెలుగు సాహితీరంగంలో భార్యాభర్తలు ఇద్దరూ రచయితలుగా పేరు తెచ్చుకున్న కొద్దిమంది దంపతులలో ప్రముఖులు, మొన్నటి తరం కథా, నవలా రచయిత్రి శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మిగారు... నేటి మన విశిష్ట అతిథి. ప్రముఖ కథా, నవలా సాహితీవేత్త కీ.శే. పోలాప్రగడ సత్యనారాయణమూర్తిగారు వీరి భర్త. ఆ రోజుల్లో భార్యాభర్తలు ఇరువురూ పేరు పొందిన రచయితలుగా గుర్తింపు పొందిన జంటల్లో వీరు కూడా ఒకరు.

మన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విస్తృతంగా కృషి చేసిన ఆనాటి సంఘ సేవకురాలు, కథారచయిత్రి శ్రీమతి కనుమర్తి వరలక్ష్మమ్మ గారి జీవితం (1896-1978) పై లఘు గ్రంథాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ కోరిక మేరకు రాజ్యలక్ష్మి గారు రచించడం, ఆ రచనకు రవీంద్ర భారతి విశ్వవిద్యాలయం వారి జీవిత సాఫల్య పురస్కారం అందుకోవడం, ఓ గొప్ప వరమని భావిస్తారు రాజ్యలక్ష్మిగారు. వీరి మరో కథ 'నల్లపూసలు'ను దూరదర్శన్‌లో జాతీయ ప్రసారాల కోసం తెలుగుభాష తరపున ఎంపిక చేసి, 'కాలాపూసా' పేరుతో దృశ్యరూపకంగా ప్రసారం చేశారు. ఇది కూడా ఓ అరుదైన గుర్తింపే! చిన్నప్పట్నుంచీ సంగీత సాహిత్యాల పట్ల మక్కువ కలగడానికి, వీరి తల్లిగారు కారణం అంటారు. ప్రముఖ సంగీత విద్వాంసులు కీ.శే. నేదునూరి కృష్ణమూర్తిగారు వీరికి దగ్గర బంధువు. వారి ప్రభావంతో సంగీతం పట్ల మక్కువ, ఇంట్లో ఉండే చాలా గ్రంథాలు చదవడం వలన, కథలు వ్రాయాలనే తపన... చిన్నతనంలోనే వచ్చాయి. "పుస్తకాలు చదువుతున్నప్పుడు, ఆ కథ ఎలా వ్రాసారు, నవల ఎలా వ్రాసారు... అనే ఓ ఆలోచన నాకు చిన్నప్పుడు వచ్చి, ఎప్పుడు నేను రాస్తానా అనే ఓ ఉబలాటం ఉండేది. అదే నాకు స్ఫూర్తి ఇచ్చింది!" అంటూ తన రచనాప్రస్థానం గురించి చెప్తారు. వందకు పైగా కథలు, పధ్నాలుగు నవలలు, ఎన్నో వ్యాసాలు, కవితలు వ్రాసిన రాజ్యలక్ష్మిగారు "ఏమైనా సరే కథ వ్రాయాలి" అనే కథతో 1964 లో కథా సాహిత్యం వైపు మొదటి అడుగు వేసారు. చిన్నతనంలోనే సత్యనారాయణమూర్తి గారితో వివాహం అయింది. అప్పటికే ఆయన కథలు వ్రాస్తూ ఉండేవారు. ఆ తర్వాత వారి జీవితం మూడు నవలలు, ఆరు కథలుగా సాగింది.

రాజ్యలక్ష్మి గారి కథల్లో గాని, నవలలో గాని ఓ ప్రత్యేకమైన సందేశం ఉంటుంది. వివాహ వ్యవస్థ నుంచి, మధ్యతరగతి కుటుంబాలలో ఉండే మంచిచెడులు, చుట్టూ ఉన్న సమాజం, సంగతుల మీద కథాంశాలు నడుస్తాయి. వీరి ఏ కథైనా, పాఠకుడి ఆలోచన పరిధిని పెంచేటట్టు ఉంటుంది. ఇంగ్లీషు ప్రభావం వలన తెలుగు సాహిత్యం, సంస్కృతి కాలగర్భంలో కలిసిపోతాయని, దాని వలన సమాజం దెబ్బతింటుందని 1982లో రాజ్యలక్ష్మిగారు "కొత్త చిగురు-మంచు బిందువులు" అనే నవలలో హెచ్చరించారు. నాగార్జున

## విశిష్ట అతిథి

యూనివర్సిటీ వారు నిర్వహించిన నవలల పోటీలో ఈ నవలకి బహుమతి కూడా వచ్చింది. సాహిత్యంలో అన్ని ప్రక్రియలను అభిమానించే రాజ్యలక్ష్మి గారు, రామాయణ కథను, తనదైన శైలిలో వంద కవితలుగా వ్రాసారు. ఒక కథ అయినా, నవలైనా సరే అవసరం మేర విషయ పరిశోధన చేసే వ్రాసేవారు. దినపత్రికలలో వచ్చే ఆకర్షణీయమైన చిన్నచిన్న విషయాల మీద కథలు వ్రాయడం రాజ్యలక్ష్మి గారికి చాలా ఇష్టం. బొంబాయిలో ఓ ప్రొఫెసర్ గారు, ఇంకో లేడి ప్రొఫెసర్ గారంటే ముద్దొచ్చి, ముక్కు కొరికితే... ఆ లేడీప్రొఫెసర్ పోలీసులకి కంప్లైంట్ చేసిన వార్త చదివి, ఓ హాస్యకథ వ్రాసారు. రాజ్యలక్ష్మిగారి రచనలకి భర్త సత్యనారాయణమూర్తిగారు మొదటి పాఠకుడైతే, ఆయన రచనలకి రాజ్యలక్ష్మిగారే మొదటి పాఠకురాలుగా సాగిన వీరి సంసార, సాహితీప్రస్థానంలో, సాహిత్య సంభాషణ, ప్రస్తావన లేని రోజు లేదు. కథలో వైవిధ్యం, పాత్రచిత్రణలో సామర్థ్యం, కథనంలో నేర్పరితనం, రచనలో సామాజిక ప్రయోజనం, ప్రస్ఫుటంగా కనబడతాయి. వీరి కథ "నిజానిజాలు" ని 1989లో అమెరికా ఫెమినిస్ట్ సొసైటీ వారు, వరల్డ్ బెస్టు ఉమెన్ రైటర్స్ కథల్లో ప్రచురించారు. అలాగే రాజ్యలక్ష్మిగారి ఆరు కవితలను ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు 'ఎంతాలజీ' లో ఒక పేజీలో కవితని, మరో పేజీలో ఆంగ్ల అనువాదాన్ని ప్రచురించారు. నిజానికి ఎనిమిదవ తరగతి వరకే చదివిన రాజ్యలక్ష్మిగారు, తన రచనల మీద ఎందరో పి.హెచ్.డి.లు చేయగలిగే జ్ఞానసంపదను కేవలం పుస్తకపఠనంతో సాధించారు. ఐదు కథాసంపుటాలు, రేడియో ప్రసంగ వ్యాసాలు, కవితాసంపుటాలు, నవలలుగా పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. మద్రాసు తెలుగు అకాడమీ సాహిత్య పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది సాహిత్య పురస్కారాలతో పాటు, పలు యూనివర్శిటీల అవార్డులు కూడా అందుకున్న రాజ్యలక్ష్మి గారు, నేటికి రచనలు చేస్తూ, సాహితీ సభలను అలరిస్తున్నారు.

ఎనభై నాలుగు వసంతాలు నిండుగా నింపుకుని, ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేయమని కోరగా... ఎంతో ఉత్సాహంగా, అంచెలంచెలుగా, మాకు ఎన్నో సాహితీ సంగతులను ఓపిగ్గా అందచేసిన శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మిగారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా, ఆనందంగా సాహితీసేవలు అందచేయగలరని అభిలషిస్తున్నాం!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



## కీ.శే. కె.ఎన్.వై. పతంజలి

చాలా యాదృచ్ఛికంగా ఈ నెల కథామార్గదర్శి కీ.శే. కె.ఎన్.వై. పతంజలి గారిని తలుచుకుంటున్నాం! దేశంలోనూ, ఆంధ్రరాష్ట్రంలోనూ ఎన్నికలు ముగిసి, గెలిచినవారు పగ్గాలు చేపట్టారు. ఇలా ఎన్నడు ఎన్నికలు జరిగినా, ఆయన వ్రాసుకున్న ఓ వాఖ్యానం గుర్తుకు వస్తుంది. 1984లో జరిగిన ఎన్నికల తర్వాత రాసిన ఈ మాటలు, ఇప్పటికీ వాస్తవాలుగానే కనబడతాయి.

"మన మీద మనకు కొంత అసహ్యం వేస్తుంది.

మన మీద మనకు కొంత రోత పుడుతుంది.

మన బుద్ధి గడ్డి తింటున్నదని తెలిసి సిగ్గేస్తుంది.

ఎన్నికల పతాకాలు విప్పేసిన తర్వాత,

గుడారాలు పీకేసిన తర్వాత

పట్టాభిషేక మహోత్సవం ముగిసిన తర్వాత

తుపాకి ఇంకా మనకే గురిపెట్టి ఉందని తెలుస్తోంది.

మన ఓటే మనల్ని కాటేసిందని తెలుస్తుంది.

ఈ మొహం మరో ఐదేళ్ల వరకూ ఎవరికు చూపించలేం గదా అనిపిస్తుంది. దిగులేస్తుంది!"

సమాజం గురించి, వ్యక్తులు గురించి, వ్యక్తిత్వాల గురించి వ్యవస్థల గురించి... సూటిగా వేడిగా బాణాలు సంధించి వ్రాయగలిగిన రచయితగా గుర్తింపు పొందిన పతంజలిగారి అసలు పేరు కాకర్లపూడి నారసింహ యోగ పతంజలి.

విజయనగరం జిల్లా అలమండ గ్రామంలో 1952 లో జన్మించిన పతంజలిగారు, తండ్రిగారి దగ్గర ఆయుర్వేద శాస్త్రాన్ని నేర్చుకున్నారు. చోడవరం, విజయనగరాలలో విద్యాభ్యాసం చేసి, ఈనాడు దినపత్రికలో ప్రారంభం నుంచే అంటే 1975 నుంచే సబ్ఎడిటర్ గా ఓ దశాబ్దం పాటు పనిచేసారు. తర్వాత కాలంలో ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, టి.వి.9, సాక్షి పత్రికలలో సంపాదకుడుగా పనిచేసారు. ఒకట్రెండు సినిమాలకి మాటలు వ్రాస్తే, సింధూరం సినిమాకి సంబంధించి పతంజలిగారికి రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు వచ్చింది.

పతంజలిగారి కథలలో ఓ ప్రత్యేకత కనబడుతుంది. ఆయన విద్యార్థి దశ నుండి, ఆ కాలంలో ఉత్తరాంధ్రలో జరిగిన ఉద్యమాల ప్రభావం, భూస్వామ్య కుటుంబాలలో ఉండే విపరీత పరిస్థితులు, ఆ ప్రాంతాల్లో ఆయన అనుభవాలు.. ఇవన్నీ ఆయన రచనలో కనబడతాయి. అలాగే.. ఇంట్లో కుటుంబ సభ్యులలో వేటాడేవారు కూడా ఉండేవారు. వారి అనుభవాలు, వాళ్ళు చెప్పే కథలు

# కథా మార్గదర్శి

పతంజలిగారిని చిన్నప్పుడే బాగా ఆకర్షించుకున్నాయి. ఇక... ఇటు తెలుగు సాహిత్య శ్రేష్ఠులు చాసోగారు, కారా మాష్టారు, పురిపండ, రావిశాస్త్రి, శ్రీశ్రీ గార్లతో పరిచయాలు కూడా ఎక్కువే. ఆ ప్రభావం కూడా ఎక్కువనే చెప్పాలి. విలక్షణమైన శైలి, భాషాప్రయోగం, వస్తువు, కథనం... వంటి కథాలక్షణాలలో వ్యంగ్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. స్వతహాగా ఉత్తరాంధ్రా వాసి కావడం వలన, ఆ మాండలికంలో సొగసుగా కథ వ్రాయగల నైపుణ్యం వచ్చింది పతంజలిగారికి. చెకోవ్, మొపాసా, గురజాడ, ఆస్కార్ వైల్డ్, సెర్వాంటీజ్ మొదలైన ఆంగ్ల రచయితలను బాగా చదివి, ప్రభావితం కాబడిన పతంజలిగారు, ఫక్తు క్షత్రియ వంశంలో పుట్టి, నాలుగిళ్ళ లోగిట్లో సాంప్రదాయ వాతావరణంలో పెరిగినా సరే, అభ్యుదయ భావాలతో పెరిగారు. బాల్యం నుంచే బాగా పుస్తకాలు చదవడం అలవడింది. నిజానికి తన సాహితీప్రస్థానం పన్నెండో ఏట ప్రారంభమైంది. ఇంట్లో తండ్రి వద్దన్నా సరే, కొమ్మూరి సాంబశివరావు, విశ్వ ప్రసాద్ గార్ల డిటెక్టివ్ నవలలు ఎక్కువ చదవడం, ఆ స్ఫూర్తితో తన తొలి రచనగా "అస్థిపంజరం" అనే ఓ నవలని, తన పన్నెండవ ఏట వ్రాసారు. తర్వాత కాలంలో రాష్ట్రంలో నక్సలిజం ప్రబలి, అరసం విరసం వంటి వారి ఉద్యమాల ప్రభావం పతంజలిగారి మీద పడింది. ఉద్యోగ ప్రస్థానం ప్రారంభం తర్వాత, పోలీసు వ్యవస్థలో చీకటి కోణాలను వెలికితీసి, 'ఖాకీవనం' నవల వ్రాస్తే, ఆ నవల ఓ సంచలనం సృష్టించి, పతంజలిగారికి మంచి గుర్తింపు వచ్చింది. తర్వాత కాలంలో పత్రికారంగంలో జరిగే దుర్మార్గాలను ఎండగడుతూ "పెంపుడు జంతువులు" నవల వ్రాసారు. ముఖ్యంగా రచయితల గురించి చెపుతూ, "సామాజిక పరిణామాల్లో మంచికో చెడ్డకో బాధ్యులు కానివారెవ్వరూ ఉండరు. నా చుట్టూ ఉన్న సమాజం ఇంత దుర్మార్గంగా ఉండటానికి ఖచ్చితంగా నా బాధ్యత ఎంతోకొంత ఉండి తీరుతుంది. అది మార్చడానికి ఎంతోకొంత భాగస్వామ్యం ఉంటుంది. ఆ బాధ్యతల నుంచి ఎవరు తప్పించుకోలేరు!" అని స్వయంగా పతంజలిగారే అంటారు. "కాలం కథ, గాండేరం, దిక్కుమాలిన కాలేజీ, పిలక తిరుగుడు పువ్వు, పోయేకాలం, మోటు మనిషి, వెల్లొస్తాను భాను, సీతప్పరాజు గారి కుక్క, పది పైసలు, ఒక దెయ్యం ఆత్మకథ" వంటి పతంజలి గారి కథలన్నీ ఆణిముత్యాలే. అలాగే తన కుటుంబ నేపథ్యంలో లభించిన వేట అనుభవాలతో "వేటకథలు" అనే పేరిట సీరియల్ గా కథలు వ్రాసారు.

జర్నలిస్టుగా, కాలమిస్టుగా, కథారచయితగా, నవలారచయితగా మంచి పేరు తెచ్చుకున్న పతంజలిగారు మంచి ఆయుర్వేద వైద్యుడు కూడా! రావిశాస్త్రి రచనా పురస్కారం, చాసో స్ఫూర్తి పురస్కారం వంటి ఎన్నో అవార్డులు తీసుకున్న పతంజలిగారిలో రావిశాస్త్రిగారిలా వ్రాయలనే తపన మెండుగా ఉండేదిట! 2009లో అకాలంగా, తన ఏభై ఆరో ఏట కాన్సర్ వ్యాధితో మరణించి ఉండకపోతే, మరెన్నో ఆణిముత్యాలు తెలుగుసాహితీ వనంలో చిరస్థాయిగా వచ్చి చేరేవి. కొత్తగా కథలు వ్రాసేవారికి, వ్రాస్తున్నవారికి, వ్రాద్దామనుకునే వారికి స్ఫూర్తిని ఇచ్చే రచనలు అందించిన పతంజలిగారిని తలుచుకుంటూ, వారికి నివాళి అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# వినదగునెవ్వరు చెప్పిన..

మీ కథామంజరి బృందం తెలుగు కథకి గత వైభావాన్ని తిరిగి తప్పించడానికి చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. తెలుగు కథలకీ, తెలుగు కథకులకీ, కాబోయే కథకులకీ, తెలుగు కథా అభిమానులకీ... అందరికీ పనికొచ్చే విధంగా మరింతగా తీర్చిదిద్దడానికి కేవలం కథలే కాకుండా, కథాసాహిత్యానికి సంబందించిన వివిధ విషయాలని కూడా ప్రచురించే ప్రయత్నం చేయవలసిందిగా అభ్యర్థిస్తున్నాను. దానికి విశ్లేషణ, సమీక్ష, విమర్శ, పరామర్శ కూడా అవసరం. సమీక్ష, పరామర్శ కొంత మేరకు జరుగుతున్నా, మిగతా ప్రయత్నాలు కూడా అవసరం. కథకు సంబంధించిన సర్వసామగ్రులూ లభించే ఏకైక 'రిపాజిటరీ' (Re-pository) గా మీ పత్రిక అభివృద్ధి చెందాలని నా ఆకాంక్ష! దానికిగానూ కొన్ని వ్యాసాలు, చర్చలూ తరచుగానైనా, అడపాదడపా అయినా ప్రచురించే ఆలోచన, మీ బృందం చేస్తే బావుంటుంది. ఈ సందర్భంలో బాలసాహిత్యానికి, కథాసాహిత్యానికి సంబంధించి వసుంధరగారి సూచనలు (జూన్ 24 సంచికలో) అభిలషణీయం. వారు కథారచన విషయమై గతంలో నిర్వహించిన శీర్షికలనుండి కొన్ని మీరు తిరిగి ప్రచురించగలరేమో పరిశీలించండి. అలాగే విహారిగారు వివిధ కథకులపై, కథలపై రాసినవి గాని, లేదా వారిచే కొత్తగా రాయించగలిస్తే అవి గాని ప్రచురిస్తుంటే, సరికొత్త కథకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఇంకా డా. సి.హెచ్. సుశీలమ్మ గారి చేత గాని, మీ బృందంలోని కృపాకర్ గారి చేతో, రాంబో చేతో, ఎందరో నాకు తెలియని, ప్రస్తుతం గుర్తుకు రాని ఇతర రచయితల చేతో రాయించగలరేమో ఆలోచించండి!

**మెడికోశ్యామ్, యుయస్ఏ**

కథామంజరి : తప్పకుండా. చాలా ఉన్నతమైన ఆశయం. కథామంజరి అంతటి వెన్ను పుష్టి, పాఠక ఆమోదం సంపాదించుకుని ఈ దశగా ప్రయత్నాలు తప్పక చేస్తుంది. మీ అండదండలకు ధన్యవాదాలు.

---

10వ తరగతి చదువుతున్న విద్యార్థిని అయినా సరైన నడవడిక కలిగి ఉండడం ఎంత ముఖ్యమో, సరైన ఆలోచన ఉంటే సరైన మార్గం ఎలా కనబడుతుందో చక్కగా రాశారు. చిన్న వయసులోనే ఇంత మంచి కథ ని అందించారు. ఈ ఆసక్తిని ఇలాగే కొనసాగించాలని ఇంకా మంచి కథలు మున్ముందు మాకు అందివ్వాలని కోరుతున్నాము. శ్రీమతి సరస్వతి గారు చాలా చక్కగా స్పష్టంగా చదివి వినిపించారు.

**భాను కొవ్వలి**

---

కథామంజరి ఓ మంచి బాలకథతో శుభారంభం చేసింది. చిన్నారి అస్మిన్ చిన్న కథను వ్రాసిన చాలా పెద్ద సందేశాన్ని, నీతిని చక్కటి మాటల్లో అర్థవంతంగా వ్రాసింది. ఆ చిన్నారికి నా అభినందనలు

**ఏం. ఎ. పి రావు**

---

అద్భుతం.. వెంకట్రావుగారి గళంలో కథ చదివినా మాకు మాత్రం స్టేజ్ మీద నాటిక చూస్తున్న అనుభూతి కలిగించారు

**సరోజ పున్నమరాజు**

---

## వినదగు నెవ్వరు చెప్పిన..

కథ అద్భుతంగా ఉంది. మానవత్వం బోధించిన ఈ కథ మనసును హత్తుకుంది. శ్రీమతి జ్యోత్స్న గారు కథ కి అనుగుణంగా స్వరం మారుస్తూ చాలా చక్కగా స్పష్టంగా చదివి వినిపించారు.

**భాను కొవ్వలి**

కథా మంజరి సంపాదకులకు నమస్కారం!

జూలై నెల 'కథా మంజరి' ఒక కొత్త మార్పుతో వచ్చింది. మామూలుగా ఆన్ లైన్ పత్రికలను స్క్రోల్ చేసుకుంటూ చదవడం కష్టం. దీనికి కారణం అక్షరాల సైజు, కళ్ళకు హాని చేస్తూ ఫోన్ లో ఉండే వెలుతురు మరియు రేడియేషన్ లే కాక, ఒక చోట చదువుతూ మధ్యలో ఆపితే మళ్ళీ మొదటినుంచీ స్క్రోల్ చేసుకోవాల్సి రావడం. అందువల్లనే ప్రింటు పత్రికల స్థాయికి ఆన్ లైన్ పత్రికలు చేరటం లేదు. వీటన్నిటినీ మించి కథల స్థాయి బాగుంటున్నది కాబట్టి మీ పత్రికకు ఆదరణ లభిస్తున్నది. కానీ ఇప్పుడు మీరు తెచ్చిన ఫ్లిప్ పద్ధతిలోని అసౌకర్యాలు.

(1) పత్రికను డౌన్ లోడ్ చేసుకొని తరవాత చదువుకోవడానికి వీలు లేదు.

(2) మీది మాసపత్రిక. ఓపెన్ చేసిన గంటలో చదివేస్తే ఇక పత్రికను గురించి మరచిపోవడమే. ఇది అభిలషణీయం కాదు.

(3) అలా కాదని, పత్రికను కొద్ది రోజుల తరువాత చదవాలంటే మీరు పంపిన మెయిల్ ను అక్కడే (g mail లోనే) ఉంచుకోవాలి. ఓపెన్ చేసిన ప్రతీసారీ డాటా కావాల్సి ఉంటుంది. ఇది చందాదారునికి అదనపు ఖర్చు కదా. అంతేకాక ఫోన్లో ఉండే space కు బదులు g mail లోని space ను ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అందులో నిర్ణీత స్టోరేజి దాటితే ప్రీమియం ప్లానును సొమ్ము చెల్లించి తీసుకోవాల్సి వస్తుంది. ఇది రెండవ అదనపు ఖర్చు.

ఈ కారణాల వలన మీ పత్రికలో మొదటి రోజున నేను చదివే ఒక కథను ఈ రోజు నేను చదవలేక పోయాను. కాబట్టి మీ పత్రికను డౌన్ లోడ్ చేసుకుని చదువుకునేలాగ విడుదల చెయ్యమని కోరుతున్నాను.

ఇంకొక విషయం. ఇంతకు ముందూ, ఇప్పుడూ శ్రావ్య సంచికను వినాలనుకున్న ప్రతీసారీ యూ ట్యూబ్ ఆప్ ను ఓపెన్ చేసుకోవాల్సి వస్తుంది. అందువల్ల నేను శ్రావ్య సంచికను వినలేకపోయేవాడిని. ఇప్పుడు ఈ అసౌకర్యం చదివే పత్రికకు కూడా వచ్చింది!

నమస్తే,

భవదీయుడు

**పి. రాజేంద్రప్రసాద్. హైదరాబాద్**

కథామంజరి: పత్రిక పై మీ అభిమానానికి ధన్యవాదాలు. ఆగస్టు 24 సంచిక నుండి సంచిక డౌన్లోడ్ చేసుకునే సదుపాయం మళ్ళీ చేసుకుందాం.

సంపాదక వర్గానికి శుభాభివందనాలు, శుభాకాంక్షలు.

ఒక్క సారి మాఊరు పోయి రావాలి... సుగుణారావు గారి కథ శ్రావ్య సంచిక లో విన్నాను.. భోగారావు గారు చదివి వినిపించారు మనందరికి...

సమస్యని తీసుకొని కథగా రాయడం అంత సులభం కాదు... కానీ రాసారు... బావుంది అనాలో, బాధ పెట్టింది అనాలో, ఆలోచింపచేసింది అనాలో, మన దేశం ఇంతే అనాలో (మన దేశంలో, మన మింతే ) అనాలో తెలీటం లేదు... తెలుసు.. "ఇంతే"

ఒక చిన్న నిత్యం సత్యం... కవిత నావంతు గౌరవం రైతులకు...

నమస్తే.

**వల్లూరి విజయకుమార్, హైదరాబాద్**

## కథా పరిచయం

# రెక్కలున్న పిల్ల

**రచన : ఎస్. జయ**

'నాకు నచ్చిన నా కథ' శీర్షికలో సారంగ అంతర్జాలపత్రిక, 15 సెప్టెంబరు 2023 సంచికలో వచ్చిన కథ – ఎస్. జయగారు రాసిన 'రెక్కలున్న పిల్ల'. తన కథ గురించి తనే రాస్తూ, జయగారు 'అదొక అందమైన కల' అంటారు. పెళ్ళి కాక ముందు చదువుతున్న రోజుల్లో నవ్వుతూ తుళ్ళుతూ ఉండే ఆడపిల్లలు, పెళ్ళి కాగానే బరువు బాధ్యతలను మోస్తూ ఎందుకింత మారిపోతారు? ఇది ఒకరకమైన హింసే అదని అంటారు రచయిత్రి. జయగారు రాసిన కథలు చాలా మటుకు స్త్రీ వాదనకు సంబంధించినవే. ఆ కోవలోకే చెందింది ఈ 'రెక్కలున్న పిల్ల' కూడా. ఈ కథ మొదటగా ఏప్రిల్ 1998 ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించించ బడ్డది. అంటే సుమారు 25 ఏళ్ళ క్రితమన్నమాట,

కథలో హీరోయిన్ కు ఒక వయసులో రెక్కలొస్తాయి. రెక్కలు రావడం ఒక సంకేతంగా వాడుకున్నారు రచయిత్రి. పక్షులకు రెక్కలొస్తే ఎగిరిపోవూ? మరి స్త్రీకి రెక్కలొస్తే? రెక్కలు రావడం అనే ఊహతో కథలో మాజికల్ రియలిజమనే ప్రక్రియ ఇనుమడించారు. తెలుగు రచయితలలో ఈ మాజికల్ రియలిజాన్ని అతి చాకచక్యంగా ఉపయోగించుకున్న విధానం మునిపల్లె రాజుగారి కథల్లో కనబడుతుంది. రాజుగారితో పోలిస్తే, ఒక రకంగా, జయగారు చేసింది ఒక చిన్న సైజు ప్రక్రియ.

ఆశకు రెక్కలున్నాయని తెలిసి కూడా, ఆమె వ్యక్తిత్వాన్ని చూసి, ఆ రెక్కలను, అవి ఉన్న ఆమెను ప్రేమిస్తాడు మురళి. ఇద్దరూ కలసి సహజీవనం చేయాలని నిర్ణయించుకుంటారు. మరి 'పెళ్ళెందుకు చేసుకోరు?' అన్న స్నేహితుడి ప్రశ్నకు మురళి ఇచ్చిన సమాధానం "పెళ్ళంటే ఏమిటి? ఒక ఇంట్లో ఇద్దరిని బంధించి కాపురం చేయండి అని అందరూ ఆమోదించడమా? మా మధ్య ప్రేమ ఉన్నన్ని రోజులు కలిసి ఉంటాం. లేనప్పుడు ఇంత సింపుల్ గానూ విడిపోతాం. కలిసి ఉండడానికి పెళ్ళి పీటలు, మంగళ వాయిద్యాలు అక్కరలేదు. విడిపోతున్నప్పుడు లాయర్లు, కోర్టులు, తీర్పులు అక్కరలేదు."

పెళ్ళి లేకుండా కలిసి ఉండడమంటే అర్థం తెలియని మురళి తల్లి తండ్రులు, ఆశ వారితో ఎంత కలివిడిగా ఉన్నా ఒక్కసారి తన రెక్కలను విప్పి చూపించేసరికి, ఇంకా అర్థం కాని పరిస్థితి ఏర్పడి, కోపమో అయోమయమో తెలియకుండా అయిపోతారు. ఈ కొత్తదనం ఎలా ఉంటుందో అన్న కుతూహలం కూడా వారిలో లేకపోలేదు.

మురళి, ఆశల జీవితం గడిచిపోతూంటుంది. ఒక రోజు సంభాషణలో తనకు రెక్కలు ఎలా వచ్చాయనేది చెబుతుంది.

తను ఎనిమిదో క్లాసు చదువుతుండంగా శ్యామలా టీచర్ తో పరిచయమయింది. ఒకసారి ఆవిడ ఇంటికి వెళ్ళినప్పుడు ఆవిడ దగ్గరున్న ఎన్నో పుస్తకాలు చూసినప్పుడు ఆశకు తనలో కూడా చదవాలనే ఆసక్తి ఉందనే స్పృహ కలుగుతుంది. రంగనాయకమ్మ రాసిన 'జానకి విముక్తి' నవల ఎన్నో సార్లు చదివింది. ఆ పుస్తకాల వల్లో, తనలో కలిగిన పరిణతి వల్లో, ఎవరేంచెప్పినా ఏదో లోపమున్నట్లనిపించేది. కాలేజీలో చేరింది. తల్లికి తన మాటలు ఎదురు చెప్పినట్లుండేవి. అందరిలా ఎందుకుండవని తల్లి ప్రశ్న. పక్కింటి సీతలా అందరినీ మెప్పిస్తూ తనకి నచ్చినట్లుగా ప్రవర్తించలేని సీత తనకు ఆదర్శమెలా అవుతుంది?

ఒకరోజు కోపంతో చెంప మీద కొట్టబోయిన తల్లితో తను చిన్నపిల్లను కానని, ఇంకెప్పుడూ చెయ్యి చేసుకోవద్దని చెబుతూ, శ్యామలా

## కథా పరిచయం

టీచర్ ఇంటికి వెళ్ళిపోయింది ఆశ.  అక్కడ నిద్ర రాక 'రెక్క విప్పిన రివొల్యూషన్' పుస్తకం 1969లో ఫ్రెంచి విద్యార్థుల ఉద్యమం గురించి రాసిన శ్రీశ్రీ చేసిన తెలుగు అనువాదం చదువుతూ, ఆ విద్యార్థులలో తానూ ఉన్నట్లు వచ్చిన ఊహలు ఆమెకు ఎంతో ధైర్యాన్నిస్తాయి. ఆరోజు నిద్రలో వచ్చిన అందమైన కలలో తనకు రెక్కలు వచ్చినట్లు, ఆకాశంలోకి ఆనందంగా ఎగిరిపోతున్నట్లు కల. ఆరోజే ఆశకు నిజంగానే రెక్కలొచ్చాయి.

తిరిగి ఇంటికెళ్లింది. తనకొచ్చిన రెక్కల్ని ఎవరికీ కనబడకుండా జాగ్రత్త పడింది. అయినా ఒకరోజు పూర్తి అస్వస్థతలో ఉన్నప్పుడు తన తల్లి, తండ్రి ఆ రెక్కల్ని చూస్తారు. తన ఆ రెక్కల్ని వాళ్ళు కత్తిరించడాని కొచ్చినప్పుడు, మెలకువ వచ్చిన ఆశ ఇంక ఆ ఇంట్లో ఉండడానికి ఇష్టపళ్ళేదు.  శ్యామల ఇంటికి వెళ్ళి, అక్కడే ఉండిపోయి మిగిలిన చదువు పూర్తి చేసింది.  శ్యామల, తల్లి తండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేసి కాలేజీలో లెక్చరరుగా చేరింది.  అక్కడే మురళితో పరిచయం.

రెక్కలొచ్చిన అమ్మాయికి తల్లిదండ్రులు, ప్రపంచం ఏదైనా ఒకటే.  సహచరుడైనా అంతే కదా!  ఓరోజు ఆలస్యంగా వచ్చిన ఆశతో, తను ఎన్ని గంటలనుంచో అన్నం కూడా తినకుండా ఎదురు చూస్తున్నానని, తన క్షేమం కోసం, ఏమైపోయిందో అన్న ఆత్రుతతో ఉన్నానని చెప్పినప్పుడు, "అంత ఇరుకుగా జీవించద్దు మనం. అన్నిట్లో పూర్తిగా కలిసిపోవడంలో ఎప్పుడూ ఎవరికో ఒకరికి నష్టం కలుగుతుంది. నువ్వు నాకోసం డ్రైవరుగానో, పి.ఆర్.వో గానో పనిచేయడం నాకిష్టం లేదు.  నాకు రెక్కలున్నాయి.  నా పనులు నేను చేసుకోగలను." అని ఆశ చెప్పిన మాటలు మురళికి కళ్ళు తెరిపించాయి.

అంతే కథ.

ఆశకి రెక్కలు రావడం రచయిత్రి చేసిన సింబాలిజం.  ఒక స్త్రీ తన స్వతంత్రాన్ని, తన ఆలోచనలను ఇంకొకరికి ధారపొయ్యక్కరలేదనే భావాలే ఆ రెక్కలు.  తనని తను ప్రేమించుకోగలగాలి.  తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలి.  రచయిత్రి కథ ద్వారా వెలువరించిన భావాలు – సాంప్రదాయం అనేది సంఘం నిర్మించే ఒక పంజరం అని, దానికి బద్ధమై ఉండే స్త్రీ, ఆ పంజరం నుంచి తప్పుకోలేకపోతోందని! అలాంటి భావాలకు మద్దతునిచ్చే రంగనాయకమ్మ గారి రచనలను ఈ కథలో చొప్పించడం మరొక సింబాలిజీ.

1998లో తన కథ ప్రచురించబడ్డప్పుడు చాలా గుర్తింపు పొందిందని రచయిత్రి చెప్పారు.  పొందే ఉంటుంది.  బహుశా ఆ రోజులు పెళ్ళిని ప్రశ్నించే యువతకు రెక్కలొచ్చే రోజులయి ఉంటాయి.

**పరిచయకర్త – శాయి రాచకొండ**

# కథాపుస్తక పరిచయం




## మా గణపవరం కథలు

వర్తమానంలో వైద్యవృత్తిలో ఉన్నవారు, కథలు వ్రాసేవారు తగ్గిపోయారు. అయితే వారి వృత్తిలో ఉన్న మంచి చెడులు చూసే సంఘటనల మీద కథలు వ్రాయడం సర్వసాధారణం. కానీ తాను చూసిన లోకాన్ని, అర్థం చేసుకున్న సమస్యలని... తన స్వస్థలం మీద మమకారాన్ని జోడించి, ముప్పైమూడు కథలను సంపుటిగా అందించారు రచయిత డాక్టర్ రమణయశస్వి. రూ. 200/-

ప్రతులకు

డాక్టర్ రమణయశస్వి
యశస్వి హాస్పటల్స్,
కాకాని రోడ్డు, గుంటూరు – 001 522
ఫోన్ – 78807 98480

## తెలుగు పత్రికలు – జ్ఞాపకాలు

ఏ భాషలోనైనా సాహిత్యం ప్రజలకు చేరాలంటే, పత్రికలే ఆధారం! అందులో కథ, కవిత వంటి సాహితీ ప్రక్రియలు జనరంజకం కావాలన్నా, సాహిత్యం వలన సమాజానికి మంచి జరగాలన్నా, దానికి ఆలంబన పత్రికలే! ఈ పత్రిక అచ్చు యంత్రం మన దేశానికి 1750లో వచ్చింది. 1776 లో వార్తాపత్రికల ప్రచురణకు ప్రయత్నం జరిగింది. అలా అరంభమయిన పత్రికలలో, మన తెలుగుభాషలో, 1903 లో విడుదలైన "కల్పలత" అనే పత్రికలో ప్రచురించిన "లలిత" కథ, తొలి తెలుగుకథానిక అనే అభిప్రాయం చాలమందిలో వుంది. ఆ తర్వాత కాలంలో కొన్ని పత్రికలు పుట్టి పెరిగిన, 1910 లో వెలువడిన "ఆంధ్రభారతి" మంచి పేరు సంపాందించింది. మొట్టమొదటి ఆధునిక తెలుగుకథగా గుర్తింపబడిన, గురజాడవారి "దిద్దుబాటు" కథ 1910 ఫిబ్రవరి సంచికలో వచ్చింది. అలా కథలను బాగా ప్రోత్సహించిన మన సంచికలను జ్ఞాపకం చేసుకోవాలనే ఆలోచనతో "కథామంజరి" ఈ శీర్షిక ప్రారంభించింది. ఈ విషయసేకరణకు కీ.శే. వేదగిరి రాంబాబు గారి "తెలుగు వారపత్రికలు – రచనా ధోరణులు" పుస్తకంలో చాలా సమాచారం మాకు లభ్యమవుతుంది. తెలుగుకథ గమనంలో మన పత్రికల పాత్ర విశిష్టమైనదిగా భావిస్తూ, మాకు లభ్యమయ్యే వివరాలతో ఆయా పత్రికలను ప్రతీ నెలా కనీసం ఓ సంచికను పరిచయం చేయాలనీ సంకల్పించాం! తప్పకుండా పాఠకులకు విజ్ఞానవంతంగా ఉంటుందని భావిస్తున్నాం!

# పల్లె పిలుపు

వసుంధర

9885620065



**జన్మదిన సంచిక 2024 'పల్లెకు పోదాం' కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

**నీ శరీరం చెయ్యలేని పనిని మందులు చెయ్యాల్సొచ్చింది. అలాగే దేవుడు మనకి గాలిని ఉచితంగా ఇచ్చాడు. మల్లేశం అది వాడుకున్నాడు. దేవుడు ఉచితంగా ఇచ్చేవి, మనం చేసుకోవాలంటే– ఇలా ఖర్చవుతుంది. చెట్టుకింద కూర్చుని పీల్చుకుంటే ఊరికే లభించే ఆక్సిజన్– సిలెండర్లోకి ఎక్కేక ఎంత ఖరీదో నీకు తెలియదా?**

దైవత్వానికి ముఖ్యరూపాలు రెండు. ఒకటి ప్రేమ. రెండు నిష్కల్మషత్వం.

అవి అందరికీ అందుబాటులో ఉండాలని– మొదటిది అమ్మలోనూ, రెండోది పల్లెలోనూ నింపాడు దేవుడు.

రాజు, మల్లేశం– ఇద్దరూ దేవుణ్ణి నమ్మరు. ఐతే వాళ్లమధ్య అంతవరకే పోలిక!

మల్లేశం పేదవాడు. రెక్కాడితేకానీ డొక్కాడదు.

రాజు ధనికుడు. రెక్కాడనప్పుడూ డొక్కాడుతూనే ఉంటుంది.

ఇద్దరివీ మూలాలు పల్లెల్లోనే!

రాజుకి ఆ మూలాలు ఇంకా మిగిలున్నాయి పొలాలుగా.

మల్లేశం మూలాలైన పొలాలు పోయి భుజాలకు తగులుకున్నాయి హలాలుగా.


రాజు పొలాల్ని అయినవాళ్లకి అప్పగించి, కాసులు పండించాలని పట్నం వచ్చాడు.

మల్లేశం హలాల్ని భుజాల్నించి దించి, ఏదో బావుకుందామని పల్లె వదిలాడు.

రాజు వ్యాపారం మొదలెట్టాడు. ఏడాదిలోనే కొంతెత్తు ఎదిగాడు.

అప్పుడో వ్యాపారస్థుడి కూతురు రాజుకి ఇల్లాలయింది. దాంతో రాజు అంతెత్తు ఎదిగాడు. తమకోసం పెద్ద ఇల్లు కట్టాడు. తమను సేవించుకునే వాళ్లకోసం పెరట్లో బుల్లి ఇల్లు కట్టాడు. ఆ ఇంటికి ఆశపడి ఎవరో ఒకరొస్తూనే ఉంటారు. కానీ రాజు ఆశించిన మేరకు సేవల్ని అందించలేక వెళ్లగొట్టబడుతూంటారు.

# పల్లె పిలుపు



పెద్దింట్లో రాజు కొనసాగుతున్నాడు. బుల్లింట్లో రెండేళ్లలో నలుగురు మారారు.

పట్నమొచ్చిన మల్లేశానికి అడపాదడపా పనైతే దొరికింది కానీ, ఎంత తిరిగినా ఉండడానికి చోటు దొరకలేదు.

తనలాగే చోటు కోసం తిరుగుతున్న సీతని ఇష్టపడి పెళ్లి చేసుకున్నాక– మల్లేశానికి నిలువనీడ అవసరం తెలిసింది. చెట్టుకింద ఉందామంటే, ఆ నీడ నాదని అద్దె అడుగుతాడొకడు. రోడ్లపక్క నడకదారిలో నడుం వాల్చితే– దానికీ అద్దె అడిగే ఓ యజమాని ఉంటున్నాడు. రైల్వే ప్లాట్‌ఫారం మీద ఉందామని అనుకుంటే, దానికీ రోజువారీ టికెట్టుంది.

అనుకోకుండా ఓరోజు రాజుకి మల్లేశం దొరికాడు. ఐదోవాడుగా మల్లేశానికి రాజు బుల్లింట్లో స్థానం దొరికింది. అప్పుడు సీతకి గవర్నమెంటు క్వార్టర్సు దొరికినంత సంబరం కలిగింది.

రాజుది డూప్లెక్స్ హౌస్. పైనా కిందా కలిపి ఆరు గదులు, నాలుగు బాత్రూమ్సు, రెండు హాల్సు ఉన్నాయి. ఉండేది మాత్రం రాజు, అతడి భార్య రాణి. అంతే!

మల్లేశం ఉండే బుల్లింట్లో చిన్న పడకగది, దానికి జతగా ఒక్క మనిషే పట్టేటంత చిన్న స్నానాలగది. పడకగదినానుకుని చిన్న వసారా. అదే వంటకు, భోజనాలకు వాడుకోవాలి.

పెద్దింటికి రాజు వనమాలి. మల్లేశం తోటమాలి. రాణి కథానాయిక. సీత సేవిక.

ఆ ఇల్లు రాజు–రాణిల వైభవానికి. మల్లేశం–సీతల దాస్యానికి.

పాండవులకు దాస్యం అజ్ఞాతవాసమైతే, మల్లేశానికి దాస్యమే జీవితం.

రాజు సంపాదనతో డబ్బుకి డబ్బు, ఇళ్లకి ఇళ్లు మొలుస్తూ– అతడి వైభవం నానాటికీ పెరుగుతోంది.

మల్లేశం సంపాదనతో వళ్లు అలుస్తూ– అతడి భవిష్యత్తుని సుఖనిద్రలో కలలకే పరిమితమయ్యేలా ఆపుతోంది.

మల్లేశం, సీత సేవలకు వళ్లు దాచుకోరు. లభించినదానికి మించి ప్రతిఫలాన్ని ఆశించరు. అందుకని రాజు దంపతులు మల్లేశం దంపతుల్ని– జీతం పెంచకపోతేనేం, మాటలతో మెచ్చేవారు.

నీడనిచ్చారు. కూడు పెడుతున్నారు. మెచ్చుకుంటున్నారు. కాబట్టి మల్లేశం దంపతులకీ రాజు–రాణి నచ్చారు.

“వాళ్లలాగున్నారు. మేమిలా ఎందుకుండాలి? దేవుడనేవాడుంటే ఇలా జరుగదు కదా!” అనుకుంటాడు మల్లేశం.

ఐతే అతడికి దేవుడంటే నమ్మకం ఇప్పుడు కాదు, ఎప్పుడో పోయింది.

దేశంలో పేదరికం పోవాలనీ, పౌరుల మధ్య అసమానత ఉండరాదనీ, దోపిడితత్వం నశించాలనీ– రాజు ఆకాంక్ష.

అందుకు తనేం చెయ్యాలనుకోడు. ఉంటే దేవుడే చెయ్యాలనీ– చెయ్యడంలేదు కాబట్టి దేవుడు లేడనీ అనుకుంటాడు.

అంతవరకూ రాజుకీ మల్లేశానికీ ఉన్న పోలిక ఒక్క నాస్తికత్వంలోనే!

ఇప్పుడే కొత్తగా ఇంకో పోలికొచ్చింది.

ఇద్దరికీ ఒకేసారి ఒకేలాంటి జబ్బు చేసింది.

పని చేద్దామంటే కళ్లు మూసుకుపోతాయి. పడుకుంటే నిద్ర పట్టదు. ఇట్టిట్టే అలసట. తలనొప్పి.

ఆ జబ్బు రాణికి రాలేదు. సీతకు రాలేదు. రాజుకీ, మల్లేశానికీ మాత్రమే వచ్చింది.

రాజు ఇంటికి ఫామిలీ డాక్టరొచ్చాడు. రకరకాలుగా పరీక్షించాడు.

“ఇది ప్రమాదకరమైనదేం కాదు. కానీ దీనికి కొన్ని నెలలపాటు పూర్తి విశ్రాంతి కావాలి. ప్రత్యేకమైన మందులు వాడాలి. పల్లెగాలి కావాలి” అని చెప్పాడు డాక్టరు.

రాజుకి తన ఆరోగ్యం ఎంతవసరమో, మల్లేశం ఆరోగ్యమూ అంతే ముఖ్యం.

అందుకని పనిలోపనిగా మల్లేశాన్ని కూడా డాక్టరు చేత పరీక్ష చేయించాడు. డాక్టరు అతడికీ అదే చికిత్స చెప్పాడు.

“నేనిక్కడ లేకపోతే, వ్యాపారంలో చాలా పన్లు ఆగిపోతాయి. ఫోన్లతో కుదరని ఎన్నో డీలింగ్సున్నాయి. కాబట్టి నేనిక్కడే ఉండి వ్యవహారాలు చూసుకుంటూ, చికిత్స కూడా ఈ ఊళ్లోనే చేయించుకుందుకు వీలౌతుందా?” అనడిగాడు రాజు.

డాక్టరు కళ్లు మెరిశాయి, “ఎందుకు వీలవదు? మా నర్సింగ్ హోంలో, ప్రత్యేకమైన గదులున్నాయి. వాటిల్లోకి ఏ పల్లె గాలి కావాలంటే ఆ పల్లె గాలినే పంపించొచ్చు. ఆ గదులకి డిమాండ్ చాలా ఎక్కువ. ఐనా నీకోసం ఒకటి రిజర్వ్ చేస్తాను. అక్కడ మంచం మీదుండే నువ్వు బిజినెస్ వ్యవహారాలు మోనిటర్ చేసుకోవచ్చు. ఎటొచ్చీ మందులకు వేలల్లోనూ, చికిత్సకు లక్షల్లోనూ ఖర్చవుతుంది. దానికి నువ్వు వెనకాడతావనుకోను” అన్నాడు.

కానీ రాజు వెనకాడుతున్నాడు. తన చికిత్స గురించి కాదు, మల్లేశం గురించి!

రాజు తలచుకుంటే, డబ్బులకి కొదవా? కానీ మల్లేశం తనకి ఎంత ముఖ్యమైనా, అతడి చికిత్సకి లక్షలు ఖర్చుపెట్టాలంటే రాజుకి మనసొప్పదు. అలాగని మల్లేశంలాంటివాణ్ణి వదులుకోనూ లేదు.

ఆలోచించగా ఆలోచించగా రాజుకు తన పెదనాన్న కొడుకు సత్యం గుర్తుకొచ్చాడు. అతడు, భార్య పల్లెలో ఉంటూ స్వంతంగా వ్యవసాయం చేయిస్తున్నారు. అన్నీ చేయించడమే అలవాటైన వాళ్లకి, అక్కడ ఇంటిపనికీ, వంటపనికీ మాత్రం మనుషులు దొరకడం లేదు.

రాజు సత్యానికి ఫోన్ చేసి సీత గురించి చెబితే, వాళ్లు మహదానంద పడ్డారు.

రాజు మల్లేశాన్ని పిలిచి, "డాక్టరు నీకు పూర్తి విశ్రాంతితోపాటు, పల్లెగాలి కూడా కావాలంటున్నాడు. అందుకు నేనో ఏర్పాటు చేశాను. పల్లెలో ఉంటున్న నా తమ్ముడు సత్యానికో వంటమనిషి కావాలి. సీతని పంపిస్తానంటే నా మాటమీద సరేనన్నాడు. నువ్వూ, సీతా వెళ్లి అక్కడుండండి. మీకో గదిస్తారు. తిండి అక్కడే వెళ్లిపోతుంది. నువ్వు పూర్తిగా కోలుకున్నాక ఇద్దరూ మళ్లీ ఇక్కడికొచ్చేద్దురుగాని" అన్నాడు.

మల్లేశానికిది చాలా పెద్ద ఉపకారం. కృతజ్ఞతాపూర్వకంగా అతడు రాజు కాళ్లమీద పడిపోయాడు.

మల్లేశం, సీత– పల్లెలో సత్యం ఇంటికి వెళ్లారు. ఎనిమిది గదుల మండువా ఇల్లు. గదుల్లో బాగా చిన్నగది ఒకటి వాళ్లకిచ్చారు.

సీతకి వందనీకముంది. మాటకిమాటనదు. వంట బాగా చేస్తుంది. ఆ చేసేది తినేవాళ్లు తృప్తిగా తినాలన్న భావనతో చేస్తుంది. దాంతో ఆమె అక్కడివాళ్లకు నచ్చింది.

ఉండే గది ఇరుకైనా– భోజనానికో, పడుకునేందుకో తప్ప మిగతా సమయమంతా– అంతిల్లూ తమదే అన్నట్లుండేది వాళ్లకి అక్కడ. కబుర్లకి ఎవరో ఒకరుండేవారు. గాలి, నీరు స్వచ్ఛమైనవి. దాంతో మల్లేశం నెల్లాళ్లలోనే మామూలు మనిషయ్యాడు.

ఆ కబురు రాజుకు చేరింది.

అప్పటికి అతడింకా పూర్తిగా కోలుకోలేదు. మల్లేశం అప్పుడే కోలుకున్నందుకు ఆశ్చర్యపోయి డాక్టర్ని కారణమడిగాడు.

"లేనివాడయ్యుండీ, భార్య సంపాదనతో తృప్తిపడి, పూర్తి విశ్రాంతి తీసుకున్నాడు మల్లేశం. ఉన్నవాడివయ్యుండీ, వ్యాపారం పన్లు చూసుకుంటూ, ఆదాయాన్ని పెంచుకుంటున్నావు నువ్వు. అదీ తేడా!" అన్నాడు డాక్టరు.

"సంచి లాభం చిల్లు కూడదీసిందని– సంపాదిస్తున్నదంతా, వైద్యానికే పోతోంది. మల్లేశం ఎంత అదృష్టవంతుడో!" అన్నాడు రాజు అసంతృప్తిగా.

"ఏమదృష్టం! కావాలంటే నువ్వూ పల్లెకి వెళ్లి ఉండి, నీ రోగాన్ని త్వరగా తగ్గించుకోవచ్చు. కానీ మల్లేశానికి అలాంటి ఆప్షన్ లేదు. ఇంత ఖర్చు తను భరించగలడా?" అన్నాడు డాక్టరు.

రాజుకి అర్థమైంది కానీ ఇంకో అనుమానమొచ్చింది. "ఔనూ! పల్లెటూళ్లో పైసా ఖర్చు లేకుండా మల్లేశానికి నయమైతే, ఇక్కడ నా వైద్యానికింత ఖర్చౌతోందేం?" అనడిగాడు డాక్టర్ని.

డాక్టరు నవ్వి, "దేవుడు మనకిచ్చిన శరీరం చాలా గొప్పది. దాని మానాన దాన్నొదిలేస్తే, వచ్చే జబ్బుల్లో చాలావాటిని అదే నయం చేసుకుంటుంది. అందుకు ఖర్చుండదు. విశ్రాంతి తీసుకోవడంవల్ల మల్లేశం శరీరానికి ఆ వెసులుబాటు వచ్చింది. మరి నువ్వు విశ్రాంతి తీసుకోలేదు. నీ శరీరం చెయ్యలేని పనిని మందులు చెయ్యాల్సొచ్చింది. అలాగే దేవుడు మనకి గాలిని ఉచితంగా ఇచ్చాడు. మల్లేశం అది వాడుకున్నాడు. దేవుడు ఉచితంగా ఇచ్చేవి, మనం చేసుకోవాలంటే– ఇలా ఖర్చవుతుంది. చెట్టుకింద కూర్చుని పీల్చుకుంటే ఊరికే లభించే ఆక్సిజన్– సిలెండర్లోకి ఎక్కేక ఎంత ఖరీదో నీకు తెలియదా?" అన్నాడు.

రాజుకి అప్పుడు బుర్రలో ఏదో వెలిగింది.

దేవుడున్నాడు. మన చుట్టూ ఏదో రూపంలో కనిపిస్తూనే ఉన్నాడు.

మనం బ్రతకడానికి కావాల్సినవన్నీ ఉచితంగా ఇచ్చి, అదే దైవత్వమని గ్రహించమన్నాడు.

బ్రతకడానికి ఇంకేవో కావాలనుకున్నవారికే– ప్రయాస!

"నా ప్రయాసను తగ్గించడానికి దేవుడిచ్చిన వరం మల్లేశం. అతడు నన్ను దేవుడనుకుంటున్నాడు. అనుకున్నందుకైనా దేవుడంతలా కాకపోయినా, నేనూ అతడికోసం ఇంకాస్త ఎక్కువ చేసి, నాలో దైవత్వాన్ని పెంచుకోవాలి" అనుకున్నాడు రాజు.

అప్పుడతడు మనసులో దేవుణ్ణి స్మరించి, "మల్లేశానికి ఇంకాస్త పెద్దిల్లు ఇచ్చి జీతం పెంచుతాను. అతడి పిల్లలు చదువుకుని పైకొచ్చేందుకు నా వంతు కృషి చేస్తాను. అందుకు నన్ను త్వరగా స్వస్థుణ్ణి చెయ్యి స్వామీ!" అని మనస్ఫూర్తిగా ప్రార్థించాడు.

దేవుణ్ణి ప్రార్థించడమే కాదు– తన గురించి కాకుండా సాటిమనిషి గురించి అలా ఆలోచించడమూ అతడికదే మొదటిసారి!

మరో వారానికే రాజు పూర్తిగా కోలుకున్నాడు. కానీ దేవుడు అతడి కోరికను పూర్తిగా తీర్చలేదు.

కోలుకున్న మల్లేశం పట్నానికి తిరిగి రాకుండా, తన పల్లెకి వెళ్లిపోయాడు.

బహుశా అతడూ రాజులాగే, "బ్రతకడానికి కావాల్సినవన్నీ దేవుడు ఉచితంగా ఇస్తే, బ్రతకడానికి ఇంకేవో కావాలనుకోవడం వృథా ప్రయాస!" అని ఆలోచించి తన దృక్కోణంలో అమలు చేశాడేమో!

# తల్లి చిరునామా..

గాయిత్రి



8390705200

**జన్మదిన సంచిక 2024 'పల్లెకు పోదాం' కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> **వరి పండటం కష్టం. నీళ్లు చాలటం లేదు. రైతులు కూరగాయలు, పండ్లు పండిస్తున్నారు. అసలు భూగర్భంలో నీళ్లు తగ్గిపోతున్నాయి. మనల్ని, మనమే నాశనం చేసుకుంటున్నాము. అడవులు కొట్టివేయటం, భూమినంతా త్రవ్వివేస్తూ వ్యవసాయభూములుగా మార్చేస్తూ ఉండటం, పట్టణాలు పెరగటం... దీని వలన ఉపయోగం ఏముంది? ప్రకృతిమాతను రక్షించకపోతే ప్రళయం తప్పదు! తెలిసికోలేకపోతున్నాము! అంతే!"**

"కాసేపు బయటికి తీసుకెళ్ళరా! ఊపిరాడటం లేదిక్కడ..."మెల్లగా కొడుకు రఘురాం చేయి పట్టుకొని చెప్పింది కామేశ్వరి.

తల్లి వంక చూశాడు రఘురాం.

ముడతలు పడిన దేహం. సన్నటి శరీరానికి ఆచ్ఛాదనగా పల్చటి నూలు చీర.ఊడిపోతున్న తెల్లటి జుట్టు. గాజుగోళాల్లాంటి కళ్ళు. తల్లికి ఎనభై మూడేళ్ళు. నాలుగేళ్ల క్రితం దాకా బాగానే తిరిగింది. రెండేళ్ల క్రితం వరకు ఇంట్లోకి బయటికి తిరిగేది.ఇప్పుడు మరీ మంచానికే పరిమితం అయింది. ఆవిడకు కాళ్లు సహకరించడం లేదు.

తల్లిని చూసుకోవడానికి పనిమనిషిని పెట్టాడు రఘురాం. తనకు, భార్య గౌరికి ఉద్యోగాలు. ఉదయం వెళ్తే సాయంత్రం వస్తాడు తను. గౌరి లెక్చరర్. ఆమెకు కాలేజీలో షిఫ్ట్ మధ్యాహ్నం మూడింటికి అయిపోతుంది. గౌరికి హెల్ప్ చేయటానికి పనిమనిషి ఎప్పుడూ ఉంటుంది.

ఈ మధ్య రఘురామ్ కూతురు మహిమ, కొడుకు కశ్యపుల పెళ్ళిళ్ళు అయ్యాయి. అల్లుడూ, కూతురు బెంగుళూరులో ఉంటారు. కొడుకూ, కోడలు లండన్ లో డాక్టర్లు.

తల్లి చెయ్యి పట్టుకున్నాడు రఘురామ్. మెత్తటి చెయ్యి.

"అలాగేనమ్మా! తీసుకెళ్తాను" అన్నాడు మృదువుగా.

కాసేపు తల్లితో ఆఫీసు విషయాలు మాట్లాడాడు. ఇంతలో గౌరి కప్పులో మెత్తగా కలిపిన చారు అన్నం తీసికొని వచ్చింది.

తల్లిని మెల్లగా లేవదీసి దిండు మీద ఆనించి కూర్చోబెట్టి చెంచాతో జావలాంటి అన్నం తినిపించసాగాడు.

చిన్న కప్పు చారు అన్నం తినిపించటానికి అరగంట పడుతుంది. ప్రతిరోజూ రాత్రిపూట తల్లికి తనే అన్నం తినిపిస్తాడు రఘురామ్.

# తల్లి చిరునామా..

రోజులో ఇంట్లో, ఆఫీసులో రోజువారీ పనులు ఎన్ని ఉన్నా తల్లికి అన్నం తినిపించటం మాత్రం సాధారణంగా మానుకోడు రఘురామ్. రోజులో తల్లితో కొంచెం సేపైనా గడపటం రఘురామ్ కు ఎంతో సంతృప్తినిస్తుంది.

“నువ్వెళ్ళి అన్నం తిను! ఆలస్యమవుతోంది!” అంది కామేశ్వరి.

“ఇప్పుడు ఏడున్నరే అయిందమ్మా! అప్పుడే అన్నం ఏమిటమ్మా...”

“ఆలస్యంగా తింటే ఆరోగ్యం పాడవుతుంది. వెళ్ళు!” అంది కామేశ్వరి.

తల్లిని చూసి నవ్వుతూ “ఇంకా చిన్నపిల్లాడిలా కనిపిస్తున్నానా నేను....”అన్నాడు రఘురామ్.

నవ్వింది కామేశ్వరి.

తల్లికి ప్యాడ్ మార్చమని పనిమనిషి రమణమ్మకు చెప్పి హాల్లోకి వచ్చాడు రఘురామ్.



రఘురామ్ తల్లి కామేశ్వరి, తండ్రి మనోహరరావు. ఇద్దరూ ప్రకాశంజిల్లాకు చెందినవారే. కందుకూరు గవర్నమెంట్ కాలేజీలో కామేశ్వరి లెక్చరరుగా పనిచేసేది. మనోహరరావు ఆయుర్వేద వైద్యుడు. అతడి హస్తవాసి మంచిదని కందుకూరులో అతడికి చాలా మంచి పేరుండేది.

కందుకూరు కాలేజీ కాంపౌండ్ చాలా విశాలంగా ఉండేది. కామేశ్వరి స్టూడెంట్లకు పర్యావరణ ప్రాముఖ్యత గురించి చెప్పి,వాళ్ళచేత కాలేజీ కాంపౌడులో ఒక క్రమపద్ధతిలో మొక్కలు నాటించేది. ఖాళీ సమయం దొరికితే చెట్ల మధ్యే గడిపేది.

నందావారి వీధిలో ఇల్లు. ఇంటి ముందు, వెనక చాలా చెట్లు పెంచింది కామేశ్వరి. అవికాక ఇంట్లో బోలెడు కుండీలు ఉండేవి. కుండీల్లో పూలమొక్కలు కాక ఔషధ మొక్కలు పెంచేవాడు మనోహరరావు. అతనికి కందుకూరు శివార్లలో రెండెకరాల పొలం ఉండేది. ఆ పొలంలో ఆయుర్వేద మందులకు కావాల్సిన చెట్లు ఉండేవి. మనోహరరావు ఇంట్లోనే మూలికలతో మందులు తయారు చేసి, వచ్చిన రోగులకు ఇచ్చేవాడు.

తల్లిదండ్రులతో పాటు రాధిక, రఘురాములు ఇంట్లో మొక్కల ఆలనా పాలనా చూసుకునేవారు.

పిల్లలు పెరిగారు. కావలిలో ఎలక్ట్రికల్ ఆఫీసులో పనిచేసే సూర్యంతో రాధిక పెళ్లి జరిగింది. ఆమె కిద్దరు పిల్లలు. రఘురాముకు, భార్య గౌరికి హైదరాబాదులో ఉద్యోగాలు. ఉండేది కూకట్ పల్లిలో అపార్ట్మెంటులో. తండ్రి చనిపోయి పదేళ్లయింది. తండ్రి పోయాక తల్లిని తన దగ్గరకు తీసికొని వచ్చాడు. తండ్రి ఉన్నప్పుడు ఆయన దగ్గర ఆయుర్వేద వైద్యం నేర్చుకున్నాడు రఘురామ్. వైద్యంలో డిగ్రీ లేదు కానీ, తెలిసిన వాళ్లకు మూలికా ఔషధాలు తయారు చేసి ఇస్తుంటాడు.

హైదరాబాదులోని అపార్ట్మెంటులో ఉండే చిన్న బాల్కనీలో కుండీలు పెట్టి, రకరకాల మొక్కలు పెంచేది కామేశ్వరి. ఎవరికైనా గిఫ్ట్ ఇవ్వాలంటే పూలమొక్కలు ఇచ్చేది. పిల్లల పుట్టిన రోజులు వస్తే రిటన్ గిఫ్ట్ గా మొక్కలు ఇవ్వటం కామేశ్వరి ప్రత్యేకత. ఎక్కడికయినా ఊరు ప్రయాణమయితే ఆవుపేడ ముద్దల్లో విత్తనాలు పెట్టి రోడ్డు ప్రక్కకు విసిరేసేది.

“వానాకాలం వస్తే అవే మొలుస్తాయి.” అంటూ మనవలకు, మనవరాళ్లకు చెప్తూ ఉండేది. అలా ఉత్సాహంగా, చైతన్యవంతంగా ఉండే కామేశ్వరి వయసు పెరిగి, శరీరం సహకరించక తన గదికి మాత్రమే పరిమితమయ్యింది.

ఉదయం ఎనిమిదింటికి పనిమనిషి శారద వచ్చి కామేశ్వరిని సాయంత్రం దాకా చూసుకుంటుంది. సాయంత్రం రెండో పనిమనిషి రమణమ్మ వచ్చి తెల్లవార్లూ కామేశ్వరికి తోడు పడుకుంటుంది.

తల్లి దేనికి ఆరాటపడుతూందో రఘురాముకు తెలుసు. చెట్ల దగ్గరికి తీసికెళ్లాలి. కందుకూరు దూరపు ప్రయాణం. పోయిన సంవత్సరం వ్యానులో కందుకూరు తీసికెళ్లాడు.ఒక పది రోజులు అక్కడ ఉన్నారు,కానీ ఊరు మారటం, ఎండలో దూరపు ప్రయాణం అవటంతో అలసట తట్టుకోలేక, నీరసంతో డీహైడ్రేషనుకు గురయింది కామేశ్వరి. పదిరోజులు హాస్పిటలులో ఉంచాల్సి వచ్చింది. ముడతలు పడిన కామేశ్వర చేతి నరానికి సెలైన్ బాటిల్ పెట్టడానికి నరం అందేది కాదు.

“నరాలు గుచ్చి గుచ్చి చంపుతార్రా ఈ డాక్టర్లు! ఈ ఆస్పత్రి వైద్యం వద్దురా! ఆయుర్వేదం గుళికలు వేసుకుంటా” అనేది కామేశ్వరి బాధతో.

తల్లి బాధపడుతుంటే రఘురాముకు కళ్ళల్లో నీళ్లు తిరిగేవి. తండ్రి ఆస్పత్రి చూడకుండా ఇంట్లోనే అనాయాసంగా మరణించాడు. తల్లికి మళ్ళీ ఏమన్నా అయితే ఆ ఆస్పత్రుల్లో ఇంజక్షన్ల, టెస్టుల హింస ఆవిడ తట్టుకోలేదు. ఇప్పుడు దూరపు ప్రయాణం పెట్టుకోవటం తల్లికి అంత క్షేమం కాదు.

“అయితే దగ్గరలో ఉన్న ఫారెస్ట్ రిసార్ట్ కు తీసుకెళ్ళాలి!” అనుకున్నాడు రఘురామ్.

హైదరాబాద్ కు దగ్గరలో ఉన్న ఫారెస్ట్ రిసార్ట్స్ గురించి గూగుల్ లో చూసి మంచి రెప్యుటేషను ఉన్న రిసార్ట్ సెలెక్ట్ చేశాడు రఘురామ్. శని, ఆదివారాలు అక్కడ రూమ్స్ బుక్ చేశాడు. తల్లికి కావాల్సిన సామాన్లు, మందులు, వీల్ చెయిర్అన్నీ పెట్టుకున్నారు. ప్రక్కన పనిమనిషి రమణమ్మ కూడా వచ్చింది. పొద్దున ఆరింటికి బయలుదేరి ఎనిమిది గంటలకల్లా రిసార్ట్ చేరుకున్నారు.

అందరూ టిఫిన్లు చేసి, కామేశ్వరితో పాటు చెట్లమధ్య కూర్చున్నారు. చుట్టూ ప్రకృతి. పక్షి కూతలు, అక్కడక్కడా తిరుగుతున్న కుందేళ్లు, లేళ్ళు, నెమళ్ళు. చెరువు దగ్గర కొంగలు, నీటి కాకులు, చెట్ల మీద పక్షులు, పక్షి గూళ్లు. ఆహ్లాదకరమైన వాతావరణం. కామేశ్వరి పరవశించి చూస్తోంది. రివ్వున వీస్తున్న గాలి. అతడి చెయ్యి పట్టుకొని చెట్లమీద ఆడుకుంటున్న ఉడతల్ని చూపించింది కామేశ్వరి. ఏదో స్వర్గంలోకి వచ్చినట్లు మైమరచి చూస్తోంది కామేశ్వరి.

మధ్యాహ్నం తల్లిని రూములో పడుకోబెట్టాడు రఘురామ్. సాయంత్రం వీల్ చైర్ లో తల్లిని కూర్చోబెట్టుకొని మెల్లగా తిప్పాడు. చెరువులో తెలుపు, ఎరుపు తామరపూలు కనువిందుచేస్తున్నాయి. సాయంత్రం కోలాహలంగా పక్షులన్నీ అరుస్తూ గూళ్లను చేరుకుంటున్నాయి. ఆ ప్రకృతిని ఆస్వాదించి, అందరూ సంబరంగా రూములు చేరుకొని భోజనాలు చేసి పడుకున్నారు. రెండోరోజు సాయంత్రం దాకా అక్కడే గడిపి రాత్రికి హైదరాబాద్ చేరుకున్నారు.

కామేశ్వరికి కొత్త శక్తి వచ్చినట్లుంది. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. మొహం వెలిగిపోతూ ఉంది. రాత్రి తల్లి దగ్గరికి వచ్చాడు. కొడుకు చెయ్యి పట్టుకుంది కామేశ్వరి.

"ప్రాణం అంతా చెట్ల మీదే ఉందిరా! ఎంత హాయిగా వుందో! స్వచ్ఛమైన గాలి, వెలుతురు, గుండె నిండిపోయిందిరా!"

"వీలయినప్పుడల్లా వెళ్లొద్దామమ్మా... ఇంక పడుకో!" అంటూ నవ్వుతూ తల్లికి దుప్పటి కప్పాడు రఘురామ్.

తృప్తిగా కళ్ళు మూసుకొంది కామేశ్వరి.

తెల్లవారి ఐదున్నరకు లేచి బ్రష్ చేసుకొని అలవాటుగా తల్లి గదిలోకి వచ్చాడు రఘురామ్. కామేశ్వరి ఇంకా లేవలేదు. ప్రశాంతంగా పడుకొని ఉంది. రమణమ్మ బాత్ రూంలో నీళ్లు పడుతూ ఉంది.

తల్లి ప్రక్కన కూర్చుని తదేకంగా చూసాడు. ఆమెలో ఏ కదలిక లేదు. చెయ్యి పట్టుకున్నాడు. చల్లగా బిగుసుకొని పోయింది.

"అమ్మా... అమ్మా..." అంటూ ఆమెను కుదిపాడు. కామేశ్వరిలో చలనం లేదు. అతడికి అర్థం అయింది. తల్లి లేదు. రోదిస్తూ తల్లిని చుట్టుకున్నాడు.

రావలసిన వాళ్ళు వచ్చారు. జరగాల్సిన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

రఘురామ్ కు తల్లి మాట్లాడిన చివరిమాటలే చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

"ప్రాణం అంతా చెట్ల మీదే ఉందిరా!"

అతడికి బెంగగా ఉంది. తల్లి లేని ఇల్లు...

"నెల లోపల మా ఇంటికి వచ్చి నిద్దర చేసి వెళ్లాలిరా! ఎప్పుడు వస్తున్నావు?" అన్నాడు చిన్న మేనమామ నరసింహారావు రఘురామ్ కు ఫోన్ చేసి.

నరసింహారావు ఉండేది వెలిగెండ్లలో. అతడు వ్యవసాయదారుడు. అతడు రఘురామ్ కంటే పదేళ్లు పెద్ద. తీరిక చేసుకొని వెలిగెండ్ల వచ్చాడు రఘురామ్. కుశలప్రశ్నలు అయ్యాయి.

"ఎలా ఉంది ఇక్కడ వ్యవసాయం మామయ్యా!" నరసింహారావును అడిగాడు రఘురామ్.

"ఏముందిరా! కూలి రేట్లు పెరిగాయి. వ్యవసాయం చాలా ఖరీదు అయ్యింది. ఇక్కడికి దగ్గరలో ఉండే మర్రెగుంట దాకా సోమశిల ప్రాజెక్టు నీళ్లు వస్తున్నాయి. కాబట్టి కొద్దిగా వరి పండుతుంది, మిగిలిన ఊళ్లల్లో వరి పండటం కష్టం. నీళ్లు చాలటం లేదు. రైతులు

కూరగాయలు, పండ్లు పండిస్తున్నారు. అసలు భూగర్భంలో నీళ్లు తగ్గిపోతున్నాయి. మనల్ని, మనమే నాశనం చేసుకుంటున్నాము. అడవులు కొట్టివేయటం, భూమినంతా త్రవ్విపోస్తూ వ్యవసాయభూములుగా మార్చేస్తూ ఉండటం, పట్టణాలు పెరగటం... దీని వలన ఉపయోగం ఏముంది? ప్రకృతిమాతను రక్షించకపోతే ప్రళయం తప్పదు! తెలిసికోలేకపోతున్నాము! అంతే!" భారంగా చెప్పాడు నరసింహరావు.

"ఇక్కడ ఎకరా ధర ఎంత ఉంది మామయ్యా!"

"ఎకరా ఐదారు లక్షల్లో ఉంది."

"మామయ్యా! పొలం కొని చెట్లు పెంచుకోవాలని అనుకుంటున్నాను. వచ్చే సంవత్సరం రిటైర్ అవుతాను. హైదరాబాదులో రెండిళ్ళు ఉన్నాయి. ఆ అద్దెలు చాలు బ్రతకటానికి. పిల్లలకు అవి ఇస్తాను. నాకు వచ్చే డబ్బులతో చెట్లు పెంచుకుని ప్రశాంతంగా శేషజీవితం గడుపుదామని..."

"చాలా సంతోషంగా ఉందిరా! మీ అమ్మలాగా నీక్కూడా చెట్లంటే ఇష్టం అన్నమాట! అయితే రేటు కనుక్కొని చెప్తాను. షుమారు ఎన్ని ఎకరాలు కొనగలవో చెప్పు! అసలునువ్వు ఇక్కడికి వస్తాననటం చాలా సంతోషంగా ఉందిరా!" నరసింహారావు హృదయం ఉప్పొంగి పోయింది. 'సెంట్రల్ గవర్నమెంటులో పెద్ద ఉద్యోగం చేస్తున్న రఘురామ్ హృదయం ఎంత మెత్తటిది. అక్క ఎంత అదృష్టవంతురాలు' అనుకున్నాడు మనసులో.

హైదరాబాద్ తిరిగి వచ్చాడు రఘురామ్.

గౌరితో, పిల్లలతో చెయ్యాల్సిన పని చెప్పాడు. కుటుంబసభ్యుల నుండి అభ్యంతరం లేదు. గౌరి పుట్టింటి వాళ్ళు లింగసముద్రంలో ఉంటారు. అందుకని అక్కడే బంధువుల దగ్గర సెటిల్ అయితే బాగుంటుందని గౌరి ఆలోచన. పిల్లలా దూరంగా ఉంటారు. బంధువులు కాస్త పలుకుతోడుగా ఉంటారని గౌరి సంతోషంగా ఒప్పుకుంది. రఘురామ్ డబ్బుల లెక్కలు చూసుకున్నాడు. ఇన్నేళ్ళు ఉద్యోగం చేసినందుకు దాదాపు కోటి దాకా వస్తాయి. కొడుకు కశ్యప్ తన డబ్బులు కూడా ఒక కోటి పంపిస్తానన్నాడు.

ఈ లోపల అటవీశాఖాధికారులను సంప్రదించాడు. చెట్లు పెంచే విషయంలో ప్రతి శని, ఆదివారాలు వెళ్ళి ట్రైనింగ్ తీసికొన్నాడు. రిటైర్ మెంటు కోసం ఎదురుచూస్తున్నాడు రఘురామ్.

తల్లి ఏడూడి అయింది. రిటైర్ అయ్యాడు రఘురామ్.

వెలిగెండ్లలో ముప్ఫై ఎకరాలు కొన్నాడు. జమ్మి, మద్ది, రావి, మర్రి, వేప, చింత, కానుగ, మారేడు ఉసిరి లాంటి పెద్ద పెద్ద చెట్లు వేసాడు. అవే కాక చుట్టూ ఫెన్సింగ్ లాగా వెదురు చెట్లు పెంచాడు. పూల మొక్కలు, రకరకాల తీగలు ఇలా ఎన్నో చెట్లు వేశాడు. కొంత మేర ఔషధ మొక్కలు పెంచాడు. అక్కడే ఇల్లు కట్టుకున్నాడు. ఆ ఊరిలో వాళ్లకు ఉచితంగా మూలికా వైద్యం చేస్తున్నాడు.

నాలుగేళ్లు గడిచాయి. ఆ రోజు కామేశ్వరి తద్దినం. బంధువులందరూ వచ్చారు. భోజనాలు చేసేటప్పటికి ఆలస్యం అయింది. సాయంత్రం బంధువులకు వీడ్కోలు పలికి తోటలోకి వచ్చాడు రఘురామ్. జమ్మిచెట్టు క్రింద కూర్చున్నాడు.

అలసట వలన కొంచెం మాగన్నుగా నిద్రపట్టింది.

అతడికి స్వప్నంలో తల్లి కనిపించింది. దేవతలా వెలుగుతూ ఉంది. ప్రేమగా అతడి తల నిమురుతూ ఉన్నట్లు.

"అమ్మా!... అమ్మా!.." అంటూ అస్పష్టంగా కలవరిస్తున్నాడతడు.

తల్లి అతడిని దగ్గరగా తీసికొన్నట్లుగా అనిపించింది.

చటుక్కున మెలకువ వచ్చింది. చెట్టుపైకి చూశాడు. తల్లి రూపం ఆకుల మధ్య... ఆకు ఆకులో... సూర్యకిరణాల మధ్య.... అలాగే చూస్తున్నాడు రఘురామ్.

అమ్మ కనిపించింది... చెట్లలోనే ఉంది... చిన్నపిల్లాడిలా చెట్టు మొదలును గట్టిగా పట్టుకున్నాడు. 'అమ్మ ఇక్కడే ఉంది. తన చుట్టూ ప్రకృతిలో నిండిపోయి... అమ్మ నవ్వుతూ కనిపించింది...'

చెట్టును పసిబిడ్డలా కౌగలించుకున్నాడు.

"ఇక్కడే ఉన్నాను నాన్నా!" అన్నట్లు గాలి అతడి తల్లిలాగా మృదువుగా అతడి శరీరాన్ని తడుముతోంది. ప్రకృతికీ తల్లికీ భేదం లేదు. రెండూ ఒకటే. ప్రేమించిన వాళ్లకు మాత్రమే ఆ విలువ తెలుస్తుంది.

# పయనించే ఓ చిలుకా!




9959974598

తాతా కామేశ్వరి


**జన్మదిన సంచిక 2024 'పల్లెకు పోదాం'కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

**ఈనాటి సాంకేతికత ఆ పల్లెలో అనేక మార్పులు తెచ్చింది. అందరి చేతులలో స్మార్ట్ ఫోన్స్, పిల్లల చేతిలో లాప్‌టాప్‌లు, తినడానికి హోటల్స్, దాబాలు, వాహనాల రద్దీ కూడా పెరిగింది, ఇళ్ళలో టీవీకి డిష్ కనెక్షన్స్, ఏసీలు వచ్చాయి. కానీ అంత ఆధునికతలో కూడా నా చిన్ననాటి బాడంగి ఛాయలు స్పష్టంగా కనబతున్నాయి. ఆ పొలాల గట్లు, మామిడి తోటలు, ఆ గుడి, మా స్కూల్, ముఖ్యంగా అక్కడ మనుషులు, వారి ప్రేమాభిమానాలు, వాటిలో ఏ మార్పు లేదు.**


మధ్యాహ్నం నేను బాస్‌తో ముఖ్యమైన మీటింగ్‌కి సిద్ధమౌతుండగా ఫోన్ మోగడంతో, కొంచెం అసహనంగానే 'ఎవరా?'అని చూస్తే, మణి పిన్ని! బాస్ అసలే చాలా పంక్చువల్, టైముకి మీటింగ్‌కి వెళ్లకపోతే చిందులు వేస్తాడు అనుకుంటూ, ఫోన్ తీసి,"పిన్నీ, కొంచెంబిజీగా ఉన్నాను, సాయంత్రం ఇంటికి వెళ్లి చేస్తాను" అని ఆమె ఏమి అంటోందో కూడా వినకుండా ఫోన్ పెట్టేసి, లాప్టాప్ అందుకుని బాస్ కేబిన్ వేపు త్వరగా అడుగులు వేశాను.

సాయంత్రం ఇంటికి చేరి వంట, ఇంటి పనులలో మునిగిపోయిన నాకు పడుకునేటప్పుడు కానీ మధ్యాహ్నం పిన్ని కాల్ గుర్తురాలేదు. వెంటనే బాగ్ లోంచి ఫోన్ తీసి కాల్ చేశాను. రెండు రింగ్స్‌కేపిన్ని ఫోన్ తీసి, "అమ్మా లల్లీ!" అన్న ప్రేమతో నిండిన పలుకులకి నా అలసిన మనసు, దేహం రెండూ సేద తీరాయి. పిన్ని మా అందరి కుశల క్షేమాలు అడిగి, వారి సంగతులతో పాటు ఇరుగు పొరుగు, చుట్టాలు, పల్లె సంగతులు కూడా చెప్పి, చివరికి ఎప్పటిలాగే నన్ను చూడాలని ఉందని, ఊరు రమ్మని అభ్యర్థించింది.

"సెలవు చూసుకొని తప్పక రావడానికి ప్రయత్నిస్తా" అని చెప్పి ఫోన్ పెట్టేసా.

పిన్ని ఉండేది బొబ్బిలి పక్కన ఓ పల్లెటూరు... బాడంగి. అమ్మ కాలం చేసేక పిన్ని, బాబాయి నన్ను వారితోపాటు, వారి ఊరు బాడంగి తీసుకెళ్ళి, స్కూల్లో వేసి, చాలా గారంగా పెంచారు. తరువాత ఉన్నత చదువులు, ఉద్యోగం, పెళ్లి అవ్వడంతో, నేను ఆ ఊరు వెళ్లడం చాలా అరుదైపోయింది. ఏ పెళ్లికో, ఫంక్షన్‌కో వెళ్లి ఒక పూట ఉండి రావడమే, కానీ పట్టుమని ఓ వారం రోజులు కూడా ఉండలేదు. పిన్నీ బాబాయే నా వద్దకి వచ్చి కొన్ని రోజులు ఉండి వెళ్లేవారు. కానీ ఇప్పుడు వయసు పైబడడంతో, వారు ప్రయాణం చెయ్యలేక ఫోన్ చేసినప్పుడల్లా నన్ను రమ్మంటారు పాపం. వీలు అవక వెళ్ళలేని స్థితి నాది. కానీ ఇవాళ పిన్ని మాటలు నాకు చాలా బాధ కలిగించాయి.

'నేను ఇవాళ ఇంత ఉన్నతస్థాయిలో ఉండడానికి కారణం ఆ దంపతుల చలవే కదా!' అనుకోని, ఎలాగైనా బాడంగి వెళ్లాలని నిర్ణయించుకున్నాను. పొద్దునే శ్రీవారికి ఈ సంగతి చెప్పి, వెంటనే ఆఫీస్‌కి వెళ్లి లీవ్ పెట్టాలనుకున్నాను.



బాడంగి అనగానే ముప్పై ఏళ్ల క్రితం ఆ చిన్న పల్లెటూరు, పిన్ని వాళ్ళలోగిలి, దానిలో బాదాము, మామిడి, పనస, కుంకుడు చెట్లతోపాటు కనకాంబరం, మల్లెలాంటి పూలమొక్కలు గుర్తొస్తాయి. వేసవిలో కరెంట్ పోతే ఆ లోగిలిలోనే పట్టె మంచాలు వేసుకొని పడుకునే వాళ్ళం. మధ్యాహ్నం వేళ పిల్లలంతా చేరి అరుగు మీద వైకుంఠపాళి, అష్టాచెమ్మాలాంటి ఆటలు ఆడుకునేవాళ్ళం. ఆ రోజులు గుర్తు చేసుకుంటూ నిద్రలోకి జారుకున్నాను. మర్నాడు శ్రీవారికి, పిల్లలకి విషయం చెప్పి, లీవ్ దొరకగానే పూణే – వైజాగ్‌కి ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకుని, పిన్నికి నేను వస్తున్న సంగతి చెప్పడంతో ఆమె ఆనందంతో ఉప్పొంగిపోయింది.

మరుసటి వారమే పూణే – వైజాగ్ ఫ్లైట్ ఎక్కి బయలుదేరాను. ఫ్లైట్ దిగి ముందుగానే బుక్ చేసి ఉంచుకున్న క్యాబ్ ఎక్కి బాడంగికి బయలుదేరా. వైజాగ్ నుండి బాడంగి వంద కిలోమీటర్లకి పైనే ఉంటుంది, సుమారు రెండున్నర గంటలు పడుతుందని చెప్పాడు డ్రైవర్. క్యాబ్ విజయనగరం– సింహాచలం రోడ్ మీదుగా పోసాగింది. తోవలో పచ్చటి చెట్లు, పొలాలు చూస్తుంటే మనసులో ఏదో తెలియని సంతోషం, నా ఆలోచన పొరలలో బాల్యంలో నేను బాడంగిలో గడిపిన రోజులు మెదలసాగాయి. చిన్ననాటి స్నేహితులు, మా స్కూలు గుర్తొచ్చాయి. ఆ రోజులలో టీవీలు అరుదు అని చెప్పవచ్చు. మా పిన్ని వాళ్ళ ఇంటికి అనుకుని ఉండే ఒక మేడ మీద ఓ జూనియర్ ఇంజనీర్ గారు ఉండేవారు. అయన వద్ద జపాన్ నుండి తెప్పించుకున్న 'టూ ఇన్ వన్', అంటే 'టేప్ రికార్డర్ కం రేడియో'ఉండేది. అతను ఉదయాన్నే గట్టిగా ఆకాశవాణి వైజాగ్ కేంద్రం పెట్టేవారు. దానిలో తెలుగులో వార్తలు వస్తూ ఉంటే ఏడు అవుతోందని, నేను పిన్ని పెట్టిన టిఫిన్ తినేసి, పొలాల గట్ల మీదుగా ఓ కిలోమీటరు నడిచి స్కూల్ కి చేరేదానిని.

మా సోషల్ మాస్టారు, బాడంగి గురించి చాలామందికి తెలియని ఓ చారిత్రాత్మకమైన విషయం చెప్పేవారు. రెండో ప్రపంచ యుద్ధం

జరిగేటప్పుడు, 1942 లో బ్రిటిష్ ఎయిర్ ఫోర్స్ బాడంగిలో ఒక ఎయిర్ స్ట్రిప్ కట్టి, దానిని ఎయిర్ బేస్‌గా వాడేవారని, ఇక్కడ చాలా యుద్ధ విమానాలు ఉండేవని, 1946 లో యుద్ధం ముగిసేదాకా దానిని మూసివేశారని చెప్పేవారు. బాడంగికి ఉన్న చారిత్రాత్మక ఘట్టం తెలుసుకున్న మేము గర్వంతో నిండిపోయేవాళ్ళం.

వేసవిలో నా స్నేహితురాలు విజయలక్ష్మివాళ్ళ తోటకు వెళ్లి సరదాగా కావలసినన్ని మామిడికాయలు, పళ్ళు కోసుకునేవాళ్ళం. పిన్ని వాటితో నాకు ఇష్టమని, ఎక్కువగా బెల్లం వేసి ఎండు ఆవకాయ, మాగాయి పచ్చడి పెట్టేది. ఇలా నేను ఆలోచనల్లో ఉండగా కారు బొబ్బిలి పార్వతీపురం రోడ్ మీదుగా బాడంగి చేరింది. సూర్యుడు పడమరలో వీడుకోలు పలుకుతుంటే, నా కారు పిన్నివాళ్ళ ఇంటి ముందు ఆగింది.

కారు దిగుతూనే పిన్ని, బాబాయితోపాటు ఇరుగుపొరుగు వారు కూడా నా చుట్టూ మూగి పలకరించి, కుశల క్షేమాలు అడుగుతూ, నా సామాను వారే ఇంటి లోపట పెట్టి, మళ్ళీ వస్తామని వారివారి ఇళ్ళకి వెళ్లిపోయారు. వారి ప్రేమాభిమానాలు చూసి ఎలా స్పందించాలో అర్థమవలేదు. పెద్ద పట్నంలో ఉంటున్న నాకు ఇవన్నీ కొత్తగా అనిపించాయి.

అంతా వెళ్ళేక, పిన్ని నా పక్కన కూర్చొని నన్ను దగ్గరకి తీసుకొని “ఎన్నాళ్ళకి చూసానేలల్లీ, అంత చిక్కి పోయావేంటే? వండినదంతా పిల్లలకి, భర్తకే పెట్టేస్తున్నావా ఏమిటి? ఈ క్రాఫ్ జుట్టు ఏమిటే?” అన్నది, నా బాయ్ కట్ చూస్తూ.

దానికి నేను నవ్వుతూ “పిచ్చి పిన్నీ, నేను బాగానే ఉన్నాను. నా జుట్టు ఓ కాన్సర్ ఛారిటీ ఫౌండేషన్‌కి డొనేట్ చేశాను. అక్కడ కాన్సర్ ట్రీట్మెంట్ తీసుకుంటూ జుట్టు పోయినవారికి ఉచితంగా విగ్స్ తయారు చేసి ఇస్తారు” అని నేను చెప్పడంతో ఆమె సంతోషంగా “చాలా మంచి పని చేశావు లల్లీ. ఆ పేషెంట్స్‌లో కొత్త ఆత్మ విశ్వాసం కలిగించినదానివి అయ్యావు తల్లీ!” అని నన్ను ముద్దు పెట్టుకుంది.

ఇలా మాట్లాడుతూనే, పిన్ని గబగబా లోపలి వెళ్లి ఒక మోదుగ ఆకులో వేడిగా ఉప్పు పిండి, ఒక పక్క చింతకాయ పచ్చడి వేసి నా చేతిలో పెట్టి, ఒక ఇత్తడి గ్లాసులో వేడిగా కాఫీ ఆప్యాయంగా అందించింది. అవి అందుకుంటూ ‘పిన్నికి నాకు ఇష్టమైనవన్నీ గుర్తున్నాయి’అనుకుని, టిఫిన్ కాఫీ తినడం కానిచ్చి ఫోన్ తీసి శ్రీవారికి ‘రీచ్డ్ హోమ్’అని మెసేజ్ పెట్టాను.

రాత్రి పది గంటల వరకు మాట్లాడుకుని పడుకున్న నాకు అలసట వల్ల వెంటనే నిద్ర పట్టేసింది. పొద్దున్నే ఆరు గంటలకి పక్షుల కిచకిచలతోపాటు బయట ఎవరివో మాటలు విని మెలకువ వచ్చింది. లేచి చూస్తే పాలు పోసే అమ్మాయి వెంకమ్మ. నన్ను చూస్తూనే పిన్నిని అడిగింది “అమ్మగోరూ, ఈమేనా మీ అక్కయ్య కూతురు?” అంటూ నన్ను సంబోధిస్తూ “మంచి పని సేసావమ్మా వచ్చి. ఈ అమ్మ నీ గురించి తలవని రోజు లేదు. రోజూ నీ సిన్ననాటి మాటలు చెప్పి మురిసిపోతారు” అనంటూ పాలు పోసి వెళ్ళింది.

నేను వెళ్లి మొహం కడుక్కొని వచ్చేసరికి పిన్ని వేడి కాఫీ తెచ్చియిచ్చింది. నేను స్నానం చేసి టిఫిన్ చేస్తూ ఉండగా, పిన్ని ద్వారా ముందే నేను వస్తున్నాని తెలుసుకున్న నా చిన్ననాటి మిత్రులు ప్రసాద్, ఎండుగాడు వచ్చారు. వాడు చిన్నప్పుడు సన్నగా, ఎండుగా ఉండేవాడు, అందుకన్నమాట ఆ పేరు. కాని ఇప్పుడు ఆ పేరు ఆనవాలు జాడ లేదు. ఇద్దరూ చాలా మారిపోయారు, కానీ వారు నాతో మెసిలే తీరులో ఏ మార్పు లేదు. చిన్నప్పటి లాగానే సరదాగా వారి ఇంటికి తీసుకుని వెళ్ళి, వారి ఇంట్లో వారిని కలిసి, నన్ను నా బెస్ట్ ఫ్రెండ్ భ్రమరాంబ ఇంటికి తీసుకుని వెళ్లారు. ఆమె నన్ను చూసి సంతోషంతో కన్నీరు పెట్టుకుని గట్టిగా గుండెలకు హత్తుకుంది. తన ఇంటి వారిని పరిచయం చేసి, నేను చిన్నపుడు ఇష్టంగా తినే కారం పూస, జాంగ్రీతెప్పించి పెట్టింది. చిన్ననాటి మిత్రులు అంతా ఎవరు ఎక్కడ ఉన్నారో, ఏమి చేస్తున్నారో అన్నీ చెప్పింది.

అక్కడ ఉన్నన్ని రోజులూ ప్రసాద్, ఎండుగాడు నన్ను వారి బైక్ మీద బాడంగి అంతా చూపించారు. ఈనాటి సాంకేతికత ఆ పల్లెలో అనేక మార్పులు తెచ్చింది. అందరి చేతులలో స్మార్ట్ ఫోన్స్, పిల్లల చేతిలో లాప్‌టాప్‌లు, తినడానికి హోటల్స్, దాబాలు, వాహనాల రద్దీ కూడా పెరిగింది, ఇళ్ళలో టీవీకి డిష్ కనెక్షన్స్, ఏసీలు వచ్చాయి. కానీ అంత ఆధునికతలో కూడా నా చిన్ననాటి బాడంగి

ఛాయలు స్పష్టంగా కనబతున్నాయి. ఆ పొలాల గట్లు, మామిడి తోటలు, ఆ గుడి, మా స్కూల్, ముఖ్యంగా అక్కడ మనుషులు, వారి ప్రేమాభిమానాలు, వాటిలో ఏ మార్పు లేదు. ఎక్కడికి వెళ్ళినా ఆప్యాయంగా పలకరించే అక్కడి వారిని చూసి నేను ఇన్ని రోజుల ఏమి కోల్పోయానో అర్థం అయింది. ఈసారి ఎలాగైనా శ్రీవారిని, పిల్లలని బాడంగి తప్పక తీసుకుని రావాలని నిర్ణయించున్నాను. వారికి పల్లె వాతావరణం, ఆకుపచ్చని పొలాలు, కాలుష్యంలేని వాతావరణం, అలికి అందంగా ముగ్గులతో అలంకరించిన ముంగిళ్ళు, ఫ్యాన్సీ ఐస్ క్రీంస్ బదులుగా మృదువుగా ఉన్న తియ్యటి జున్ను తినిపించాలి అనుకున్నా!

సెలవు అయిపోవచ్చింది, పిన్ని బాబాయిని విడిచి వెళ్లాలంటే చాల బాధగా ఉంది. ఇరుగుపొరుగు వారికి చూడమని చెప్పనవసరంలేదు, ఎవరో ఒకరు రోజంతా వస్తూనే ఉంటారు. చివరి రోజు ప్రయాణానికి సిద్ధం అవుతూ ఉంటే పిన్ని వచ్చి "లల్లీ, మళ్ళీ త్వరగా రా తల్లీ. యీ ముసలి ప్రాణాలు నీ కోసం ఎప్పుడూ ఎదురుచూస్తూ ఉంటాయి" అని కళ్ళు తుడుచుకుంటూ నన్ను గుండెలకు హత్తుకుంది. ప్రసాద్, ఎండుగాడు వచ్చి కార్లో నా సామాను పెట్టారు. ఇరుగు పొరుగు వారంతా వీడుకోలు చెప్పడానికి వచ్చారు. పిన్నీ బాబాయికి దండం పెట్టి, అందరికీ వీడుకోలు పలికి కారు ఎక్కుతూ ఉంటే దూరంగా ఎక్కడనుంచో "పయనించే ఓ చిలుకా! ఎగిరిపో" అని పాతపాట వినిపించి నా కళ్ళు చెమర్చాయి.

# సహచరుడు

## శింగరాజు శ్రీనివాసరావు



9052048706

**జన్మదిన సంచిక 2024 'పల్లెకు పోదాం'కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

**నగరాల్లో దర్జాగ బ్రతకతా, అమ్మను, అబ్బను ఆశ్రమాల పాల్జేసే సదువుకున్నోల్లు ఉన్న ఈ రోజుల్లో, కూటికి సాగని నువ్వు మమ్మల్ని వదిలేయడం తప్పు కాదురా. అయినా ఓపికున్నపుడే నీ మీద ఆధారపడ్డం తప్పనిపించిందిరా. యెవసాయం సేసే ఓపిక లేకున్నా, గుళ్ళెంబడి తిరిగే ఓపికుందిలేరా. ఇదయితే పున్యానికి పున్యం, సంపాదనకి సంపాదన.**

వీరాస్వామికి కంటి మీద కునుకు రావడం లేదు. లోపల పడుకుంటే నిద్రరాక పంచలోకి వచ్చి కూర్చున్నాడు. ఎదురుగా కొష్టంలో కట్టేసిన లక్ష్మణను చూస్తూ కూర్చున్నాడు. బహుశా దానికి కూడ నిద్ర రాలేదేమో... మోరెత్తి వీరాస్వామి వంక చూసింది. దాని దగ్గరకు పోవాలని లేచి వీరాస్వామి రెండు అడుగులు ముందుకు వేశాడు. కానీ మనసొప్పలేదు. తిరిగి వెనుకకు వచ్చి మరల పంచలో కూలబడ్డాడు. వారిద్దరి మధ్య బంధం ఈనాటిది కాదు. వీళ్ళిద్దరికి తోడుగా రామన్న కూడ ఉండేవాడు. వీళ్ళ ముగ్గురి సారథ్యంలో నేలతల్లి ఎన్నో పచ్చని పట్టుచీరలు కట్టుకుంది. వీరాస్వామి కుటుంబానికే కాదు, వారి చుట్టూ ఉండే పదిమందికి కూడ అన్నం పెట్టిన ఘనత ఈ ముగ్గురికే దక్కుతుంది. అయిదు సంవత్సరాల క్రితం వరకు అవనితో వారికి ఉన్న బంధం, యంత్రాల రాకతో తెగిపోయింది. వీరాస్వామికి రెక్కలు అరిగి పోయాక, అతని కొడుకు రంగనాథం పొలం పని చేతిలోకి తీసుకున్నాడు. తండ్రి మాట కాదనలేక కొన్నాళ్ళు జోడెద్దులతో అరక సాగించినా, తరువాత తరువాత ఎడ్ల సేద్యాన్ని పక్కనబెట్టి, అద్దెకు తెచ్చి ట్రాక్టరుతో పొలాన్ని దున్నడం మొదలుపెట్టాడు. తరువాత కొంత కాలం చాళ్ళు ఎద్దులను పెట్టి తీయించేవాడు. పండిన వడ్లను బస్తాలలోకి ఎక్కించి ఎడ్లబండి మీద పట్టణానికి తీసుకెళ్ళి అమ్ముకుని వచ్చేవాడు. అయిదేళ్ళ క్రితం రామన్నకు జబ్బు చేయడంతో ఆ పని కూడ మాన్పించాడు. జబ్బు తీవ్రత పెరిగి రామన్న రెండు సంవత్సరాల క్రితం కాలం చేశాడు. ఇక మిగిలిన వీరాస్వామి, లక్ష్మన్నలు, రంగనాథానికి బరువు చేటయ్యారు. పోయిన ఏడాది లక్ష్మన్న వల్ల మనకు ఉపయోగం లేదు కదా దాన్ని ఏ సంతకో తీసుకెళ్ళి అమ్ముదామన్నాడు రంగనాథం. కానీ వీరాస్వామి ఒప్పుకోలేదు. రంగనాథం ఇంకేమీ మాట్లాడలేదు. మరల వారం క్రితం అదే విషయాన్ని తిరిగి హెచ్చరించాడు రంగనాథం. ఆ రోజు జరిగిన సంఘటన మనసులో మెదిలింది వీరాస్వామికి.

★★★

"నాన్నా... ఎంతకాలం దీన్ని ఊరికే మేపాలి. దీని ఒక్కదాని వలన మనకు ఉపయోగం లేదు. పోనీ దీనికి తోడుగా ఇంకో ఎద్దును కొందామంటే అంత డబ్బు నా దగ్గర లేదు. అప్పో సొప్పో చేసి కొన్నా, వీటి ద్వారా వ్యవసాయం గిట్టుబాటు కాదు. అన్నిటికి ఇప్పుడు

యంత్రాలు వచ్చాయి. ఖర్చు తక్కువ, సమయం ఆదా, వెరసి మనకు కాస్తోకూస్తో రాబడి పెరుగుతుంది. దీన్ని ఏ సంతకో తోలుకెళ్ళి అమ్మితే డబ్బులన్నా వస్తాయి!"

"అదికాదురా రంగా... దాంతో నాకున్న బంధం ఇయ్యాల్టిది కాదురా. దానికి వంట్లో ఓపిక ఉన్ననాళ్ళు మన కుటుంబానికి ఎంతో సేవ సేసిందిరా. ఈ ట్రాక్టర్లు రాకముందు ఇవేకదంటరా పొలం పనులకు, మనకు, అండగా ఉండి బండెడు చాకిరీ సేసింది. దానికి తోడున్న రామన్న సచ్చిపోయె. ఇదొక్కటే ఏ పని సెయ్యగలదురా. బతికినన్నాల్లు బతకబోదు. దాన్ని నాతోనే ఉండనీయరా"

"ఇదిగో అయ్యా... ఇట్టాంటి సెంటిమెంటు మాటలు చెప్పమాక. ఇది మీ కాలం కాదు... కలిగిన కాడికి తిని తొంగోడానికి. నా కంటే అచ్చరమ్ముక్క లేకపోయేసరికి నీకు ఖర్చంటే ఏటో తెలవలేదు. ఇప్పుడు నీ మనవణ్ణి చదివించాలంటే ఈ పైసలు చాలవు. ఇంతమందిని పోషించే టికాణ నాకు లేదు. ఉపయోగమ్మాలిన దానికి తిండెట్టే స్తోమత నాకు లేదు. అయినా నీ మాట కాదనలేక రెండేల్లు దీన్ని భరించా. ఇక నావల్ల కాదు" "అదేంటిరా అయ్యా... అట్టంటావు. అయికూడ మాలాగే మన కుటుంబం కోసం కష్టపడ్డాయి. ఇప్పుడు ఆటి అవసరం లేదని నెట్టేయడం దర్మమంటరా? ఆ లెక్కన నేను కూడ నీకు భారమేగా"

"భారమే... కానీ తప్పదుగా! కన్నోడిని ఎల్లగొట్టానని పదిమంది నన్ను దుమ్మెత్తి పొయ్యరూ? అయినా నీకు, దానికి పోలికేంటయ్యా. పశువు పశువే... మడిసి మడిసే! నువ్విట్టాంటి పితలాటకం మాటలు చెప్పి దాన్ని ఈడ ఉంచాలనుకుంటే కుదరదు. రేపే దాన్ని సంతకు తోలకపోయి అమ్మేత్తా. ఈ వారం కాకపోతే మరో వారం. దాన్ని అమ్మిందాక నిద్రపోను. నువు కూడ ఈ బంధాలు, అనుబంధాలు అనే సొల్లు ఆపి వాస్తవంలోకి రా. లేకుంటే నీ నోట్లో నువ్వే మన్ను కొట్టుకున్నట్టు" అని చెప్పి విసురుగా లేచి వెళ్ళాడు రంగనాథం.

ఏం చెయ్యాలో పాలుపోక దిగులుపడి కూర్చున్నాడు వీరాస్వామి. అనుకున్న ప్రకారమే లక్ష్మన్నను తోలుకుపోయి సంతలో బేరం పెట్టాడు రంగనాథం. కానీ చెప్పిన రేటుకు కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. తెగనమ్మడానికి మనసొప్పని రంగనాథం, వచ్చే వారం మరో సంతకు పోదామని దాన్ని ఇంటికి తీసుకు వచ్చాడు. లక్ష్మన్నతో కలిసి వచ్చిన కొడుకు మనసు మార్చుకున్నాడేమో అనుకున్నాడు వీరాస్వామి. అసలు విషయం కొడుకు నోటి నుంచి విన్నాక హతాశుడయ్యాడు.

★★★

గతం గుర్తుకు వచ్చి వీరాస్వామి దిగులుగా లక్ష్మన్న వైపు చూశాడు. దాని కళ్ళు తడిదేరి ఉండడం లీలగా కనిపించింది. మనసు ఉండబట్టలేక దాని దగ్గరికి వెళ్ళాడు. వీరాస్వామి రాగానే అది లేచి నిలుచుంది. నిజంగానే అది ఏడుస్తున్నది. దానికి మాటలు రాకపోవచ్చేమో గానీ, పరిస్థితిని అంచనా వేసే తెలివితేటలు ఉన్నాయి. మెల్లిగా వెళ్ళి దాని తల నిమురుతూ "బాధపడుతున్నావా లక్ష్మణా" అన్నాడు వీరాస్వామి. తల ఆడించీ ఆడించనట్లుగా తల ఊపింది ఆ ఎద్దు. మనసు ద్రవించింది వీరాస్వామికి. ముప్పై సంవత్సరాల పాటు వీరాస్వామికి సహచరులుగా మెలిగారు రామన్న, లక్షన్నలు. ఇప్పుడు తనకు మిగిలిన ఒకే ఒక్క సహచరుడు లక్ష్మన్న. వీడిని కూడ తనకు తోడుగా లేకుండా చేస్తే ఆ ఒంటరితనాన్ని భరించడం కష్టం. లక్ష్మణ కళ్ళలోకి తదేకంగా చూశాడు. ఏదో కోల్పోబోతున్నాననే భావన దానిలో కొట్టొచ్చినట్లు కనిపించింది వీరాస్వామికి. అతనికి తెలుసు... లక్ష్మణకు మాటలు రాకున్నా ఏం జరగబోతున్నదో అంతా దానికి ఎరుకేనని. సంతకు దానిని రంగనాథం ఎందుకు తోలుకు వెళ్ళాడో దానికి ఈపాటికి అర్థమయే ఉంటుంది. అందుకే అలా దిగులుగా ఉన్నదని అనుకున్నాడు.

"లక్ష్మణా... రాముడు పోయిన దిగులు మనిద్దరినీ కుంగదీసింది. కానీ దిగమింగుకున్నామురా. బతుకుదారిలో ఇలాంటి కట్టాలు తప్పవని సర్దుకున్నాం. కానీ నిన్ను మా వాడు తోలుకెల్లి సంతలో అమ్మాలనుకున్నాడు. అప్పుడు ఏటి అనలేక పోయాను. నేను రెక్కలుడిగిన పచ్చినిరా. ఎదురు సెప్పలేక తలొంచుకుని నిలబడ్డాను. నిన్ను సూశాక అనిపిత్తున్నదిరా... తప్పుసేశానేమో అని! వద్దురా... మనం ఈడనే ఉంటే నా కొడుకు మనల్ని దూరం సేత్తాడు. మల్లా మనం ఒకటిగా ఉండడం కుదరదుగా. నువ్వు లేకుండ

నేను బతకడం శానా కట్టం అనిపిత్తోందిరా. అందుకే ఏదో ఒకటి సేయాలి. సేత్తానురా... ఏదో ఒకటి సేత్తాను" అంటూ దాని తల నిమిరి కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు వీరాస్వామి.

★★★

వారం రోజుల నుంచి పిచ్చెక్కినట్టు తిరుగుతున్నాడు రంగనాథం. చుట్టుపక్కల పల్లెలన్నీ గాలించాడు. కాని తన తండ్రి ఆచూకి గాని, లక్ష్మణ ఆచూకి గాని తెలియలేదు. తనకు తెలిసిన ప్రతి ఒక్కరికి ఫోనుచేసి అడిగాడు. కానీ ఎవరూ తండ్రి జాడ చెప్పలేక పోయారు. విసుగుచెంది వెళ్ళి పంచలో కూర్చున్నాడు. కూర్చున్నాడే గానీ మనసు మనసులో లేదు. కళ్ళముందు తండ్రి, లక్ష్మణ ఒకరి తరువాత ఒకరు నీడలా కదలాడుతూనే ఉన్నారు. తండ్రి మాటకాదని లక్ష్మణను అమ్మడానికి ప్రయత్నించి తప్పుచేశానేమో అని అనిపించసాగింది రంగనాథానికి. ఇంతలో ఫోను మ్రోగింది.



"హలో...రంగనాథం"

"ఎవరు... గోవిందు... ఏంటిరా ఫోను చేశావు?"

"ఒరేయ్... మీ నాన్న మొన్న విజయవాడలో కనిపించాడురా"

"అవునా... ఎక్కడరా? మాట్లాడినావా? ఎందుకెల్లినాడంటరా?"

## సహచరుడు

"ఒరేయ్... ముందు నువ్వు ప్రశ్నలు ఆపి నేను చెప్పేది విని, వెళ్ళి మీ నాన్నను కలువు" అని తను వీరాస్వామిని ఎక్కడ కలిసింది, ఆయన ఏం చెప్పింది పూస గుచ్చినట్టు చెప్పి ఫోను పెట్టేశాడు గోవిందు. ఇక ఆలస్యం చేసి లాభం లేదనుకుని విజయవాడకు బయలుదేరాడు రంగనాథం.

★★★

"ఏంటి నాన్నా ఇది. నేను ఏమన్నానని ఇలా ఈ ఎద్దును తీసుకుని చెప్పకుండా వచ్చావు. నీకోసం ఎతకలేక చచ్చా. గోవిందు గాడు ఫోను చేసి నీ జాడ చెప్పాడు. అయినా దీనికి ఈ గంగిరెద్దు ఏషం ఏమిటి. దాన్ని వెంటేసుకుని సన్నాయి ఊదుకుంటూ నువ్వు గుళ్ళ యెంట తిరగడమేంటి. చేసిన నిర్వాకం చాలు. పద ఇంటికి యెళదాం. నీ బాధ దీన్ని అమ్ముతాననేగా. అమ్మనులే... చచ్చిందాక దీని ముఖాన తిండి పడేస్తా" విసురు, ప్రేమ కలగలిసిన స్వరంతో అన్నాడు రంగనాథం.

"వద్దురా రంగా. ఎందుకొచ్చామో... ఒకపాలి బయటికి వచ్చేశాము. ఇక నీకాడికి రామురా! అమ్మ, అయ్య, పదిమంది బిడ్డల్నైనా ఇసుగులేకుండ సాకుతారు. కానీ ఆ బిడ్డలు ముసిలోళ్ళ కాడికి వచ్చేసరికి వంతులేసుకుంటారు. అది లోక సహజంరా. నేనే నీకు భారం. నాకు తోడు అదనంగా ఇదొకటి. ఒరే రంగా... ఈ ఎద్దులని నేను ఎద్దులుగా సాకలేదురా... నా తమ్ముళ్ళనుకుని బంధం పెంచుకున్నాను. రాముడు పోయినపుడు నా కుడి సేయి తెగిపోయినంత బాధయిందిరా. దీన్ని నువ్వు సంతకెల్లి అమ్ముతానన్నపుడు నేను సచ్చిపోయాననే అనుకున్నారా. ఆ దేముడు దయతలిచి, ఇది అమ్ముడుపోకుండా చేసిండు. అంటే దీనితో నాకు బంధం ఇంకా తెగిపోలేదురా. రంగా... నాకు నీ మీద కోపం లేదురా. మేము నీకు బరువు కాకూడదనే ఇలా వచ్చాను. ఇక్కడ నాకు శానా హాయిగా ఉందిరా. జనాల కాడ పైసలతో పాటు భక్తి కూడ పెరిగిందిరా. దీన్ని అలంకరించుకు గుడికాడికి తీసకపోతే, అందరూ దీని సుట్టూ తిరిగి దండం యెట్టి పైసలు కూడ ఇత్తున్నారు. ఇహ పండగలొత్తే సాలు... పొర్లు దండాలెట్టి కాసులు కుమ్మరిత్తున్నారు. ఆవులకు, ఎద్దులకు ఇప్పుడు మంచి గిరాకి అంటరా. ఇది సాచ్చాత్తు శివయ్య వాహనమంట. ఏదయితేనేంరా... ముసిలోళ్ళమై శాకిరి సెయ్యలేక మూలబడ్డ మాకు, మా బతుకుల మోయన మేము సంపాయించుకునే అవకాశమిచ్చిండు శివయ్య. నువ్వు మా గురించి ఆలోచించమాక. ఓపికున్ననాల్లు నాకు ఇది తోడు, దీనికి నేను తోడు. నే బతికినంత కాలం దీని బరువు మోత నాదేరా... నీది కాదు. ఇక మా గురించి ఆలోసించమాకు. నువ్వెల్లు!" అని మనసులో మాట చెప్పాడు వీరాస్వామి.

"అయ్యా... నాది తప్పేనని ఒప్పుకున్నాగదా. ఇక ఇంటికొచ్చేయండి. ఇట్టా నువ్వు ఊరంతా తిరిగి అడుక్కుంటుంటే, నలుగురు నా ముఖాన ఉమ్మేసి పోతారు. కలో, గంజో కలిసే తిందాం పదయ్యా" బలవంతం చేశాడు రంగనాథం.

"ఎవుర్రా నిన్ననేది. నగరాల్లో దర్జాగ బ్రతకతా, అమ్మను, అబ్బను ఆశ్రమాల పాల్జేసే సదువుకున్నోల్లు ఉన్న ఈ రోజుల్లో, కూటికి సాగని నువ్వు మమ్మల్ని వదిలేయడం తప్పు కాదురా. అయినా ఓపికున్నపుడే నీ మీద ఆధారపడ్డం తప్పనిపించిందిరా. యెవసాయం సేసే ఓపిక లేకున్నా, గుళ్ళెంబడి తిరిగే ఓపికుందిలేరా. ఇదయితే పున్యానికి పున్యం, సంపాదనకి సంపాదన. ఇహ నాన్చకుండా ఎల్లరా" అని తన నిర్ణయాన్ని నిర్మొహమాటంగా చెప్పాడు వీరాస్వామి.

చేసేదిలేక కంట నీరు పెట్టుకుని ఇంటికి తిరుగుముఖం పట్టాడు రంగనాథం.

'రంగా... నేను లక్ష్మణుడి బాధ్యతను నిను మోయమని సెప్పలేను. అలాగని వాడ్ని వదిలి ఉండలేను. అందుకే నీ మనసు కష్టపెట్టాల్సి వచ్చింది. నన్ను సెమించరా' వీరాస్వామి కళ్ళు చెమరుస్తున్నాయి. పశువును కూడ మనిషితో సమానంగా ప్రేమించగలిగిన వీరాస్వామి గొప్పతనానికి లక్ష్మణుడి మనసు చలించింది. 'సహచరుడంటే నీలా ఉండాలి అన్నా' అని అనుకుందేమో, వచ్చి వీరాస్వామి పాదాల వద్ద కూర్చుని తన తలను అతని పాదాలకు ఆనించింది.

# మాగంటి అమ్మిరాజు గారి కవతం

పెనుమాక రత్నాకర్

9063854331

**రామినీడు పాలేరుతో ధాన్యం తప్పించమని సలహా చెప్పిచ్చారు. తాళాలు దొరికినా బీరువాలో ఒక్క రూపాయి పోలేదు. ధాన్యం కొలిపించటానికి అమ్మిరాజుగారు రాపోయినా ఒక్క గింజ కూడా దొంగతనం జరగలేదు. దీనికి కారణం మా తాత నిజాయితి గాదు, అమ్మిరాజు గారు, రాజకుమారి గార్ల మంచితనం. ఆళ్ళు తాతని సొంత మనిషి అనుకున్నప్పుడు ఆళ్ళది ఈయనిది కాదా? మనది మనం దొంగతనం చేత్తామా?**

ఏసవి సెలవలిచ్చారు. నేను మా చిన్నమ్మమ్మ, తాతయ్యోళ్ళ ఊరు పరిగెట్టాను. ఆళ్ళది అనాతవరంకి పల్లంకుర్రుకి మజ్జిలో ఉండీ దొంతికుర్రు. మానాన్న లూనా ఎక్కిచ్చుకుని మావూరు కడియం పక్కన వీరవరం నించి తీసుకొచ్చి దించాడు.

మా చింతాత కొడమంచిలి లచ్చన్న సందాల చేలోకి తీస్కెళ్ళి, తాడిచెట్టెక్కి ముంజుకాయిలు కొట్టిచ్చాడు. అయ్యి తిన్నాక బంగినపిల్లి మావిడికాయలు కోసిత్తే నేను, మా బాప్పకొడుకు సత్తిబాబుగాడు లొట్టలేసుకుంటా తిన్నాం. మా తాత కవతం చేసే అమ్మిరాజుగారి చేలో మోటరేసుకుని తనివితీరా తానం చేసాం.

సెలవలకి మాగంటి అమ్మిరాజుగారి మనవలు కూడా హైద్రాబాద్ నించి, విజయవాడ నించి వొచ్చారంట. ఆళ్ళు మా తాతని చేలోకి తీసుకెళ్ళమని అడగటానికి రాజులందరూ ఉండీ అల్లూరోరిపేట  నించి మా గవళ్ళపేట కొచ్చారు. మా తాత ఆళ్ళకి బాగా చేరిక. అవును మరి సుబ్బరాజు గారింట్లో  ఐదుగురు  పనోళ్ళున్నా, ఆళ్ళెవరూ స్థిరం కాదు. ఏడాదికో రొండేళ్ళకో మారిపోతా వుంటారు. కాని మా తాత నేను పుట్టనప్పుణ్ణించీ ఈయన దగ్గిరే పని చేత్తన్నాడు. అమ్మిరాజుగారి అందరి పిల్లలు తాత చేతుల మీదే పెరిగారు. తాతకి కూడా ఆళ్ళంటే మా అంతిష్టం. మా తాత మీసాలు మొలవనప్పుడు ఈ కవతంలో చేరాడంట. సుమారు ముప్పై ఏళ్ళనించి చేత్తన్నాడు. ఏడాదికి ఇరవై కాటాల ధాన్యం, రొండుజెతల బట్టలు ఎడతారు. చేను కోతలయ్యాక ఆ యాభై ఎకరాల ఏకచెక్కలో పరగ ఏరుకుంటేనే కాటా ఒడ్లు వొత్తాయి, అయ్యి ఇంకోలు ఏరుకోకూడదు. మా తాతకే అది హక్కు. పరగ ఏరుకోటానికి ఎవరూ దిగరాచేలోకి.

చీకటితోటే ఎళ్ళి గేదిలకాడ పేడకళ్ళు తీసి శుభ్రం చేసి, దాణా కలిపి పాలు తీత్తాడు.  ఆ తర్వాత గేదిల్ని గౌతమి కాలవకి తీసుకెళ్ళి తానం చేయించి ఇంటికి తీసుకొచ్చి ఆళ్ళమ్మగారు రాత్రి మిగిలిన అన్నంలో గెంజి, కాతంత ఆవకాయ బద్ద ఇత్తే, నంజుకుని తినేసి చేలోకెళ్ళిపోతాడు. మజ్జానం దాకా చేలో పన్జేసి ఇంటికొచ్చి అన్నం తిని చెయ్యారకండానే పరిగెడతాడు అమ్మిరాజు గారింటికి! ఆయన ఏదైనా పనిచెప్తే ఎక్కడికైనా నడిచే ఎళ్తాడు. పనైపోతే ఎక్కడా గడిసేపు ఆగడు. పని పూర్తి చేసి ఆయినగారి ముందు ఆలిపోతాడు.

మిగతా పాలేర్లు ఏదైనా పని చెప్తే అది గంటలో అయ్యే పనైనా తాయితీగా చేసి పూట గడిపేత్తారు. మా తాత అలాగాదు అంత నిజాయితీగా ఉంటాడు కాబట్టే అమ్మిరాజు గారికి మా తాతంటే బోల్డంత నమ్మకం.

ఆయిన గారి పిల్లలు, మనవలు మాతాత చేతులమీదే పెరిగారు. ఆళ్ళకీ తాతంటే సొంత మనిషిలెక్క. తాతకీ ఆళ్ళంటే లెక్కలేనంత ప్రేమ.



తాతకి నలుగురు కూతుర్లు. ఒక కొడుకు. కొడుక్కోసం చూసి నలుగురు కూతుళ్ళని కన్నాడు. అమ్మ అందరి కంటే పెద్దది. అప్పో సొప్పో చేసి ముగ్గురు కూతుళ్ళుకి పెళ్ళిళ్ళు చేసేసాడు. పోయినేడే ఆఖరి చిన్నమ్మ జానకమ్మకి పెళ్ళి చేయటానికి  చేలా అప్పులు

చేసాడు. పెళ్ళికొడుకు చెల్లూరు చెక్కెర ఫ్యాక్టరీలో పర్మినెంట్ ఉజ్జోగం. అందుకని ఆళ్ళు తాత ఇచ్చుకోలేనంత అడిగితే కుర్రోడు బాగున్నాడని, పర్మినెంట్ ఉజ్జోగమని, పిల్ల సుఖపడతాదంటా దొరికినకాడికి అప్పులుచేసి పోయినేడు ఎండల్లో పెళ్ళిచేసాడు. అప్పుడు అమ్మిరాజుగారు తాత అడక్కండానే చిన్నమ్మకి పట్టుచీర, తాళిబొట్టు ఎట్టారు. ఇయ్యి కాకండా తాత అప్పుగా అడిగితే యాభై ఏలు ఇచ్చారు. మొన్న ఆదివారం రెడ్డిగారు తాతని అప్పు కట్టలేదని కొట్టబోతే అమ్మిరాజుగారికి తెలిసి రెడ్డిగార్ని పిలిచి అప్పు మొత్తం ముప్పై ఏలుంటే వొడ్డీతో సహా కట్టీసారు.

ఇన్ని అప్పుల మజ్జ మా చిన్నమ్మ నెల తప్పింది. ఉప్పుడు ఐదో నెల మిఠాయట్టుకెళ్ళి, చిన్నమ్మని తీసుకురావాలంట. మొన్న డాట్టరమ్మ దగ్గిరికి చీబించుకోడానికెళ్తే, పురుడయ్యోదాకా ఇక్కడ గిన్ని తీసి అక్కడెట్టకూడదని పూర్తిగా ఇశ్రాంతి తీసుకోవాలని చెప్పారంట. అందుకే ఉప్పుడే తీసుకు రావాలనుకుంటన్నారు తాతయ్యోళ్ళు! చేతిలో చూత్తే చిల్లిగవ్వలేదు. ఎలాగో తెలట్లేదు తాతోళ్ళకి.

సంగతి తెల్సిన అమ్మిరాజుగారు, ఆళ్ళావిడి రాజకుమారిగారు రొండు చేతుల్లో పట్టీ అంత లడ్డూలు ఇంట్లోనే చేసి, చీర కొనిచ్చారు. అడక్కండానే ఆవిడ చేసిన సాయానికి తాత కళ్ళల్లో గంగమ్మ ఉరకలేసింది. ఆ కారిక్రమం అలా గట్టెక్కింది. మా ఇంట్లో ఏ అవసరమొచ్చినా తాత ఆళ్ళమ్మ గారికి చెప్పాపోయినా ఆవిడే తెలుసుకుని అన్నీ చేత్తన్నారు. ఉప్పుడు చిన్నమ్మకి తొమ్మిదో నెల కొన్ని రోజుల్లో పురుడైపోవచ్చు. మొన్న డాట్టరమ్మ దగ్గిరికి తీసుకెళ్తే, ఆపరేషన్ అడద్దని చెప్పారు. మామూలుగా పురుడు రాదంట, ఆపరేషన్ అంటే ఎంతలేదన్నా ఓ ముప్పైయేలు కావాలి. తాత చేతిలో చూత్తే చిల్లిగవ్వలేదు. అప్పు పుట్టీ దారీ లేదు. ఊళ్ళో రైతులందర్ని, అప్పులిచ్చీ రెడ్లందర్నీ అడిగి చూసాడు, పనవ్వలేదు. సిరికి రామినీడుగారి పాలేరు కొండేటి మాచర్రావుని కూడా అడిగాడు. అతను ఏ సాయం చెయ్యలేదు. అమ్మిరాజు గారు మనవరాలు పెళ్ళి హడావిడిలో ఉన్నారు. ఆయన ఖాళీగా ఉన్నా ఆయిన్ని గానీ, అమ్మగార్ని కానీ నోరిడిచి అడిగే పరిస్థితి లేదు. ఎందుకంటే అప్పుడికే ఆళ్ళు అడక్కంగానే బోల్డు చేసారు. అప్పుగా తీసుకున్న డబ్బుకి తిఖానా లేదు. అందుకే అడగటానికి మొఖం చెల్లట్లేదు తాతకి.

★★★

పెళ్ళి అనాతవరం క్షత్రియ పరిషత్లో! ఒకేసారి రొండేలమంది పట్టీ అంత పెద్ద కళ్యాణ మండపం అది. అందులో పెళ్ళి. అందరూ పెళ్ళికెళ్ళీ సందడిలో బీరువాకి తాళాలేసి, ఎప్పుడూ తగిలించీ గోడకి తగిలించి ఎళ్ళిపోయారు. అందరూ ఎళ్ళిపోయారు. తాత మాత్రం గేదిలికి పాలు తీయాలని ఆగిపోయాడు. అదే టైంలో రామినీడుగారి పాలేరు మాచర్రావు అలాగెళ్తా తాతని చూసి “ఒరే లచ్చన్నా డబ్బులు దొరికాయా” అనడిగాడు. “లేదురా” అంటే “డబ్బులొచ్చీ దారి చెప్తాను ఇంటానంటే! కానీ ఎవరికీ చెప్పకూడదు” అన్నాడు. సరే చెప్పమంటే ఈ రొండు మూడు రోజుల్లో ధాన్యం కొలుత్తారు అప్పుడు దాకా కుప్పల దగ్గిర నువ్వే కాపలా ఉంటావు గందా! అందులోంచి ఓ పది బత్తాల ఒడ్లు తప్పించేసి పరగ ఏరుకున్న ధాన్నుంలో కలిపేసి అమ్మేసుకో! ఎంతోకొంత కలిసొత్తాది. పతిఏడు నేనిలాగే చేత్తన్నాను. మా రైతులకి ఉప్పుడికీ అనుమానం రాలేదు!” అని చెప్తుంటే తాత ఆలోచనలో పడ్డాడు.

పనులు పూర్తి చేసుకుని ఇంట్లోకెళ్ళి పాలు వొంటగదిలో పెట్టి వత్తంటే చూసాడు.. బీరువా తాళాలు గోడకున్న మేకుకి ఏళాడతా!

★★★

పెళ్ళి ఏ లోటు లేకండా బాగా జరిగింది. అమ్మిరాజు ఇంటినిండా చుట్టాలు తాతకి చేతినిండా పని. అమ్మిరాజుగారికి చేలోకొచ్చి ధాన్నుం, షావుకారు పెద్దింటి అన్నవరానికి కొలిపించి ఇచ్చీ అంత ఖాళీ లేదు. తాతకి ఆ పని అప్పగించి ఆయిన చుట్టాల్ని చక్కదిద్దీ పనిలో ఉన్నారు. ధాన్నుం ఈ ఏడు పతిఏడు కంటె అయిదు కాటాలు ఎక్కువ పండింది. ధాన్నుం కొలిచీసాక, చిన్న పద్దు పుస్తకంలో ఆ లెక్కలన్నీ రాసి అమ్మిరాజు గారికి ఇంటికొచ్చి అప్పగించాడు ధాన్నుం షావుకారు.

★★★

అమ్మిరాజుగారికి మా తాత మీద వొల్లమాలిన నమ్మకం. అది చూసి పక్క పొలం రైతు సిరికి రామినీడు ఓ రోజు "అమ్మిరాజు మీ పాలేర్ని ఇంట్లో మనిషిలాగ చూత్తన్నావు, అన్నీ అప్పచెప్పేత్తన్నావు. ఏదో రోజు నిన్ను ముంచేత్తాడు" అన్నాడు.

దానికాయన "ఒరే రాముడు మావోడు అలాంటోడు కాదు, ఆడిది నాది ముప్పై ఏళ్ళ సంబంధం. చిన్నప్పుణ్ణించి ఆణ్ణి చూత్తన్నాను. ఆడలాంటోడు కాదు" అంటే...

"ఎంత మంచోడైనా పరిస్థితిని బట్టి మారతాడు. ఓసారి గమనించు కావాలంటే పరీక్షించి చూడు" అంటే "సరే" అని బీరువాలో లక్ష రూపాయలు ఎట్టి తాళాలు వొదిలీసారు. రామినీడు పాలేరుతో ధాన్నుం తప్పించమని సలహా చెప్పిచ్చారు. తాళాలు దొరికినా బీరువాలో ఒక్క రూపాయి పోలేదు. ధాన్నుం కొలిపించటానికి అమ్మిరాజుగారు రాపోయినా ఒక్క గింజ కూడా దొంగతనం జరగలేదు. దీనికి కారణం మా తాత నిజాయితీ గాదు, అమ్మిరాజు గారు, రాజకుమారి గార్ల మంచితనం. ఆళ్ళు తాతని సొంత మనిషి అనుకున్నప్పుడు ఆళ్ళది ఈయనిది కాదా? మనది మనం దొంగతనం చేత్తామా?

★★★

చిన్నమ్మకి ఆపరేషన్నని మొన్నే అమ్మిరాజుగారు, డాట్టరమ్మకి డబ్బు కట్టీసారంట. ఒక్క రూపాయి కూడా తీసుకోకండా పురుడు పోసి, అయిదు రోజులుంచుకుని అంపీసారు ఆసుపత్రోళ్ళు. చందమామలాంటి ఆడపిల్ల పుట్టింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఆ పిల్లకి మా చిన్నమ్మ రాజకుమారి అని పేరెట్టింది. ఆ పేరు చెవిలో చెబితే ఆ పిల్ల నవ్వింది స్వచ్ఛంగా! కల్మషం లేని ఆ నవ్వు మా తాత నవ్వులా వుంది.

# ఎవరు అనాథలు?

## నిష్ఠల సుబ్రహ్మణ్యం

9885620065

**అనాథ శరణాలయాలు ఉండవలసిన ఖర్మ ఎందుకు వచ్చింది.వీటి అవసరం ఎందుకు కలిగింది? అని ఎవ్వరైనాఅలోచించారా? తల్లి,తండ్రులు చనిపోతే, చూసేవారు లేకపోతే, రోడ్డున పడిన వాళ్ళను చేరదీసే క్రమంలో ఈ శరణాలయాలు వెలిసాయి. మీరు శరణాలయాలలో ఉన్న అనాథలను చూసారు కానీ, మన కుటుంబాలలో ఉన్న అనాథలు ఉన్నారో, లేదో చూసారా?**

"కమలా!" అంటూ పిలిచిన అత్తగారి స్వరం విని,"ఏమిటీ చెప్పండి!" అంది,చిరాకుగా కమల.

తను అలా చిరాకు పడటానికి కారణం లేకపోలేదు.ఆరోజు జాగృతి అనాథ శరణాలయంలో అనాథలకు అన్నదాన కార్యక్రమం ఉంది. దానికోసం అతి కష్టం మీద పదివేల రూపాయలు సంపాదించి ఉంచింది. ఆ ఊరి కలక్టర్ గారి భార్య ఇంద్రాణీగారి సమక్షంలో అన్నదానానికి ఆ పదివేలూ ఖర్చుపెట్టి, ఆవిడగారిమెప్పు పొందాలి. ఆ ప్రోగ్రాంకి ఆలస్యం అయిపోతోంది. ఇప్పుడు అత్తగారి పిలుపు. మరి చిరాకుగాఉండదా? చిటపటలాడుతూ అత్తగారి గదిలోకి వచ్చిందికమల.

ఆమెను చూస్తూనే, "అది కాదు కమలా! మీ మామయ్య గారికి రాత్రి నుంచీ జ్వరంగా ఉంది.నువ్వు ఇచ్చిన మాత్ర వేసాను కానీ, జ్వరం ఇంకా తగ్గలేదు." అంది బెరుకుగా కమల అత్తగారు.

"అయితే ఏం చెయ్యమంటారు? అవతల మీటింగుకి ఆలస్యం అయిపోతోంది." అంది కమల కోపంతో.

"అది కాదు కమలా! మామయ్యగారిని ఒకసారి డాక్టర్ గారి దగ్గరకు తీసుకు వెళ్తావేమోనని...." నసిగింది.

"చెబుతున్నాను కదా! అవతల ఇంద్రాణీ గారి మీటింగుకి ఆలస్యంఅయిపోతోందనీ. మీదగ్గర ఇంకో మాత్ర ఉందిగా, అది వెయ్యండి మరేం పరవాలేదు. తగ్గకపోతే అప్పుడు చూడవచ్చు." అని, కాస్సేపాగి "ఆయన పోయిన దగ్గరనుంచీ,మీభారం నా నెత్తిన పడింది. అవతల ఇద్దరు పిల్లలు ఉన్నారు వాళ్ళనే చూసుకోవాలా,

మిమ్మల్నే చూసుకోవాలా? మరింకేమీ మాట్లాడకండి. అన్నం వండి ఉంచాను. తినండి. ఏది తప్పినా అది తప్పదుగా?" అని గబగబా హేండ్ బేగ్ సర్దుకుని బయటకు వెళ్ళిపోయిందికమల.

కమలకి ముందునుంచీ భేషజం ఎక్కువ. అందరిలోనూపేరు పొందాలి అని తాపత్రయం. భర్త ప్రైవేట్ కంపెనీలోఉద్యోగం చేసేవాడు. అకస్మాత్తుగా ఏదో జబ్బుచేసి చనిపోయాడు. భర్త చేసే కంపెనీలోనే ఏదో చిన్న ఉద్యోగం ఇచ్చారు. ఇద్దరు కూతుళ్ళు. పది, పన్నెండు

ఏళ్ళ వాళ్ళు. అంతేకాదు అత్త, మావగారి బాధ్యత తన నెత్తిన పడింది. చాలీచాలని జీతం. ఆడంబరాలు తగ్గించుకోలేక పోతోంది. ఇంట్లో పరిస్థితిఎలా ఉన్నా, శరణాలయంలో కార్యక్రమాల విషయంలో మాత్రం, నలుగురిలోనూ పేరుసంపాదించాలని తాపత్రయం. ఇంట్లో ఎవరు ఎలాఉన్నా పట్టించుకోదు. ఎలాగూవచ్చే జీతం చాలదు. ఇలాంటి పనులు చేసి, నలుగురిదృష్టిలో

పడితే, ఏదోలాగా డబ్బు సంపాదించవచ్చు అని కమల అలోచన. అక్కడికీ తన బాల్యస్నేహితురాలు వాణీ అంటూనే ఉంటుంది. “ముందు ఇంట్లో వ్యవహారాలు చూసుకో. రేపు పిల్లలు ఎదిగాకా, వాళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యాలి, అత్తగారూ మావగారూముసలాళ్ళు అయిపోయారు, వాళ్ళకి ఏకష్టం లేకుండా చూసుకుంటే, ఆ భగవంతుడే ఏదో దారి చూపిస్తాడు. పరుగెత్తి పాలుత్రాగనక్కర లేదు” అని.

కానీ ఇవేమీ కమల బుర్రకి ఎక్కలేదు. ఎక్కవు కూడానూ. కమల ఆలోచిస్తూ నడుస్తోంది. ఎలాగైనా, ఇంద్రాణీ గారి దృష్టిలో పడాలి. ఆవిడతో ఫొటో తీసుకోవాలి, అందరికీ చూపించాలి. కమల వెళ్తూ, ముందుగానే అనుకున్న ప్రోగ్రాం ప్రకారం, ఆదారిలోనే ఉన్న వాణీ ఇంటికి వెళ్ళి, తనని కూడా శరణాలయానికి తీసుకు వెళ్ళింది. దారిలో పూలదుకాణం దగ్గర ఆగి, పూల దండలు, పూలబొకే, తీసుకుంది. వాణికి ఇవేమీ నచ్చడంలేదు. గొప్పకోసం, అప్పుచేసి మరీ ఇలా పూల దండలూ, సన్మానాలూ, అన్నదానాలు అవసరమా?' కమల ఇవేమీ వినే పరిస్థితిలో లేదని తెలుసు. అందుకే నోరు మూసుకుని కమల వెనుక నడుస్తోంది.




సరిగ్గా అప్పుడే అక్కడెక్కడో, ఏక్సిడెంట్ జరిగిందిట, అందువలన ఆ పూలదుకాణం దగ్గర ట్రాఫిక్ జామ్ అయి రోడ్డుమీద వాహనాలు ఆగిపోయాయి. అసలే ఆలస్యం అయిపోతోందని కమల కంగారు పడుతోంది, దానికి తోడు ఈ ట్రాఫిక్ జాము ఒకటి. కమల, వాణి

అక్కడే నిల్చుని, మాట్లాడుకుంటున్నారు. వాణీ ఉండబట్టలేక, మళ్ళీ మొదలుపెట్టింది. "ఇంట్లో అత్త, మావగారిని చూసుకోకుండా, ఈ శరణాలయాలు, అన్నదానాలు అవసరమా?" అని అడిగింది.

అసలే చికాకుగా ఉన్న కమలకి వాణీ నీతి వాక్యాలు మరింత కోపం తెప్పించాయి. కొంచెం కఠినంగానే వాణీ మాటలను ఖండించింది కమల. "ఇంట్లో ఉండే ఈ భాగోతం మామూలే, ఎప్పటికైనా పదిమంది దృష్టిలో పడటమే నా కోరిక!" అని తెగేసి చెప్పింది.

ఆ ట్రాఫిక్ జాములో ఒక కారు ఆగిపోయి ఉంది. అందులో ఉన్న వాళ్ళు ఈ సంభాషణ అంతా విని నవ్వుకున్నారు. అది గమనించి, వాణీ ఇంక మాట్లాడటం బాగుండదని ఊరుకుంది. కమల, వాణీ శరణాలయం దగ్గరకు వెళ్ళేసరికి, శరణాలయం అంతా రంగు కాగితాలతో బాగా ముస్తాబు చేసారు. శరణాలయం ముందు షామియానా వేసారు. పెద్ద స్టేజి ఏర్పాటు చేసి, అక్కడ ముఖ్య అతిథిగారు, వారితో బాటు వచ్చే కొంతమంది పెద్దలు కోసం కొన్నికుర్చీలు వేసారు. శరణాలయంలో ఒక ప్రక్కన అనాథలకు భోజనానికి వీలుగా బల్లలు, కుర్చీలు వేసారు. అక్కడ కమల నానా హడావిడీ చెయ్యడం మొదలుపెట్టింది. వాణీకి ఇవేమీ ఇష్టం లేదు. ఎవ్వరితోనూ మాట్లాడకుండా అక్కడ ఉన్న కుర్చీలో కూర్చుని, కమలని గమనిస్తోంది. షామియానా క్రింద ఉన్న కుర్చీలలో మీటింగ్ కి వచ్చిన సభికులు కొంతమంది కూర్చున్నారు.

ఇంతలో ఇంద్రాణి వారి సహచరులతో రానే వచ్చారు. వారితోబాటుగా, ఒక వృద్ధదంపతులు కూడ స్టేజి మీదకు వచ్చారు. ఇంద్రాణీగారు ఆ ముసలిదంపతులను, చెయ్యి పట్టుకుని జాగ్రత్తగా కుర్చీలలో కూర్చోబెట్టారు. అందరూ వారికేసి ఆతృతగా చూస్తున్నారు. కమల స్టేజి మీదకు వెళ్ళి, ఇంద్రాణీగారి మెడలో పూలహారం వేసి, బొకే చేతికి ఇచ్చింది. తరువాత, ఇంద్రాణీగారు, లేచి నిలబడిసభని ఉద్దేశించి, అమె ప్రక్కన ఉన్న వృద్ధదంపతులను చూపిస్తూ,"వీరు నా అత్తగారూ, మావగారూ. శరణాలయంవారు ఒక మంచి పని చేస్తున్నాము రండి' అని పిలిచారు. కాదనలేను. అయితే, ప్రస్తుతం మాఇంట్లో ఎవరూ లేరు.అందరూ కేంపుల్లో ఉన్నారు. వీరిని ఇంట్లో ఒంటరిగా వదిలి రాలేక నాతోబాటు తీసుకువచ్చాను. మీ అనుమానం నాకు తెలుసు. ఇంట్లోఎంతోమంది పరిచారకులు ఉంటారు, వాళ్ళు చూసుకుంటారు కదా, ఇక్కడకు తీసుకురావడం ఎందుకని? నిజమే, కానీ ఈ వయసులో వీరిని అనాథలనుచేసి, పనివాళ్ళకు అప్పగించి, నేను ఈ అనాథ శరణాలయానికి ఈ కార్యక్రమానికి రావడం నాకు ఇష్టంలేదు." అని కూర్చున్నారు ఆవిడ.

తర్వాత సభ నిర్వాహకులు ఆ రోజు నిర్వహిస్తున్న అన్నదానం గురించి వివరించి, ఆ రోజు కార్యక్రమానికి ధనసహాయం చేసిన కమలని వేదిక మీదకు ఆహ్వానించారు. కమల ఉబ్బితబ్బిబ్బై పోయింది. వెంటనే స్టేజి మీదకు వెళ్ళి ఇంద్రాణీ గారికి, సభికులకు అభివాదం చేసి నిల్చుంది. ఆశించినట్లుగానే, అక్కడే ఉన్న ఫొటోగ్రాఫర్... ఇంద్రాణీ, కమల కలిపి ఫొటో తీసారు.

మరోసారి ఇంద్రాణి మైకు ముందుకు వచ్చి మాట్లాడడం ప్రారంభించింది. "మనదేశం అనురాగం ఆప్యాయతలకు పెద్ద పీట వేసింది. ఎంతో నాగరికత కలిగిన దేశం మనది. ఎన్నో దేశాలు మన సంస్కృతినిచూసి, నేర్చుకుంటున్నాయి. విదేశాలలో మన పురాణాల గురించి చెప్పుకుంటున్నారు. కానీ మనవాళ్ళు మాత్రం పొరుగింటి పుల్లకూర రుచి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. విదేశీ సంస్కృతిని అనుకరిస్తున్నారు. మనకు తల్లిదండ్రులు, అత్తమావలు బరువైపోతున్నారు. మనం ఎక్కడ నుంచి వచ్చాము? మనకు తల్లిదండ్రులు జన్మ ఇచ్చి ఉండకపోతే మన ఉనికి ఎక్కడ ఉండేది? భార్య, భర్త, పిల్లలు మాత్రమే కాదుకుటుంబం అంటే... తల్లీతండ్రీ, తోడబుట్టినవారు కూడ కుటుంబం సభ్యులే. పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అభిమానం, ఆప్యాయతలు మెండుగా ఉండేవి. ఎంతో సంతోషంగా ఉండేవాళ్ళు. రాను రానూ, పెద్ద చదువులకోసం, ఉద్యోగాల కోసం, వలసవెళ్ళి పోతున్నారు. మన కుటుంబ వ్యవస్థ దెబ్బతింటోంది.

ఇప్పుడు ఈ అనాథ శరణాలయాలు సంగతే చూడండి. 'ఏదో ఇక్కడ అనాథలు ఉన్నారు, వాళ్ళకు అన్నదానం లాంటివి చేస్తే ఎంతో గొప్ప' అనే భావం చాలా మందిలో ఉంది. అనాథలను ఆదుకోవడం మంచిదే, కాదనను. కానీ అనాథ శరణాలయాలు ఉండవలసిన ఖర్మ ఎందుకు వచ్చింది. వీటి అవసరం ఎందుకు కలిగింది? అని ఎవ్వరైనా ఆలోచించారా? తల్లీ, తండ్రులు చనిపోతే, చూసేవారు లేకపోతే, రోడ్డున పడిన వాళ్ళను చేరదీసే క్రమంలో ఈ శరణాలయాలు వెలిసాయి. మీరు శరణాలయాలలో ఉన్న అనాథలను చూసారు కానీ, మన కుటుంబాలలో ఉన్న అనాథలు ఉన్నారో, లేదో చూసారా? కుటుంబాలలో అనాథలు ఏమిటీ

అని అనుకుంటున్నారా?” ఎంతో ఉద్వేగంగా మాట్లాడి, ఒక్కసారిగా తన ప్రసంగాన్ని ఆపి, ఎదురుగా ఉన్న టేబుల్ మీదఉన్న మంచినీళ్ళు త్రాగి కుర్చీలో కూర్చుండిపోయారు ఇంద్రాణీ. చేతిలో ఉన్న రుమాలుతో మొహం తుడుచుకుని, మరింక మాట్లాడలేక కుర్చీలో జార్లబడిపోయారు. అందరూ ఆవిడ ప్రసంగాన్ని ఎంతో ఉద్వేగంతో వింటున్నారు. కొంచెంసేపు ఆగి మళ్ళీ లేచి నిలబడి తన ప్రసంగాన్ని కొనసాగించారు. “మన తల్లిదండ్రులనూ, అత్తమావలను పట్టించుకోని వాళ్ళను, ఏమని పిలవాలి? అలా ఆదరణకు నోచుకోలేని వాళ్ళే, నిజమైన అనాథలు. అందరూ ఉన్న అనాథలు! ఇందాకా నేను కారులో వస్తున్నప్పుడు ఒక స్త్రీని చూసాను. ఆవిడ తన ఇంట్లో ఉన్న పెద్దవారిని పట్టించుకోకుండా బయటి భేషజాలకు పోయి సమాజసేవ చేస్తోంది. ఇది ఎంతవరకు సమంజసం? మీరే ఆలోచించండి. ఆ స్త్రీ ప్రస్తుతం, ఇక్కడే ఉన్నారు. ఆవిడ పేరు చెప్పడం మంచిది కాదు. నేను చెప్పింది ఆవిడ అర్థంచేసుకుంటే చాలు. నేను చెప్పింది విని ఒక్క వ్యక్తిలో మార్పు వచ్చినా నేను సంతోషిస్తాను.” అని, ముగించింది.

ఆ ప్రసంగం వింటూనే, కమల గబగబా వేదిక దిగి, వాణి చేయి పట్టుకుని వడివడిగా అడుగులు వేసుకుంటూ, ఇంటి దారి పట్టింది. పశ్చాత్తాపంతో తల దించుకుని, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటున్న కమల వెంట వాణి దారి తీసింది.

# కథామంజరి
## బాలకథ

# అమ్మ మాట వినాలి

కొత్తపల్లి రవికుమార్

9491804844

**వేటగాడు వచ్చి ఈ రోజు తన పంట పండిందనుకుని మిత్రవింద, అరవింద లను పైకి తీసాడు. ఒక్కసారిగా పక్షులన్నీ వేటగాడి మీద దాడి చేసాయి. తమ ముక్కులతో పొడిచాయి. అన్ని పక్షులు ఒకేసారి మీద పడడం చూసి, భయపడి, మిత్రవింద, అరవింద లను అక్కడ వదిలేసి పారిపోయాడు వేటగాడు.**

అది ఒక దట్టమైన అడవి. ఆ అడవిలో చిన్నా, పెద్దా జంతువులన్నీ నివసించేవి. క్రూరజంతువులు సాధుజంతువులను చంపి తమ ఆకలిని తీర్చుకునేవి. సాధుజంతువులు ఆ అడవిలో దొరికే కాయలు, పళ్ళు, దుంపలు తింటూ క్రూరజంతువులకు దొరకకుండా జీవనాన్ని సాగించేవి. ఆ క్రూరజంతువులకు తోడు, వేటగాళ్ళ రూపంలో మరొక ఆపద కూడా పొంచి ఉండేది, ఆ సాధు జంతువులకు. అందుకే ఆ సాధు జంతువులలో పెద్ద జంతువులు తమ సంతతికి చెందిన వారికి ఎవరికంటా పడకుండా చాలా జాగ్రత్తలు చెప్పేవి. కొన్ని జంతువులు వినేవి, కొన్ని వినేవి కాదు. అలా పెద్దవాళ్ల మాటలను పెడచెవిన పెట్టిన జంతువులు ఆ వేటగాళ్ళకో, క్రూరజంతువులకో ఆకలి తీర్చే ఆహారంలా మారిపోయేవి.

ఆ అరణ్యం ఒక మూలన ఒక సరస్సు ఉండేది. ఆ సరస్సుని ఆనుకుని ఉన్న పచ్చిక మైదానాన్ని తమ ఆవాసంగా చేసుకుని ఒక కుందేళ్ల గుంపు నివసించేది. అవి అక్కడ దొరికే ఆకులు, కంద మూలాలను తింటూ, ఆ సరస్సులో నీళ్ళు తాగుతూ హాయిగా జీవించేవి. అవి ఉండే ప్రదేశం ఆ అడవికి ఒక మూలన ఉండేది కాబట్టి, ఎక్కువగా క్రూర జంతువులు గానీ, వేటగాళ్ళు గానీ వచ్చేవారు కాదు. అందుకే ఆ కుందేళ్లు స్వేచ్ఛగా తిరుగుతూ ఆడుకునేవి.

ఆ కుందేళ్ల గుంపులో కౌముది అనే కుందేలు ఉండేది. ఆ కౌముదికి మిత్రవింద, అరవింద, చారువింద అనే ముగ్గురు సంతానం. ఆ ముగ్గురికీఎప్పటికప్పుడు జాగ్రత్తలు చెప్పుకుంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తోంది కౌముది.

ఒకరోజు ఇవన్నీ ఆనందంగా ఆడుకుంటుండగా అరవింద, చారువింద అడవిలోకి పరుగులు తీసాయి. ఇది దూరం నుండి గమనించిన కౌముది వారిని గట్టిగా పిలిచి వెనక్కి రప్పించింది.

“మీకు ఎన్నిసార్లు చెప్పాలి, అడవి లోపలికి వెళ్ళొద్దని? అక్కడ క్రూరజంతువులు, వేటగాళ్ళు ఉంటారని చెప్పానా? ఒక్కసారి వాళ్ల కంటపడ్డామా, ఇక మన జీవితం అక్కడితో సమాప్తం. నా మాట విని ఇంకెప్పుడూ అక్కడికి వెళ్ళకండి” అని గట్టిగా చెప్పింది, కౌముది. ఇక అప్పటి నుండీ అవి అడవిలోకి వెళ్ళే సాహసం చేయలేదు.



ఆ కుందేళ్లు నివసించే చోటు ప్రక్కనే ఒక పెద్ద చెట్టు ఉంది. ఆ చెట్టు మీద చాలా పక్షులు నివాసం ఉండేవి. అందులో చాందిని అనే రామచిలుకకు ఈ కుందేళ్ల పిల్లలకు స్నేహం బాగా కుదిరింది. చాందిని, ఈ కుందేళ్ల పిల్లలు కలిసి ఆడుకునేవి. చాందిని ఎగిరి అడవంతా తిరిగి రకరకాల పళ్ళు తెచ్చి ఈ కుందేళ్ల పిల్లలకు పంచేది. కుందేళ్లు సేకరించిన దుంపలు చాందినీకి ఇచ్చేవి. ఇలా ఇవన్నీ చాలా అన్యోన్యంగా జీవనం సాగిస్తున్నాయి.

ఒకరోజు చాందిని తియ్యటి పళ్ళు తీసుకొచ్చి కుందేళ్ల పిల్లలకు ఇచ్చింది. ఆ పళ్ళు తిని అవి చాలా ఆనందపడ్డాయి. ఆ పళ్ళు ఎక్కడ దొరుకుతాయని చాందినీని అడిగింది మిత్రవింద.

“అడవి లోపలికి కొంచెం దూరం వెళ్ళగానే అనేక పళ్ళ చెట్లు ఉన్నాయి. అవి చాలా తియ్యగా ఉంటాయి. అందులోనుండే ఈ పళ్ళు తీసుకొచ్చాను. ఇవే కాక అక్కడ ఇంకా రకరకాల పళ్ళు ఉన్నాయి” అని చెప్పి మరల అడవిలోకి వెళ్లిపోయింది చాందిని.

అది విన్న మిత్రవిందకు నోరూరింది. ఎలాగైనా అడవిలోనికి వెళ్ళి ఆ పళ్ళన్నీ తినాలనిపించింది మిత్రవిందకి. ఇదే విషయం చారువింద, అరవిందలతో చెప్పింది.

“మనం కూడా అడవి లోపలికి వెళ్లితే చాలా పళ్ళు తినొచ్చు. ఎప్పుడూ ఈ దుంపలూ, కందలూ తింటున్నాము. ఈ చాందినీ లాగా ఎంచక్కా మనం కూడా రకరకాల తియ్యటి పళ్ళు తిందాము. రండి వెళదాము” అని చెప్పింది మిత్రవింద.

ఇది వినగానే చారువింద “అమ్మో! అమ్మకు తెలిస్తే చంపేస్తుంది. నేను రాను బాబూ! నా మాట విని మీరు కూడా వెళ్ళవద్దు!” అని భయంగా చెప్పింది.

## అమ్మ మాట వినాలి

"సరేలే! నీకన్నీ భయాలే! మనం వెళ్ళినట్టు అమ్మకు చెప్తామేంటి? అమ్మ వచ్చేలోపల వచ్చేద్దాం. నీకు భయమైతే నువ్వు రాకు. నేను, అరవింద కలిసి వెళ్తాం" అని అరవిందను తీసుకుని అడవి లోపలికి వెళ్ళింది మిత్రవింద.

వెళ్ళి ఎంతసేపైనా రావట్లేదని వాళ్లు వెళ్ళిన వైపే చూస్తూ కూర్చుంది చారువింద. ఇంతలో కౌముది వచ్చింది. చారువింద ఒక్కర్తే ఉండడం, పైగా ఆందోళనగా ఉండడం చూసి "ఏమయ్యింది చారువిందా? వాళ్ళేరి? నువ్వు ఎందుకు అలా ఉన్నావు?" అని అడిగింది.

జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పింది చారువింద. అది విని లబోదిబో అని ఏడవడం ప్రారంభించింది కౌముది. ఆ ఏడుపు విని పక్షులు, సాధుజంతువులు అక్కడకు వచ్చాయి. వాళ్ళల్లో చాందిని కూడా ఉంది.

అంతా విని "అత్తమ్మా! నువ్వేమీ కంగారు పడకు. నేను, మా పక్షులందరం వెళ్లి వాళ్ల జాడ కనుక్కుని వస్తాం. సరేనా! నువ్వు ధైర్యంగా ఉండు" అని చెప్పి పక్షులన్నింటినీ తీసుకుని అడవిలోనికి వెళ్ళింది చాందిని.

అడవి అంతా గాలించగా ఒకచోట జంతువులు పట్టడానికి తవ్విన గొయ్యి నుండి కేకలు వినబడ్డాయి. పైనుంచి చూడగా ఆ పెద్ద గోతిలో మిత్రవింద, అరవింద పడిపోయి ఉన్నాయి. వాటిని పైకి ఎలా తీయాలో అర్థం కాలేదు చాందినీకి. ఈ లోపు దూరం నుండి ఒక వేటగాడు అక్కడికి రావడం గమనించింది చాందిని.

అప్పుడు పక్షులందరితో "జాగ్రత్తగా వినండి! ఆ వేటగాడు వచ్చే సమయానికి అతని కంట పడకుండా చెట్ల ఆకుల మధ్య దాక్కుందాం. ఆ వేటగాడు మిత్రవింద, అరవిందలను గొయ్యి నుండి పైకి తీయగానే అందరం కలిసి వేటగాడిపై దాడిచేద్దాం. అప్పుడు ఆ వేటగాడు వాళ్లను వదిలేసి వెళ్ళిపోతాడు. అప్పుడు మిత్రవింద, అరవిందలతో మనం అడవినుండి దాటిపోదాం" అని చెప్పింది చాందిని.

అన్ని పక్షులు చాందిని చెప్పినట్టే చేసాయి. వేటగాడు వచ్చి ఈ రోజు తన పంట పండిందనుకుని మిత్రవింద, అరవిందలను పైకి తీసాడు. ఒక్కసారిగా పక్షులన్నీ వేటగాడి మీద దాడి చేసాయి. తమ ముక్కులతో పొడిచాయి. అన్ని పక్షులు ఒకేసారి మీద పడడం చూసి, భయపడి, మిత్రవింద, అరవిందలను అక్కడ వదిలేసి పారిపోయాడు వేటగాడు. చాందిని చెప్పినట్టు గానే అన్నీ అడవి దాటాయి.

వీళ్ల రాక కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్న కౌముది, దూరం నుండి వీళ్లు రావడం చూసి ఊపిరి పీల్చుకుంది. మిత్రవింద, అరవిందలు దగ్గరకు రాగానే "నేను ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు. ఆ అడవిలోకి ఎందుకు వెళ్లారు? నా మాటంటే మీకు లెక్కలేదు. చాందిని ఉంది కాబట్టి ఈ రోజు మీరు బతికి బట్టకట్టారు" అని ఏడుస్తూ వాళ్ళని మందలించి, చాందినీకి కృతజ్ఞతలు తెలిపింది కౌముది.

"ఇప్పటికైనా చూసారా! మేము రావడం ఆలస్యమైతే మీరు ఏమై పోయేవారు? మీ గురించి ఇంత ఆలోచించే మీ అమ్మ ఏమయ్యేది? అందుకే అమ్మ మాట వినాలి. పెద్దల మాట చద్దన్నం మూట. మీకు పళ్ళు కావాలంటే నేను తెస్తున్నాగా! ఇక మీరెప్పుడూ మీ అమ్మకి తెలియకుండా అడవిలోకి వెళ్ళకూడదు. సరేనా?" అని చెప్పింది చాందిని.

చాందిని మాటలకు యథార్థం గ్రహించి సరేనన్నాయి. వాళ్లమ్మను పట్టుకుని "అమ్మా! మాకు బుద్ధొచ్చింది. ఇంకెప్పుడూ నీకు చెప్పకుండా మేమెక్కడికీ వెళ్ళం" అని అన్నాయి మిత్రవింద, అరవిందలు.

అందరినీ దగ్గరకు తీసుకుని మనసారా ఆనందపడింది కౌముది. ఇక అప్పటినుండీ అమ్మ చెప్పినట్టే వింటూ ఎంతో ఆనందంగా జీవించాయి ఆ కుందేళ్లు.

# పరివర్తన

## నన్ద త్రినాథరావు

9006021153

**జీవితంలో బద్ధకం అభివృద్ధికి అవరోధమనీ, దాన్ని మించిన శత్రువు లేదనీ, బద్ధకాన్ని విడిచి పెట్టమనీ, అభి తల్లి ఎన్నో సార్లు చెప్పింది. కానీ ఆమె మాటలు పెడచెవిన పెట్టేవాడు అభి.**

అభి నిద్ర లేచి గబగబా తయారై స్కూల్కి వెళ్ళడానికి బస్టాప్ కి వచ్చాడు. ఇంకా తనకు కావాల్సిన బస్సు రాలేదు. బస్టాప్లో చాలా మంది జనం ఉన్నారు. తన స్కూల్ పిల్లలు ఒక్కరూ కనిపించలేదు. అప్పటికే స్కూలుటైమ్ అయిపోవచ్చింది. ఈ రోజు పరీక్ష కూడా ఉంది. ఎప్పటిలా తాను ఈరోజు కూడా త్వరగా నిద్ర లేవలేకపోయాడు.

ఇంతలో బస్సొచ్చింది. ఒక్కసారిగా జనం లోపలికి ఎగబడ్డారు. తన స్కూల్ రూట్లో వెళ్లే ఆఖరి బస్సు అదే. చాలా మంది వేరే స్కూల్ పిల్లలు, పెద్దవాళ్ళు లోపలికి వెళ్లేందుకు పోటీ పడ్డారు.అభి కూడా మెల్లగా ఎలాగో అలాగా లోపలికి వెళ్లి నిల్చున్నాడు. బస్సులో ఎక్కడా ఖాళీ లేదు. అడుగు పెట్టడానికి చోటు లేదు. ఇంతలో కండక్టర్ వచ్చాడు. అందర్నీ టిక్కెట్స్ తీసుకోమని చెబుతున్నాడు. అభి దగ్గరకు వచ్చాడు. అభి "పాస్" అన్నాడు. కండక్టర్ పాస్ చూపించమని అడిగాడు.

అభి తన జేబునుండి పాస్ తీయబోయాడు. అది లేదు! అభికి గుండెలు జారిపోయాయి. 'నిన్న సాయంత్రం తన జేబులోనే పాస్ ఉండేది. ఏమయ్యింది?'అనుకున్నాడు. అప్పుడు గుర్తొచ్చింది అభికి. ఈ రోజు తాను స్కూల్ డ్రెస్ చేంజ్ చేసుకున్నాడు. పాత డ్రెస్ లో ఉండిపోయింది బస్ పాస్. కండక్టర్ పాస్ చూపించమని అభిని తొందర పెడుతున్నాడు. అభి మెల్లగా అతనికి విషయం చెప్పాడు. అంతే! కండక్టర్ గయ్ మన్నాడు.

"ఏం బాబూ! స్టూడెంట్లా ఉన్నావు. పాస్ దగ్గర పెట్టుకోవాలని తెలీదా? ఆ మాత్రం జాగ్రత్త లేనివాడివి నువ్వేం చదువుతావయ్యా?" అంటూ చాలా హేళనగా మాట్లాడాడు. "నువ్వేం చేస్తావో నాకు తెలీదు. త్వరగా ఏదో ఒకటి చేసి టిక్కెట్ తీసుకో. ఎదర చెకింగ్ ఉంటుంది. లేదా బస్సు దిగిపో" అంటూ కేకలు వేస్తూ ముందుకు వెళ్ళిపోయాడు.

మిగిలిన పిల్లలంతా కిసుక్కుమని నవ్వారు. అభికి తల కొట్టేసినట్టయ్యింది. సిగ్గుతో తల వంచుకున్నాడు. తన వద్ద డబ్బులు కూడా లేవు. హెల్ప్ చేయమని వాళ్ళని అర్థించాడు. పిల్లలంతా తలా కొంతా సాయం చేశారు. ఆ డబ్బులతో టిక్కెట్ తీసుకున్నాడు అభి.

ఇంతలో తన స్కూలు స్టాప్ వచ్చింది. బస్సు దిగి గబా గబా స్కూలు దగ్గరికి పరుగెత్తాడు. అప్పటికే పరీక్ష మొదలయిపోయింది. మెయిన్ గేట్ కూడా వేసేశారు. అభి పరుగు పరుగున గేట్ వద్దకు వెళ్ళాడు. గేట్ దగ్గర ఉన్న సార్ ని బ్రతిమలాడేడు తనని లోపలికి పంపించమని. ఆయన ఒప్పుకోలేదు.

"ఈ రోజు పరీక్ష అని నీకు తెలుసు కదా! గంట ముందే పరీక్షకు హాజరవ్వాలని నీకు తెలీదా? లోపల పరీక్ష కూడా మొదలయిపోయి అరగంటయ్యింది. ఇప్పుడు నిన్ను లోపలికి పంపించలేను!" అంటూ ఆయన చాలా కఠినంగా మాట్లాడాడు.

అభి బుర్ర తిరిగిపోయింది.

"సార్! ఈ ఒక్కసారికి నా తప్పు క్షమించండి సార్. లోపలికి పంపించండి సార్. నేను ఈ పరీక్ష వ్రాయకపోతే నేను సంవత్సరమంతా కష్టపడి చదివింది వృథా అయిపోతుంది సార్" అంటూ కాళ్ళా వేళ్ళా పడ్డాడు. అయినా ఆ ఆఫీసర్ దయతలచలేదు.

"నేను నీ గురించి అలోచించి లోపలికి పంపితే నా ఉద్యోగం ఊడుతుంది. రూల్స్ అందరికీ ఒక్కటే. నేను ఏం చేయలేను" అంటూ గేట్ తాళం వేసుకొని లోపలికి  వెళ్ళిపోయాడు.



అభి మిన్ను విరిగి మీద పడినట్టు విలవిల్లాడిపోయాడు. ఏం చేయాలో తెలియక భోరుమని ఏడుపు మొదలు పెట్టాడు.

"అభీ!  ఈ రోజు పరీక్ష ఉంది కదా?తొందరగా లేచి తయారవ్వు బాబూ! టైమవుతుంది" అంటున్న అభి తన తల్లి మాటలతో ఉలిక్కి పడి నిద్ర నుండి లేచాడు. చుట్టూ చూసాడు. కల కన్నట్టు తాను స్కూలు గేట్ వద్ద లేడు. ఇంట్లో ఉన్నాడు. అంత భయంకరమైన కల వచ్చినందుకు అభి భయంతో వణికిపోయాడు.

అభి బాగా లేజీ బోయ్. చదువుకోవడానికి, తినడానికి, నిద్ర లేవడానికి చాలా బద్దకిస్తుంటాడు. జీవితంలో బద్ధకం అభివృద్ధికి అవరోధమనీ, దాన్ని మించిన  శత్రువు  లేదనీ, బద్ధకాన్ని  విడిచి పెట్టమనీ, అభి తల్లి  ఎన్నో సార్లు చెప్పింది. కానీ ఆమె మాటలు పెడచెవిన పెట్టేవాడు అభి. అలాంటి అభి బద్ధకం వలన ఎన్ని ఇబ్బందులు, ఎన్ని పాట్లు పడాలో స్వయంగా కలలో చూసి తెలుసుకున్నాడు. అభిలో పరివర్తన కలిగింది. అప్పటినుంచీ  అతడు బద్ధకాన్ని పూర్తిగా వదిలి పెట్టాడు. బాగా చదువుకొని లేజీ బోయ్ కాస్తా ఇంటెలిజెంట్  బోయ్  అయ్యాడు.

# ఈ రోజు పనిమనిషి రాలేదు



శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి

..........................

**విశిష్ట అతిథి కథ**

> **"ఇంగ్లీషు వాళ్ళలా, భర్తతో సమానంగా ఉద్యోగం చేస్తున్నా వారికి ఇంట్లో భార్య ఇబ్బంది కనిపెట్టి సాయం చేయాలని తెలియదు కాని, గాంధీగారి సూక్తులు వల్లిస్తే సరిపోతుందా?" ఇవే మాటలు పైకి అనగలిగితే సుజాత ఇంత కష్టపడేది కాదు. చెప్పినా అర్థం చేసుకోలేని వారుంటారు. ఇది నా బాధ అని చెప్పలేని సుజాతకి పనిమనిషి రాని రోజున, వచ్చిన రోజునా, నానా యాతనాను. సుజాత కొత్త పనిమనిషిని పెట్టుకుందామనుకుంది, మళ్ళీ కొత్త పనిమనిషి వస్తే మళ్ళీ కొత్త సమస్యలు వస్తాయి అని, రాని రోజున, పెద్ద మనసు చేసుకుని గిన్నెలు తోముకునేది."**

ఈ రోజు పనిమనిషి రాలేదు. ఇంత పొద్దెక్కింది. ఇంకేమొస్తుంది? అని సుజాత మనసులో బాధపడింది. ఆ బాధ పెద్దదై మనసు విలవిల లాడింది. తొమ్మిదయేటప్పటికి, పిల్లలకు టిఫెన్ బాక్సులు రెడీ చెయ్యాలి. శ్రీవారికి రుచిగా వండి పెట్టాలి. ఇంట్లో ఏపనికీ, ఎవరూ సాయం చెయ్యరు. వేళకి అన్నీ అమర్చకపోతే, నానా రభసానూ! అసలు పనిమనిషి రానిరోజున ఒక్క సుజాతకేమిటి.. ప్రతీ ఇల్లాలికీ ఇబ్బందేను!

మరి ఏంచేస్తాం చేతికి సాయంగా ఉంటుందనేగా, ఈ కరువు రోజుల్లో డబ్బులిచ్చి పెట్టుకొంటేను, నెలకి వారం రోజులు నాగాలు పెడుతుంది, 'ఎందుకు రాలేదు' అని అడిగితే, ఏవో కారణాలు చెపుతుంది. గట్టిగా అడగాలనుకుంటుంది సుజాత. కాని మనసులో కొంచెం భయం.. మళ్ళీ మర్నాడు రాదేమోనని!

ఇల్లాలికి పనిమనిషి రాకపోవడంతో అనేక సమస్యలు.

పనిమనిషి రాకపోవడంతో రణగొణ ధ్వని రావణాసురుడి పెళ్ళి అంత హడావిడి.

మన సుజాతలాంటి మెత్తని మనసున్న వారైతే, కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోతారు. మరో కోవకి చెందిన వారు అయితే, 'పనిమనిషి రాకపోతే నాకేం భయం లేదు'అంటూ, ఇల్లంతా బొంగరంలా తిరుగుతూ, పిల్లలకీ, మొగుడుకీ తలోపని పురమాయించి, అవసరం అయితే ఆ పనిమనిషినిమాన్పించి, మరో పనిమనిషిని పెట్టుకోగలరు. ఇంకొక మనస్తత్వం గల ఇల్లాలైతే, రణరంగంలోకిదూకిన సత్యభామలా, పమిటని బొడ్డులో దోపుకుని, పనులన్నీ ఒక్క చేతిమీద చెయ్యగలదు. భర్తను, పిల్లలను నోరు ఎత్తకుండా, మెప్పించగలదు. ఇటువంటి వారు ధైర్యే సాహసే లక్ష్మీ అని ఇంటాబైటా, తమ అదుపు ఆజ్ఞల్లో పెట్టుకుని, హాయిగా బ్రతికేయగలరు. మరో పనిమనిషిని పిలిచి, అన్నమో.. డబ్బులో ఇచ్చి ఇన్నిమాయకబుర్లు చెప్పి, ముప్పు గడుపుకోగలరు. భర్తగారు ఏదైనా అధికారం చూపబోతే, 'నేనూ

ఉద్యోగం చేస్తున్నాను' అని చెప్పి దర్జాగా మాట్లాడగలరు.

ఇంక ఎటొచ్చి సుజాతలాంటి మనస్తత్వం గల వారిదే సమస్య అల్లాను. పనిమనిషి రాని రోజున అశోకవనంలో సీతలాగా, దిగులుగా అయిపోయి పెరట్లోకి వెళ్ళి గంపెడు అంట్లగిన్నెల కేసి ఓసారి దిగాలుగా చూసి, ఎవరేనా పక్కవాళ్ళ పనిమనిషి కనిపిస్తుందేమోనని వీధిలోకి వెళ్ళి అటూ ఇటూ తిరగడం వల్ల పొద్దెక్కిపోయి, ఇటు గిన్నెలు కడగలేకా, అటు వంటపనీ కాక, నానా హైరానా పడిపోతుంది పాపం.

"అమ్మా నాకు స్కూలు టైము అయిపోతోంది. బాక్సు రెడీగా ఉందా? టిఫిన్ ఏదీ?" అంటూ పిల్లలు టేబుల్ దగ్గరకు వచ్చి కేకలు.

ఇంక భర్తగారు తన పాలిటి కర్తగారు. "ఏం ఏం చేస్తున్నావ్? పనిమనిషి రాకపోతే అంత దిగులు ఎందుకు? మా చిన్నప్పుడు, మా అమ్మ పదిమంది పిల్లలతో చేసుకునేది. తెల్లవారగట్ల లేచేది. అసలు ఆవిడ ఎప్పుడు పడుకునేదో, ఎప్పుడు లేచేదో మాకు తెలియదు. మేం లేచేటప్పటికి తలారా స్నానం చేసి, పూజా మందిరంలో కలకల లాడుతూ దీపాలు పెట్టేది. ఇప్పటి వాళ్ళు మొగుడుతో సమానంగా లేస్తారు!" అని మాటలతో ఓ చురక వేస్తాడు సుజాతని. మనసు గిలగిలా కొట్టుకుంటుందే కాని సమాధానం చెప్పలేదు.

"మగవాళ్ళతో సమానంగా ఉద్యోగం చేస్తున్నాం, ఇంట్లో ఉండే ఇల్లాళ్ళు ఆనాడూ, ఈనాడూ సుఖపడ్డట్టు మేం ఏం సుఖపడుతున్నాం?" అందామనుకుంది సుజాత. కాని భయం వల్ల మనసులోనే అనుకుంది.

సుజాత చిన్నప్పుడు, వాళ్ళ బామ్మ ముద్దుపెట్టుకుంటూ "సుజాతా పేరులోనే ఉంది నీ అదృష్టం అంతాను" అనేది. 'ఏం బామ్మలో.. ఏం ప్రేమలో' అని వేదాంత ధోరణిలో అనుకుంది మనసులోనే. పైకి అనడానికి భయంకదా మరి! ఈ భయపడే మనస్తత్వం ఉంది. చూసారూ! ఇలా సీతమ్మవారికోవకి చెందిన వారిని పెంచిన తల్లితండ్రులు ఉన్నారు చూసారా? వాళ్ళదీ తప్పంతాను. ఎందుకంటారా? "అమ్మా వినయమే భూషణం. ఆడపిల్లకి భూదేవికి ఉన్నంత ఓర్పు ఉండాలి. ఎవరేనా నీకు వ్యతిరేకంగా మాటాడితే, మౌనంగా ఊరుకోవాలి. ఊరుకొన్నవారికి ఊరెల్లనోపదు అన్నారు." అంటూ మన సుజాతని పెంచినట్లు, ముగ్ధత్వంగా తయారు చేస్తారు. దాంతో, అనేక సమస్యలు, అందులో పనిమనిషి రాని రోజు మరో సమస్య!

అసలు మన సుజాత మనసే వెన్నకంటే మృదువైనది కదా, పనిమనిషి రాని రోజున ఒక సమస్య అయితే, వచ్చిన రోజు, మరో ఇబ్బంది కలిగేది. పనిమనిషి వస్తూనే నీరసంగా గొంతుపెట్టి "నిన్నటిలా లేదు. ఒకటే తల నొప్పిగా ఉంది. అయినా మీ మీద జాలికొద్దీ వచ్చాను" అంటుంది.

వెంటనే సుజాత మనసు కరిగిపోయి, జాలిగా "అల్లాగా పాపం ఉండు! తలనెప్పి మాత్ర తెస్తాను" అంటూ, కాఫీ గ్లాసుతో ప్రత్యక్షం అయి, "ఇవి తీసుకో అమ్మా. ఎవరేనా బాధపడుతూంటే చూడలేను" అంటూ, అది గిన్నెలు కడిగినంతసేపూ దాని దగ్గర కూచుని, జాలి పడుతుంది.

"ఓ వంద రూపాయలు అర్జంటుగా కావాలి. నెలాఖరున జీతంలో కట్టుకుందురుగాని, మిమ్మల్నే ఊరికే ఇమ్మనలేదు. అల్లాచూస్తారేం?" అని సుజాతని దబాయించి పుచ్చుకొంటుంది. "అసలు మాననండి ఏదో కారణం ఉంటేనే కాని" అంటుంది. పైగా ఒక సంగతి చెప్పింది, "మాటి, మాటికీ పనిమనిషి అనకండి నాపేరు నరసమ్మ తెలుసా?"

మన సుజాత "తప్పకుండా ఇస్తాను. మేము ఉన్నదెందుకు నీ అవసరానికి ఆదుకోవడానికేగా" అందామనుకుంటుంది. పైకి అనలేదు. అంటే మరునాడు మానేస్తుందేమోనని. ప్రేమగా చూస్తూ చిరునవ్వు చిందిస్తూ వంద రూపాయలు అందిస్తుంది. అందువల్లే తరుచు పనిమనిషి మానేయడం నేర్చుకుంది. ఈరోజున పనిమనిషి రాకపోవడంవల్ల అనేక ఆలోచనలు వచ్చాయి.

"ఏం కష్టమొచ్చిందో ఏమో పాపం! దాని బాధలు దానికి ఉంటాయి కదా?" అది చెప్పిన సంగతులు జ్ఞాపకం రాసాగాయి.

"అసలు నేచెప్పేది వినండి అమ్మా, నా మొగుడు రిక్షా లాగుతాడు. 'ఈరోజు ఈ కొద్ది రూకలేవచ్చాయి. ఏం వండుతావో ఏమో' అంటూ పది రూపాయలు నా మొఖాన కొడతాడు. వాడి దగ్గర మస్తుగ డబ్బులుంటాయి, తాగి తగలేస్తాడు. దాంతో నాకిచ్చిన రూకలు చాలక పిల్లలూ నేనూ కష్టపడుతున్నాం. చదువుకోరా బిడ్డా అంటే, అమ్మా నీ కష్టం చూడలేకున్నాం అంటారు. వాళ్ళు చదువుకుని,

కుర్చీలో కూర్చుని ఉద్యోగం చేస్తే చూడాలని నా ఆశ, తప్పంటారామ్మా" అంటుంది.

"నీలాంటి అమ్మ జాలిపడి ఓ చీర ఇస్తుంది. మిగిలితే ఇదివరకు పెట్టేవారు, ఇప్పుడు చద్ది అన్నాలు పెట్టి, అదే ఫ్రిజ్జిలంటారు కదా? దాంట్లో దాచుకుతింటున్నారు. అహా మీలాంటి వార్ని అనకూడదు తప్పు. అసలు చెపుతున్నాను. తల్లి ప్రేమ కదా పిల్లల్ని చదివించాలనీ! అమ్మా! మొన్ననో సినిమా చూసాను. అసలు ఆడపుట్టుక పుట్టకూడదనిపించేసింది. చిన్నప్పుడు తల్లితండ్రుల ఇష్టం, తర్వాత మొగుడు, ఆ తర్వాత, పిల్లలూ చెప్పినట్లు బ్రతుకుంది అని తెలిసింది. ఆ సినిమా చూసాక మీచదువుకున్న అమ్మలకు మాత్రం, ఇబ్బందులు పడే అమ్మలు లేరంటారా?" అంది.



నరసమ్మ చెప్పినవన్నీ జ్ఞాపకం వచ్చాయి గిన్నెలు తోముకుంటున్నంత సేపూను.

భోంచేసిలేస్తూ "ఇవాళ పనిమనిషి రాలేనట్టుంది"అన్నాడు సుజాత భర్త.

"అవును పొద్దుటినుంచీ, చూస్తూనే ఉన్నారు కదా? మళ్ళీ అడగడం దేనికి, ఏమీఎరగనట్టుగా, అడుగుతున్నారు?" అందామనుకుంది. కాని మనసులో ఆగిపోయాయి ఆ మాటలు.

"గాంధీగారేమన్నారు ఎవరి పనులు వాళ్ళు చేసుకోవాలి, ఒకరి మీద ఆధారపడకూడదు. అని చెప్పారు వినలేదా? ఎప్పుడూను" చిరునవ్వు చిందిస్తూ అన్నాడు.

ఆ మాటలు వినేసరికి, కోపం చిర్రెత్తుకువచ్చింది భర్త మీద. కోపంగా, భర్తకేసి చూస్తూను ముఖం పక్కకి తిప్పుకుంది.

"మీ మాటల్లోనే, మీరు కూడా ఇంటి బాధ్యత తీసుకోవాలని అర్థం ఉంది" అనుకుంది. అసలు ఈరోజు పనిమనిషి రాకపోవడం వల్ల పని ఎక్కువై అందరి మీద కోపం వస్తోంది సుజాతకి. అశక్తులు కోపం మనసులోనే దిగమింగుకుంటారుకదా?

"ఇంగ్లీషు వాళ్ళలా, భర్తతో సమానంగా ఉద్యోగం చేస్తున్నా వారికి ఇంట్లో భార్య ఇబ్బంది కనిపెట్టి సాయం చేయాలని తెలియదు కాని, గాంధీగారి సూక్తులు వల్లిస్తే సరిపోతుందా?" ఇవే మాటలు పైకి అనగలిగితే సుజాత ఇంత కష్టపడేది కాదు. చెప్పినా అర్థం చేసుకోలేని

వారుంటారు. ఇది నా బాధ అని చెప్పలేని సుజాతకి పనిమనిషి రాని రోజున, వచ్చిన రోజునా, నానా యాతనాను. సుజాత కొత్త పనిమనిషిని పెట్టుకుందామనుకుంది, మళ్ళీ కొత్త పనిమనిషి వస్తే మళ్ళీ కొత్త సమస్యలు వస్తాయి అని, రాని రోజున, పెద్ద మనసు చేసుకుని గిన్నెలు తోముకునేది. ఏదేనా అలవాటు గొప్పది కదా? సుజాతకి గిన్నెలు తోమడం అలవాటై పోయింది. పనిమనిషి పనికి రాకపోవడం అలవాటై పోయింది.

ఇక ఈ ప్రకరణం ఇంతే అనుకుంటున్నారా?

ఇంకోరకం మనస్తత్వంగల వారున్నారు. ఓ రిటైరైన పెద్దమనిషి పొద్దున్నే లేచి, "ఏమేవ్ భార్యామణీ! నాకు ఇవేళ బూర్లు తినాలని ఉందే!" అంటూ కుర్చీలో దర్జాగా కూచుని మరీ అరిచాడు.

భర్త వేసిన కేకకి వళ్ళుమండింది.

"ఇవేళ పనిమనిషి రాలేదని ఎలాగా అని నేను బాధపడుతుంటే, ఈయనగారికి బూర్లు తినాలని ఉందిట" అని విసురుగా వచ్చి, "రిటైరై తీరిగ్గా కూచుని, కోరికలు బాగానే ఉన్నాయి. వెళ్ళి పనిమనిషిని పిలుచుకురండి" అంది.

"నేనా, ఈ డిస్ట్రిక్టి పెద్ద ఆఫీసర్ గా చేసి, దర్జాగా బతుకుతూ ఉంటే, పనిమనిషి ఇంటికి నన్ను వెళ్ళమంటావా?"అని బాధపడసాగాడు.

"ఆ రిటైరై పదేళ్ళైనా ఇంకా ఆఫీసరుగా జులుం తగ్గలేదు. మీకు నిజంగా బూర్లు తినాలంటే పనిమనిషిని పిలుచుకురండి."

"అంతేనంటావా? నువ్వు వెళ్ళవే నామాటవిని" అన్నాడు.

"ఇదిగో క్రిందటిమాటు పనిమనిషి మానేస్తే నేను వెళ్ళాను. ఈసారి మీరు వెళ్ళండి, ఆ సిలుకు లాల్చీ షోకులూ తీసేసి పాతవేవైనా కట్టుకుని మరీవెళ్ళండి."

"కిందటి మాటు నీవు అంత పెద్ద జరీ చీర కట్టుకుని వెళ్ళావు కదే?" అని ప్రశ్నించాడు ఆయన.

"అంతే! ఇంతకీ మీరు వెళ్ళి పిలుచుకుని వస్తేనే బూర్లు తింటారు" అంది భార్యామణి.

"పోనీ ఏంచేస్తా, వెళతాను, వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడు కదా?" అంటూ వెళ్ళి పిలుచుకువచ్చాడు.

సరే మొత్తానికి బూర్లు వండి భర్తగారి కోరిక తీర్చింది. తియ్య తియ్యగా తింటూ "ఈరోజు పనిమనిషి రాకపోతే, మీకు బూర్లుండేవి కాదు" అంది ఆమె.

"ఆడవాళ్ళకి పనిమనిషి నామ స్మరణే, కదా? మొన్నటికి మొన్న గుడికి వెళ్ళి, మా పనిమనిషి రాలేదంటే మా పనిమనిషి రాలేదు అని చెప్పుకుంటున్నారు నేను విన్నాను."

"మొన్న శ్రావణ శుక్రవారం పేరంటానికి వెళ్ళినప్పుడు కూడా మేమంతా, పనిమనిషి మానేస్తే ఎంత ఇబ్బందో చెప్పుకున్నామండీ బాబూ! మన పనిమనిషి మానేస్తే, ఇంటికి వెళ్ళి పిలిచామని గౌరవంగా వస్తుంది. వాళ్ళ పనిమనిషి, వాళ్ళింటికి రావద్దంటుందట, మరి అది ఏమంటారు?"

ఇదండీ సంగతి పనిమనిషి రాకపోతేను.

★★★

(2003 లో రేడియోలో ప్రసారం అయిన కథ)

# మోటు మనిషి

## కీ. శే. కె. ఎన్. వి. పతంజలి



**కథా మార్గదర్శి కథ**

**నాకోరోజు సర్వాధికారం ఇస్తే, ఈ నాయుడితో మొదలెట్టి, అనాగరికులందర్నీ ఉరితీయించి పారేస్తాను. అఫ్కోర్స్, మనకిష్టం లేని లెక్చరర్స్నీ, ప్రిన్సిపాల్నీ, కొంతమంది కథకుల్నీ, మరికొంతమంది సినిమా వాళ్ళనీ, కొంతమంది ఆడపిల్లల తాలూకు క్రూరులైన తండ్రుల్నీ ఈ స్కీములో కలిపేయవచ్చు. ఎన్నయినా చేయవచ్చు కాని ఈ నాయుడితో మాత్రం శెనక్కాయలు తినడం తక్షణం మాన్పించలేం.**

అతని వయసు నా వయసుచేత రెండుసార్లు భాగారించబడుతుంది. అతని ఒళ్ళుకూడా నా సైజు ఇద్దరు మనుషులకు సరిపడా ఉంది. అతను వ్యవసాయదారుడే అయిన పక్షంలో, పొలానికి సరిపడే ఎరువు అతని ఒంటినే ఉంది.
కానీ వెధవకి బుద్దే ఉన్నట్టు లేదు. ఖచ్చితంగా చెప్పగలను. లేదు. ఉంటే నేనతన్ని మర్యాదగానే “మీరు నా సీట్లోకివచ్చేస్తారా, నాకా కిటికీ పక్క చోటిచ్చేసి” అని అడిగినప్పుడు..

“రాను... నాను సుట్ట కాల్చుకోవాలి” అని నిర్మొహమాటంగా చెప్పాడు.

‘వాణ్ని చుట్ట కాల్చుకోనివ్వకూడదని’ గట్టిగా నిర్ణయించుకున్నాను.

బస్సు వేగంగా పోతుంది. గాలికి కామోసు, అతని తల కొంచెం కదులుతోంది. జిడ్డు తల. అరచేతులంతేసి చెవులు, వాటికి స్కూటర్ చక్రాలంతేసి తమ్మెలు. వాటికి మురికి పూసుకున్న ఎరుపూ తెలుపూ పొళ్ళు.

బుద్ధి లేకపోయిన తరవాత ఇంక ఏం ఉంటే మాత్రం ఏమిటి లాభం?

అసలు ఉదయం లేచిన దగ్గరనుంచీ తలనొప్పిగా ఉంది. దరిద్రపు తలనొప్పి, తెలుగు సినిమాలాగ వచ్చిన వెంటనే పోదు. నిద్రలేని మంచం మీదనుంచి కాళ్ళు కింద మోపేసరికి, పనిలేని పెళ్ళాంలాగా, పనున్న స్నేహితుడిలాగా వచ్చేసి నెత్తెక్కి కూర్చుంది, దిక్కుమాలిన తలనొప్పి.

మళ్ళీ పక్కన కూర్చున్న నాయుడికేసి చూశాను. అతను కిటికీలోనుంచి కనబడుతున్న చెట్లకేసీ, చేమలకేసీ కాబోలు.. దీక్షగా చూస్తున్నాడు. వీడి దృష్టి తగిలితే అవి చటుక్కున చచ్చూరుకుంటాయి.

వీడు ఎంతకీ చుట్ట కాల్చడానికి ప్రయత్నించడం లేదు. ఇలా వాడు చుట్ట తీసి ముట్టించ ప్రయత్నించడం, నేనలా మొదట ఇంగ్లీషులోనూ,

తరవాత తెలుగులోనూ అభ్యంతరం చెప్పి పగ తీర్చుకోవడం... ఈవేళటికి సరదా తీరేలా లేదు.

కిటికీ పక్క సీటైతే, ఒక చెయ్యి కిటికీ చువ్వలమీద ఆనించి, రెండో చెయ్యి ఎదుటి సీటు చట్రం మీద ఆనించి, చేతులమీద తల ఆన్చుకొని పడుకోవచ్చు.. ముఖ్యంగా ఇలా తలనొప్పిగా ఉన్న సమయాల్లో!

కానీ ఈ భారతదేశపు హృదయాలైన పల్లెటూరి పౌరుడు, రాతిగుండె వాడు, ఎక్కడ బస్సు దిగిపోయి నన్ను సంతోష శిఖరాలమీదకి ఎక్కిస్తాడో.. అడిగాను.

అతను నాకేసి పరీక్షగా చూశాడు. "సోడారం" చచ్చాం, వీడు నన్ను చివరి వరకూ వదలడు.

"మందేఊరు?" నాయుడడిగాడు నన్ను.

నా ఎడమచేతి పక్కకి చూశాను. ఓ ముప్పై ఏళ్ల వయసున్న టెర్లీన్ బట్టల ఆసామి, వీక్లీ ఒకటి మధ్యకి మడతపెట్టి చదువుతున్నాడు.

"ఎక్కడికెల్తున్నావు?" నాయుడు మళ్ళీ అడిగాడు.

గొంతు తగ్గించి "వెస్ట్ జెర్మనీ" అన్నాను నెమ్మదిగా.

నాయుడికి అర్థమైనట్లు లేదు. "అదెక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"చోడవరానికి ఇంకా అవతల ఉందిలే" అన్నాను.

"సోడారంలో ఈ బస్సాగిపోద్ది. మీదికెల్లదు" నాయుడు ముతకగా నవ్వాడు.

"చోడవరంలో దిగిపోయి నడుచుకుంటూ వెళ్లిపోవచ్చులే" విసుగ్గా అన్నాను. దెబ్బతో నోరు మూసుకున్నాడు.

బస్సు చిన్నాపురం జంక్షన్లో ఆగింది. ఇద్దరో ముగ్గురో దిగి, ఆరుగురనుకున్నాను, కాని ఏడుగురెక్కారు. లాభం లేదు. నాకు తెలియకుండానే ఏయే ఊర్లలో ఎంతమంది దిగి, ఎంతమందెక్కారో లెక్కపెడుతూ చెక్కర్ ఉద్యోగం చేస్తున్నాను.

తలనొప్పి రాన్రాను ఎక్కువౌతూంది. చిరాకుగా ఉంది. జీనియస్సులు పరాకుగానూ, కాదలచుకునే నాలాంటి జీనియస్సులు చిరాకుగానూ ఉంటారు కాబోలు. పక్కాయన్ని వీక్లీ అడిగినా బాగుండును, చూసి ఇచ్చేయొచ్చు. సరే!

"వీక్లీ ఓసారిస్తారా" అడిగాను.

అతను నాకేసి సీరియస్గా చూశాడు.

"ఇవ్వను" కచ్చితంగా చెప్పాడు.

ఆహా దుర్మార్గుడు. పైగా హృదయం లేనివాడు. ఏ కో–ఎడ్యుకేషన్ కాలేజీకో ప్రిన్సిపాల్ గా ఉండదగ్గవాడు. వీడికంటే కుడిచేతి పక్కున్న నాయుడే బెటర్. అడిగితే చుట్టన్నా ఇచ్చేలా ఉన్నాడు. చుట్టేం ఖర్మ, గేరంటీగా భుజం మీదున్న తువ్వాలుకూడా ఇచ్చేసే అంత ధాటీగా ఉన్నాడు.

కానీ నాకు కావలసిన ఆ కిటికీ పక్క సీటే ఇవ్వడు. పక్కనున్న వీక్లీ వెధవని టైమడిగితే అదైనా చెప్తాడా? చెప్పకపోయినా చెప్పకపోవచ్చు. ఈ దుర్మార్గుడి నోటి వెంట ఎలాంటి సమాధానం వస్తుందో ఎవడికి తెలుసు.

వీడిని టైముగాని, వీక్లీగాని, అప్పుగాని ఏమీ అడగకూడదు. పక్కవాడిని అడగనవసరం లేకుండానే టైము తెలుసుకోవచ్చు. ఈజీ. వాడు చెయ్యి కిందకి దించినప్పుడు చూశాను.

"ఒంటిగంట!"

పెళ్లికెళ్లిజోడు పోగొట్టుకున్నవాడిలా ఎండ మండిపోతుంది. చోడవరం చేరడానికింకా మూడుగంటల టైముంది. మూడుగంటలు. దుర్మార్గులిద్దరి మధ్యా... అదీ తలనొప్పితో!

పరీక్షహాలులో మూడుగంటలు తెల్లకాగితం వాడకుండా ప్రయత్నం మీద కూచోవచ్చు. తెలుగు నాటకంగాని, సినిమాగాని కదలకుండా చూడొచ్చు. కానీ... వీళ్ళిద్దరి మధ్యా!!!

భోజనం చేసి విజయనగరంలో బస్సెక్కాను. ఎంతో పాపం చేసుకోబట్టి వీళ్ళిద్దరిమధ్యా పడ్డాను. ఇంకో సీటులోకి మారిపోవచ్చు. ప్రభుత్వంగాని, కండక్టర్ గాని, ప్రయాణికులుగాని ఎవరూ అభ్యంతరం చెప్పరు. కానీ, ఇంకే సీటూ ఖాళీగా లేదు.

బస్సు అక్కడక్కడా ఆగుతూ, జిడ్డుగా ముందుకు వెళ్తోంధి. తలనొప్పి మాత్రం ఎక్కడా ఆగకుండా చురుకుగా పెరుగుతోంది. కొంతమంది మగాళ్లని చూస్తే చిరాకేస్తుంది. చంపెయ్యబుద్దౌతుంది. ఈ నమ్మకంలో ప్రస్తుతం కుడి ఎడమైనా పొరపాటు లేదు. ఈ చిరాకూ, తరవాతదీ పగవాళ్ళకు మాత్రమే పరిమితం. అదేంటోగాని, అమ్మాయిల్ని ఎవర్ని చూసినా చిరాకెయ్యదు. పైగా ఎంతో ముచ్చటేస్తుంది. అదీ గమ్మత్తు.

బస్సు జిడ్డుగా ముందుగు పోతోంది. గాలి మొహమాటపడి వీస్తున్నా, నాయుణ్ణి దాటి నా దగ్గరకి చేరలేకపోతోంది. చికాకుగా, చిరాకుగా ఉంది.

ముందుసీటుకి చేతులాన్చి, చేతుల మీద తల వాల్చి పడుకున్నాను. దుమ్ము పూసుకున్న నాయుడి రాకాసి పాదాలు టైరు చెప్పులు వేసుకొని ఉన్నాయి. కాళ్ళవెనుక సీటు కింద మైకా సంచి ఒకటి ఉంది.

కళ్ళు మూసుకున్నాను.

కళ్ళు మూసుకుంటే, ఒళ్ళు తిరుగుతున్నట్టు అనుభూతి కలుగుతోంది. కళ్ళు విప్పి కిందికి చూస్తున్నాను. నాయుడు కిందకి వంగి, కాళ్ళ మధ్యనుంచి మైకా సంచి ఇవతలికి లాగాడు. దాన్నిండా వేరుశెనక్కాయలు. రెండు గుప్పిళ్ళు తీసి, కాలితో సంచి మళ్ళీ వెనక్కి తోసేశాడు.

బహుశా గడ్డి తవ్వడానికో, గొడ్డలితో కర్ర మొద్దులు చీల్చడానికో పుట్టిన, మొద్దు వేళ్ళతో వేరుశెనగ ఒలుస్తున్నాడు... చిటుకూ చిటుకూమని. ఒలుస్తున్న చప్పుడూ, నములుతున్న మెత్తని అసహ్యకరమైన శబ్దం... క్షణాలు గడుస్తున్నకొద్దీ అన్ బేరబుల్ గా, పెయిన్ఫుల్ గా ఉంది. బస్సు ముందుకు వెళ్తున్నకొద్దీ దూరంతోపాటు ఓర్పు కూడా తగ్గుతోంది.

చిటుక్... చిటుక్... చెవుల్లో కాదు, మెదలో కాదు, నా సహనం మీద సమ్మెట దెబ్బలు. దుర్భరంగా ఉంది. నా పక్కనున్న ప్రిన్సిపాల్ బుద్దులున్న వీక్లీ వాడికి ఇదేం పట్టినట్టు లేదు.

వెధవలకి, పక్కమనిషి బాధ అర్థం కాదు. సినిమా చూసేవాడి బాధ తీసేవాడికి అర్థం కాదు. చదివేవాడి అవస్థ, రాసేవాడికి అక్కర్లేదు. బస్సులో కూర్చున్నవాడి బాధ, కండక్టర్ కి అవసరం లేదు. రిజల్ట్స్ చూసే విద్యార్థుల ఘోష, అది కంపోజ్ చేసేవాడికి అక్కర్లేదు. దారుణం! ముఖ్యంగా ఇలాంటి రూట్ బస్సుల్లో నాలాంటి నాజూకు మనిషికి నరకం. అసలు అడ్డమైనవాడినీ బస్సుల్లో ఎక్కనివ్వకూడదు. ఎక్కినా.. బస్సులో కూర్చొని ఏ గడ్డీ నమలకూడదన్న రూలింగ్ ఇవ్వాలి. తింటే జేబులో డబ్బులన్నీ లాక్కొని మధ్యలో దించెయ్యాలి. నా మట్టుకు నాకోరోజు సర్వాధికారం ఇస్తే, ఈ నాయుడితో మొదలెట్టి, అనాగరికులందర్నీ ఉరితీయించి పారేస్తాను. అఫ్ కోర్స్, మనకిష్టం లేని లెక్చరర్స్ని, ప్రిన్సిపాల్నీ, కొంతమంది కథకుల్నీ, మరికొంతమంది సినిమా వాళ్ళనీ, కొంతమంది ఆడపిల్లల తాలూకు క్రూరులైన తండ్రుల్నీ ఈ స్కీములో కలిపేయవచ్చు. ఎన్నయినా చేయవచ్చు కాని ఈ నాయుడితో మాత్రం శెనక్కాయలు తినడం తక్షణం మాన్పించలేం.



తలనొప్పి తల కొరుకుతూనే ఉంది. వేరుశెనగ తింటూనే ఉన్నాడు నాయుడు. నా చేతిని లేని, నాది కాని, నా పక్కన ఉన్న ప్రిన్సిపాల్ పోలికగాడి చేతినున్న గడియారం తిరుగుతూనే ఉంది.

బస్సు కొత్తవలసలో ఆగింది.

ప్రిన్సిపాల్ దిగిపోయాడు. అతను ఖాళీ చేసిన స్థలంలో ఒక బెల్ బాటమ్ అబ్బాయి కూర్చున్నాడు. ఎర్రగా, సన్నగా, నాజూగ్గా ఉన్నాడు. నాకేసి చూసి పలకరింపుగా నవ్వాడు.

నాయుడు జంతికలు కొనుక్కొని, గ్లాసుడు మజ్జిగ కొనుక్కొని తాగాడు. ఇండీసెంట్. అన్హైజీనిక్. అడ్డమైన గడ్డీ తినడం, తాగడం. మొత్తం సమాజం అంతా ఇంకా తిండి అవస్థకు మించి ఎదగలేదు.

కొంతమంది దిగారుగాని, నా నెత్తిమీదున్న తలనొప్పి మాత్రం దిగలేదు. కొంతసేపు పోయిన తరవాత బస్ బయల్దేరింది. తలనొప్పికి తోడు ప్రాణాల్ని తినేస్తున్న దరిద్రపు జంతికల చప్పుడికి కడుపులో తిప్పుతోంది. నోట్లో విజృంభిస్తున్న లాలాజలం.

## మోటు మనిషి

కొత్తగా వచ్చి కూర్చున్న కుర్రవాడు అతిమంచివాడు లాగానూ, సంస్కారవంతుడి లాగానూ ఉన్నాడు. స్నేహపూర్వకంగా నవ్వి, వక్కపొడి ఆఫర్ చేశాడు. మొహమాటపడి ఒకేఒక పలుకు మాత్రం తీసుకున్నాను... రచయితలు పంపిన అనేక రచనల్లో సంపాదకమహాశయులు మొహమాటపడి ఒకే ఒక్క రచన ప్రచురణకి ఏరుకున్నట్టు!

అంత మంచి అబ్బాయితో మంచీ చెడ్డా మాటాడితే బాగుణ్ణు. కాని ఒంట్లో ఓపిక మాత్రం లేదు.

బస్సు మెలికలు తిరుగుతోంది. కడుపులో తిప్పు లావయింది. భోజనం చేయకుండా బస్సెక్కి ఉండాల్సింది. లాభంలేదు, లాభంలేదు, లాభంలేదు. వాంతయ్యేటట్టుంది. ఇక ఆగేలా లేదు. దుస్సహంగా ఉంది. భళ్ళున వాంతయింది. నా బూటుమీదా, నాయుడి దుమ్ముకొట్టుకున్న పాదాల నిండా అసహ్యంగా అరిగీ అరగని అన్నం మెతుకులు. నాయుడీవేళ నా అంతు చూస్తాడు... తప్పదు.

"అర్రరే...!" నాయుడు గాభరా పడ్డాడు. ఇక తన్నడం తరువాయి.

"ఏక్..." నా పక్కనున్న అబ్బాయి అసహ్యించుకొని, లేచి ముందుకువెళ్లి నిలబడ్డాడు. చివుక్కుమంది మనసు.

"ఛ... ఛ. కొంచెం ముందు చెప్తే బస్సాపుదుం కదండీ, ఫ్లోరంతా పాడైపోయింది." కండక్టర్ విసుక్కున్నాడు.

ఒళ్ళు స్వాధీనం తప్పుతోంది. గుండెలు ఎంతో వేగంగా కొట్టుకుంటున్నాయి. ముందుకు తూలి, ఎదుటి సీటుకి నుదురు కొట్టుకుంది.

"అర్రరే... పాపం" నాయుడి గొంతే అది. నా తలని గడ్డి తవ్వడానికీ, కట్టెలు చీల్చడానికీ, వేరుశెనగ మోటుగా ఒలవడానికీ పుట్టాయనుకున్న మోటు చేతులే జాలిపడి, ఆప్యాయంగా పట్టుకొని, దుమ్ముపడి, తెగ మాసిన అసహ్యకరమైన ఒడిలోనే పడుకోబెట్టుకున్నాయి.

కాలిపోతున్న నా నుదుటిని నెమ్మదిగా నిమిరి, నా కళ్లని మెత్తగా చల్లగా మూసినవి ఆ మురికి చేతులే...! ఆ చేతులా జిడ్డు తల నాయుడివే!!

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 11-07-73 నుండి పునర్ముద్రణ)

# కొత్తగా ఆలోచించాలి, కొత్తగా ఏదైనా చెయ్యాలి,

కొత్త...కొత్త!!

ప్రతి మనిషి కోరుకునేది ఎప్పుడూ అన్నీ కొత్తగానే ఉండాలని.

రాజకీయ నాయకులైతే కొత్త పార్టీ పెట్టాలని,

నటులు, నిర్మాతలైతే కొత్తగా సినిమా తీయాలని,

టీవీ, సోషల్ మీడియా, వగైరాలైతే కొత్త చెత్తను పోగుచేసి ప్రేక్షకులను బలిచేయాలని,

వాట్సప్, ఫేస్ బుక్ లాంటి వైతే  కొత్త గ్రూపులను తయారు చేసి దీంట్లోంచి దాంట్లోకి
ఎత్తిపోతల పథకాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాలని,

రచయితలైతే కొత్తగా కథ వ్రాయాలని,

సంసారికైతే రోజూ వంటలో కొత్తగా ఏదైనా..?

ఇలా సాగుతుంది.

మరి అంతర్జాల పత్రికల విషయమైతే,

కొత్త కొత్త ఫీచర్స్ తో, సరికొత్తగా హంగులతో పత్రికా ప్రపంచంలో కొత్త ఒరవడి సృష్టించాలని,

తమ పత్రిక హంగులకు ఆకర్షితులై పాఠకులు ముగ్ధులవ్వాలని, క్షణం క్షణం వీక్షణలు పెరగాలని

ఇలా ఎన్నో...ఎన్నెన్నో కలలు, కోరికలు.

కాని ఏ పత్రిక చూసినా ఏముంది గర్వకారణం?

కొత్త శీర్షికలతో అదే పాత కంటెంటు,

మూస పోసిన అవే పాత కథలు.

ఎవరెంత కొత్తగా ఆలోచించినా పాత అలవాట్లు మాత్రం మనిషిని వదిలిపెట్టడంలేదు.

ఈర్ష్యా ద్వేషాలు, కులమత మౌఢ్యాలకతీతంగాను, శాంతిసామరస్యాలను పెంపొందించేలా
మనిషి మనుగడ సాగించలేనప్పుడు కొత్త ఎంతైనా రోతగానే వర్ధిల్లుతుంది.

ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా కొత్తదనాన్ని , కొత్త గమనంతో వస్తున్న కథలను అందిస్తున్న
కథామంజరి లాంటి పత్రికలకు పాఠకుల నిరంతరాదరణ ఎప్పుడూ కొత్తగానే గోచరిస్తుంది.